సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 29-9-2023 ₹30/-


## అంతర్జాతీయ శాసనానికి ఆద్యుడు

# ముహమ్మద్ ప్రవక్త (స)



సీరతున్నబీ
ప్రత్యేక సంచిక

# గీతురాయి వారపత్రిక

# GEETURAI WEEKLY


Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Mail : geeturaiweekly@gmail.com

Website: www.geeturai.com


సంపుటి 45 సంచిక: 39 హైదరాబాద్
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023 రూ.30-00
13 రబీఉల్ అవ్వల్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

ఏ వ్యక్తి ఒకసారి నాకు దురూద్ పంపిస్తాడో ఆ వ్యక్తిపైన దేవుడు పదిసార్లు తన కారుణ్యాన్ని కురిపిస్తాడు.

- ముహమ్మద్ ప్రవక్త (స)


సంపాదకులు
**ఎస్.ఎమ్. మలిక్**

అసోసియేట్ ఎడిటర్
**అబ్దుల్ వాహెద్**

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
**ముహమ్మద్ ముజాహిద్**

సబ్ ఎడిటర్
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్**


**సాఫల్య బోధన**

ఆటవికం అజ్ఞానం
నడయాడిన వేళ
ప్రవక్త పాదస్పర్శతో
పులకించిన నేల !

తన బోధన వింటేనే
మారునంట బతుకు
కాదూకూడదు అంటే
ఔతుందట చితుకు!!

- యం.డి. ఉస్మాన్‌ఖాన్

## లోపల...


| | | |
|---|---|---|
| నవయుగ పురుషుడు ముహమ్మద్ (స) | ...... | 04 |
| అంతర్జాతీయ శాసనానికి ఆద్యుడు ప్రవక్త(స) | ...... | 05 |
| ప్రవక్త సందేశం | ...... | 11 |
| అంతిమ దైవగ్రంథంలో ముహమ్మద్(స) | ...... | 14 |
| ఉషోదయం అవుతేనే గాని సూర్యోదయం అవదు | ...... | 20 |
| ఆయన (స) అడుగుజాడలే... | ...... | 23 |
| సంక్షేమ ప్రదాత ముహమ్మద్ ప్రవక్త(స) | ...... | 24 |
| స్త్రీల పట్ల దైవప్రవక్త (స) కారుణ్యం | ...... | 26 |
| మహనీయుని (స) మహోన్నత ప్రణాళిక | ...... | 28 |
| మనోవాంఛల దాస్యం మంచిది కాదు | ...... | 31 |
| మహానగరిలో మహాప్రవక్త(స) మహితోక్తులు | ...... | 32 |
| గెట్ టుగెదర్ | ...... | 34 |
| ఆయన(స) జీవితపు కోణాలన్నీ ఆదర్శప్రాయమే! | ...... | 37 |
| సద్గుణ శోభితుడు | ...... | 39 |
| మహాప్రవక్త(స) జననం సర్వమానవాళికి శుభోదయం | ...... | 43 |
| నిండు చందురుడు నిరతం నీ మోమై నిలిచె | ...... | 46 |
| గొర్రెల కాపరి అయిన రాజాధిరాజు | ...... | 48 |

# నవయుగ పురుషుడు ముహమ్మద్ (స)

ఆయన కరుణా స్వరూపుడు, దయార్ద్ర హృదయుడు, మానవతామూర్తి, దైవ సందేశ హరుడు!

ఆయన సాధారణ మానవుడు, అసాధారణ వ్యక్తి, అనుపమ భర్త, అత్యుత్తమ తండ్రి, ప్రేమమయుడయిన తాత, నిజాయితీ పరుడయిన వ్యాపారి, కష్ట జీవి!

ఆయన శాసనకర్త, రాజ్య నిర్మాత, పరిపాలకుడు, సేనాని, పరిపాలనాదక్షుడు, దూరదృష్టిగల వ్యవహారకర్త!

ఆయన సాధారణ మనిషి, సామాన్య మానవుడు, నిరాడంబర జీవి, విశేష వ్యక్తి, ఆదర్శ మానవుడు!

ఆయన ఉద్యమ వైతాళికుడు, రాజకీయ నాయకుడు, సామాజిక సంస్కర్త, అసాధారణ శిక్షకుడు, అనన్య వక్త, ప్రవక్త!

ఆయన విప్లవకారుడు, అనితర సాధ్య సందేశ దాత, మనిషి... మట్టి మనిషి!
ఆయన సత్యవ్రతుడు, నిజాయితీ తత్పరుడు, వాగ్దాన పాలకుడు, న్యాయ పక్షపాతి,
విద్వేష ద్వేషి, వంచనా వ్యతిరేకి!

ఆయన అనాథ బాలుడు, ఎడారి పువ్వు, విశ్వ నాయకుడు, మానవ మహోపకారి, సురక్షిత మకరందం,
విశ్వ కారుణ్యం, ఆదరణ కర్త, స్తవనీయుడూ స్తవనకర్త, ఆదర్శమూర్తి!

ఆయన సర్వదా ఆదర్శనీయుడు-సమాజంలో వ్యక్తిగా, కుటుంబ పెద్దగా, భర్తగా, తండ్రిగా, మిత్రునిగా, వ్యాపారిగా, రాజకీయవేత్తగా - ఆదర్శనీయుడు!

ఆయన విప్లవకారునిగా, ఆర్థిక సిద్ధాంతకర్తగా, దైవ సందేశ పునరుద్ధరణకర్తగా,
ఆధునిక రాజకీయ సంస్కర్తగా - ఆదర్శనీయుడు!
ఆయన అంతర్జాతీయ శాసనానికి ఆద్యుడు, అభ్యుదయ నీతిశాస్త్ర నిర్మాత!

ఆధునిక నాగరికతకు మూలవిరాట్టు, మానవ ఏకతా సిద్ధాంతకర్త,
విశ్వ ప్రభువు దైవం ఏకత్వ ఘోషణకర్త!

ఆయన-ఒకే దైవం, ఒకే మానవ సంతానం, ఒకే జీవన విధానం-సిద్ధాంతానికి ఆదర్శం!

## ఆయనే ముహమ్మద్ (స)!

విశ్వ జనీన సత్యం, ఆయన అందజేసిన సందేశం!
సర్వ జనీన వికాస మార్గం, ఆయన నెరిపిన ఉద్యమం!
మానవ ఏకతా ప్రధానం, ఆయన నెలకొలిపిన సమాజం!
ప్రభు సన్నిధిలో సమాధానం, ఆయన గరిపిన సుశిక్షణా మూలం!
ఒకే దైవ భావం, ఆయన ధర్మ సిద్ధాంతం!
శాంతియుత ధ్యేయసాధనం, ఆయన బోధనా సారం!
పరలోక సాఫల్యం, ఆయన నిర్దేశిత జీవన లక్ష్యం!
ఇహలోక జీవన సాఫల్యం, ఆయన పంథా!
పరమ ప్రభువు ఆదేశ విధేయం, ఇహలోక జీవన విజయం!
పరమ ప్రభువు అభీష్ట సాధనం, మానవ జీవన ధ్యేయం!
ప్రవక్త విధేయత గమ్యం, ప్రభు అభీష్ట సాధనం!
ప్రపంచ ముస్లిమ్ సముదాయం, మానవ సమైక్యతా స్వరూపం!

ఎస్.ఎమ్. మలిక్




**అబ్దుల్ వాహెద్**

**ప్రవక్త ముహమ్మద్ (స)** గురించి మనం మాట్లాడుతున్నామంటే అర్థం నేటికి పద్నాలుగు శతాబ్దాల ముందు కాలం గురించి మాట్లాడుతున్నాం. అప్పటి ప్రపంచం ఎలా ఉండేది? నేటి ప్రపంచం వేరు, అప్పటి ప్రపంచం వేరు. కాని అప్పుడు కూడా అగ్రరాజ్యాలు ఉండేవి. నేటి మాదిరిగానే. అప్పటి అగ్రరాజ్యాలు రెండు. తూర్పున బైజాంటైన్ సామ్రాజ్యం ఇది రోమన్ సామ్రాజ్యానికి కొనసాగింపు. రెండవది సాసానీ సామ్రాజ్యం. ఇది పర్షియన్ సామ్రాజ్యానికి కొనసాగింపు. అప్పట్లో భారత దేశంలోని గుప్తుల సామ్రాజ్యం కూడా పెద్దదే. అప్పట్లో అరేబియాలో చిన్న చిన్న తెగల గణరాజ్యాలు కూడా ఉండేవి. వాటికి అంత బలం లేదు. గుప్తుల సామ్రాజ్యం ఇస్లాం రాక మునుపే పతనమయ్యింది. భారతదేశంలో చాళుక్యుల కాలం అది. అరేబియాలో ప్రవక్త ముహమ్మద్ (స) నాయకత్వంలో ఇస్లామ్ విస్తరించడం ప్రారంభమైన కాలం. అప్పట్లో సాంకేతికంగా ప్రపంచం చాలా వెనుకబడి ఉంది. ఇప్పటి ఆధునిక యంత్రాలు లేవు. చాలా పనులు నేడు కృత్రిమ మేథస్సుతో జరుగుతున్నాయి. అప్పట్లో చిన్న చిన్న పనులు కూడా మనిషి స్వహస్తాలతో చేసుకోవలసి ఉండేది. నేడు ఈ మెయిల్‌తో సందేశం పంపేస్తాం. లేదా వాట్సప్ చేసేస్తాం. కాని అప్పట్లో ఒక సందేశం పంపాలంటే మనిషికి ఇచ్చి పంపాలి, ఎంత దూరమైనా సరే. అంటే ఒక సందేశం దూర ప్రాంతానికి వెళ్ళాలంటే కొన్ని నెలలు, ఒక్కోసారి సంవత్సరాలు పట్టేది.

అయితే శాస్త్ర సాంకేతిక పరిశోధనలు జరుగుతూ ఉండేవి. మనిషి ఎల్లప్పుడు కొత్త విషయాలను కనుగొనే అన్వేషణ లోనే ఉన్నాడు. బగ్దాద్, అలెగ్జాండ్రియాల్లో గొప్ప విద్యాలయాలు ఉండేవి. అంతకు ముందు గ్రీకు, రోమన్, భారతీయ ప్రాచీన నాగరికతలు, విద్యాసంస్థలు ఉండేవి. వర్తక వాణిజ్యాల విషయా నికి వస్తే సిల్కు రోడ్డు ద్వారా వివిధ ప్రాంతాల మధ్య వాణిజ్యం జరిగేది. నేటి మాదిరి దేశాల సరిహద్దులు లేవప్పుడు. అందువల్ల అంతర్జాతీయ వాణిజ్యం అని పూర్తిగా చెప్పలేము. కాన్స్టాంటి నోపుల్ అంటే నేటి టర్కీ రాజధాని ఇస్తాంబుల్, అలెగ్జాండ్రియా తదితర నగరాలకు సిల్కు రోడ్డు ద్వారా వాణిజ్యం జరిగేది. ఇండియా, చైనా, మధ్యప్రాచ్యంలో అనేక సంస్కృతులు వర్ధిల్లాయి. సమాజంలో అనేక నిమ్నోన్నతలు ఉండేవి. పాలకులు, కులీనులు, సాధారణ ప్రజలు, బానిసలు. ప్రపంచంలో అనేక చోట్ల బానిసత్వం అప్పట్లో ఉండేది. ఆధునిక దేశాలు లేదా నేషన్ స్టేట్స్ అనే భావన అప్పట్లో లేదు. చక్రవర్తులు, రాజులు, తెగల నాయకులు తమ అధికారపరిధిలో పాలించేవారు. యుద్ధాలు, సామ్రాజ్య విస్తరణలు, రక్తపాతాలు సాధారణంగా జరుగుతూ ఉండేవి. అప్పటి కాలం గురించి మనం మాట్లాడు కుంటున్నాం.

'అంతర్జాతీయం' అనే పదానికి అప్పట్లో అర్థమే లేదు. ఎందుకంటే, ఆధునిక నేషన్ స్టేట్స్ లేదా దేశాలు అప్పట్లో లేవు. కాని చక్రవర్తులు, రాజులు, తెగల నేతల పాలనాపరిధిలో ఉన్న భూభాగాలు ఉండేవి, కొందరి అధికార పరిధిలో విశాల భూభాగాలుండేవి, కొందరి అధికార పరిధిలో పరిమితమైన భూభాగం ఉండేది. ఈ పాలకుల మధ్య సంబంధాలనే అప్పట్లోని అంతర్జాతీయ సంబంధాలుగా భావించాలి. కాబట్టి నేడు మనకు తెలిసిన ఆదునిక అంతర్జాతీయ శాసనాలనే భావనే అప్పట్లో లేదు. ప్రవక్త ముహమ్మద్ (స) ఆగమనం తర్వాత, ఆయన్ను దైవం ప్రవక్తగా నియమించిన తర్వాత దివ్యఖుర్ఆన్ గ్రంథం ద్వారా మానవాళికి అవసరమైన మార్గదర్శక బోధనలను పంపించాడు. ఈ బోధనల వెలుగులో ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరణలు, ఆయన చెప్పిన మాటలు ఇస్లామీయ శాసనాంగం అయ్యాయి. ఇదే షరీఅత్.

అంతర్జాతీయ సంబంధాల విషయంలో ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు ఏమున్నాయని ప్రవక్త జీవిత చరిత్రను పరిశీలిస్తే ఆధునిక అంతర్జాతీయ శాసనాలకు అక్షరాలు నేర్పింది ఆయనే అని అర్థమవుతుంది. వివిధ సముదాయాల మధ్య ఒప్పందాలు, అంగీకారాలు ఆయన జీవిత కాలంలో అనేకం జరిగాయి. ఇరుగు పొరుగు తెగలతో ఒప్పందాలు చేసుకోవడం ద్వారా శాంతియుత సహజీవనానికి, ముస్లిములు, ముస్లిమేతరుల హక్కుల పరిరక్షణకు ఆయన ప్రయత్నించారు. అప్పట్లో తెగలంటే నేటి దేశాలుగానే భావించాలి. ఎందుకంటే ఆయా తెగల నాయకులకే ఆ తెగ నివసించే ప్రాంతంలో సర్వాధికారాలుండేవి. ఆయా తెగలతో ఒప్పందాలు నిజానికి నేటి అంతర్జాతీయ ఒప్పందాల స్థాయి కలిగినవి.

ఈ ఒప్పందాలు ఇష్టమొచ్చినట్లు చేసుకున్న ఒప్పందాలు కావు. దివ్యఖుర్ఆన్ బోధనల వెలుగులో, ఖచ్చితమైన నియమ నిబంధనలకు లోబడి ఆయన ఒప్పందాలు చేసుకున్నారు. న్యాయం, పరస్పర గౌరవమర్యాదలు, దాడులు చేయకపోవడం, దాడులు జరిగితే సహకరించడం వంటి మౌలిక నియమ నిబంధనల ప్రాతిపదికన ఈ ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందాల్లో కీలకమైన అంశం గమనిస్తే వ్యక్తులు, సము దాయాలన్నీ సమానం, అందరితోను సమాన వ్యవహారశైలి ఉ ండాలన్న సూత్రం ప్రాతిపదికగా కనిపిస్తుంది. ఇవన్నీ మత విశ్వాసాలకు అతీతంగానే కనిపిస్తాయి. అంటే ముస్లిములకు, ముస్లిమేతరులకు మధ్య భేదభావం చూపించడం అనేది ఎక్కడా కనిపించదు. ప్రవక్త ముహమ్మద్(స) ఇచ్చిన మాటకు కట్టు బడాలని, ఒప్పందాలను గౌరవించాలని గట్టిగా బోధించిన అనేక ప్రవచనాలు న్నాయి. నేటి ఆధునిక అంతర్జాతీయ శాసనాల్లోను ఇదే మౌలికమైన, కీలకమైన నియమం.

న్యాయసూత్రాలు, మానవ హక్కులు, అణిచివేతల నిషేధం, దాడులను నివారించడం– ఇవన్నీ ప్రవక్త ముహమ్మద్ (స) మాటల్లోను, చేతల్లోను స్పష్టంగా కనిపిస్తాయి. వివిధ తెగల మధ్య కుదిరిన ఒప్పందాల్లోను ఇవి కనిపిస్తాయి. ఇవే మౌలిక నియమాలు నేటి అంతర్జాతీయ మానవహక్కుల్లోను, మానవీయ చట్టంలోను, అంతర్జాతీయ చట్టాల్లోను తర్వాతి కాలాల్లో చోటు చేసుకున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ సూత్రాలు అంతర్జాతీయ చట్టాల రూపకల్పనకు తోడ్పడ్డాయి. ఆధునిక అంతర్జాతీయ శాసనం యూరపులో సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance) తరువాత ప్రారంభమయ్యిందని అంటుంటారు. ఆధునిక చరిత్ర ప్రారంభంలో అంతర్జాతీయ ఒప్పందాలు, సంప్రదాయాల పునాదులపై ఈ చట్టాలు ఏర్పడ్డాయని భావిం చడం జరుగుతుంది. కాని నిశితంగా పరిశీలిస్తే ఈ ఆధునిక ఒప్పందాలు, అంతర్జాతీయ వ్యవహారాల సంప్రదా యాల వెనుక

సుదీర్ఘకాలంగా ఇస్లామీయ సామ్రాజ్యం ఆచరించి చూపించిన నమూనా పునాదిగా కనిపించి తీరుతుంది. ఈ నమూనా ప్రవక్త ముహమ్మద్ (స) జీవితకాలంలో ఆచరించి చూపించిందే.

ఉదాహరణకు యుద్ధ నియమాలను ప్రపంచంలో ఖచ్చితంగా ప్రవేశపెట్టింది ప్రవక్త ముహమ్మద్ (స). నేడు అంతర్జాతీయ న్యాయసూత్రాల్లో Just war theory వెనుక ఈ నియమాల ప్రభావమే ఉందంటే అతిశయోక్తి లేదు. అంతర్జాతీయ చట్టం పౌరులకు రక్షణ కల్పించాలని చెబుతుంది. నిరాయుధులపై దాడి చేయరాదని చెబుతుంది. యుద్ధఖైదీల పట్ల మానవీయంగా వ్యవహరించాలని చెబుతుంది. యుద్ధాల్లో అనవసర ప్రాణ నష్టాలకు పాల్పడరాదని చెబుతుంది. ఆచరణలో ఇవన్నీ ఎంత వరకు నిలబెట్టుకుంటారన్నది నేటి యుద్ధాలను పరిశీలిస్తే తెలిసి పోతుంది. కాని ఈ సూత్రాలన్నీ ప్రవక్త బోధనల్లో కనిపించడమే కాదు, అప్పటి యుద్ధాల్లోను ఈ బోధనలకు కట్టుబడిన అనేక ఉదాహరణలు మనకు చరిత్రలో కనిపిస్తాయి. అలాగే దౌత్యపర మైన ఒప్పందాలు ఆధునిక అంతర్జాతీయ వ్యవహారాల్లో మనం రోజు వింటూ ఉంటాం. ఈ ఆధునిక భావన ప్రవక్త కాలంలోను కనిపిస్తుంది. వివిధ తెగలతో అనేక ఒప్పందాల్లో ఈ సూత్రాలే మనకు కనిపిస్తాయి. మతస్వేచ్ఛ, శాంతి, పరస్పర సహకారం వంటి నియమాలు మనకు ఆధునిక ఒప్పందాలు, దౌత్య వ్యవహారాల్లో ప్రముఖంగా కనిపిస్తుంటాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఆనాటి ఒప్పందాలే ఆధునిక వ్యవహారాల్లో నియమ నిబంధనలకు పునాదులయ్యాయి.

యుద్ధాల్లో నిరాయుధులకు రక్షణ కల్పించడమన్నది ఇస్లామీయ యుద్ధ నియమాల్లో ముఖ్యమైనది. ఇందులో మహిళలు, పిల్లలు, నిరాయుధులైన వారిపై దాడి చేయరాదని స్పష్టమైన నిర్దేశాలు న్నాయి. ఇవన్నీ మనకు ఆధునిక అంతర్జాతీయ మానవీయ చట్టంలోను కనిపించే విషయాలే. ఇంకా చెప్పాలంటే, యుద్ధ ఖైదీలకు రక్షణ కల్పించాలన్న నియమం మనకు స్పష్టంగా దివ్య ఖుర్ఆన్‌లోనే కనిపిస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స) వివాదాలకు శాంతియుత పరిష్కారం సాధించాలని నొక్కి చెప్పారు. సలహాలు, సంప్రదింపులు, మధ్యవర్తుల సహకారం వంటి పద్ధతుల ద్వారా వివాదాల పరిష్కారానికి ఆయన చూపించిన మార్గమే నేడు సలహా సంప్రదింపులతో వివాదాల పరిష్కారం అనే భావనగా కనిపిస్తుంది. అనేకవిధాలుగా మనకు అంతర్జాతీయ న్యాయ సూత్రాల్లో ప్రవక్త బోధనల ప్రభావం కనిపిస్తుంది.

క్లుప్తంగా చెప్పాలంటే న్యాయబద్ధమైన యుద్ధం Just war, దౌత్య ప్రయత్నాలు, నిరాయుధులకు రక్షణ, శాంతియుతంగా వివాదాల పరిష్కారమనే పద్ధతులు, సూత్రాలు ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా నేటి ఆధునిక అంతర్జాతీయ శాసనాల వరకు వచ్చాయని భావించాలి. ఈ సూత్రాలే అంతర్జాతీయ సంప్రదా యాలకు పునాదులయ్యాయి. ప్రస్తుత అంతర్జాతీయ న్యాయ సూత్రాలు రూపొందడానికి భూమికలయ్యాయి.

ప్రవక్త ముహమ్మద్ (స)కు ముందు ప్రపంచంలో ఇలాంటి విశ్వజనీన భావనేదీ లేదు. వివిధ సాంప్రదాయిక, ప్రాంతీయ, తెగల ప్రధానమైన చట్టాలు, కట్టుబాట్లు ఉండేవి. ఈ చట్టాలు, సంప్రదాయాల ప్రకారం వివిధ తెగలు, రాజ్యాలు వ్యవహ రించేవి. గమనించవలసిన విషయమేమిటంటే, అప్పట్లో అంతర్జాతీయ సంబంధాలు సాధారణంగా బలాబలాల తూకంపై, తెగల సంప్రదాయాలపై, తాత్కాలిక ఏర్పాట్లపై ఆధారపడి ఉండేవి. అంతేకాని శాశ్వతమైన, లాంఛనమైన, ఖచ్చితమైన న్యాయచట్రం అంటూ ఏదీ ప్రవక్త ముహమ్మద్ (స) కు ముందు కాలంలో లేదు. ఉదాహరణకు సాంప్రదాయిక చట్టాలు వివిధ తెగలకు భిన్నరూపాల్లో ఉండేవి. ఈ సాంప్ర దాయిక చట్టాలు మతం, సమాజం, సంస్కృతి తదితర అంశాలపై ఆధారపడి ఉండేవి. మరోవైపు తెగల మధ్య సంబంధాలు రక్త సంబంధాల ప్రాతిపదికన కూడా ఉండేవి. వివాదాలు, ఘర్షణలు తలెత్తితే తెగల మండళ్ళు లేదా లాంఛ నేతర సంప్రదింపుల ద్వారా అప్పుడప్పుడు పరిష్కరించుకోవడం కూడా జరిగేది. తరచూ యుద్ధాలు జరిగేవి. యుద్ధాల్లో నియమనిబంధలేవీ లేవు. అత్యంత క్రూరంగా శత్రువులను అణచివేయడమే ఉండేది. నిరాయుధులు, పిల్లలు, మహిళలన్న విచక్షణ కూడా సాధార ణంగా ఉండేదికాదు. దౌత్యసంబంధాలనే భావన కూడా అప్పట్లో లేదు. పాలకుల వ్యక్తిగత రాయబారుల ద్వారా సందేశాలు పంపించడం మాత్రమే ఉండేది. అలాంటి రాయబారులకు దౌత్యపరమైన రక్షణ అనేది ఏదీ ఉండేది కాదు. రాయబారులకు భద్రత అన్నది దాదాపు లేదనే చెప్పాలి. చాలా సందర్భాల్లో వివిధ తెగలు, లేదా రాజ్యాల వ్యవహారశైలి వారి మతాచారాల ప్రకారం ఉండేది. మతపెద్దలకు నిర్ణయాధికారాలు ఉండేవి. వాణిజ్యం వివిధ ప్రాంతాల మధ్య జరిగినా అది పరస్పర లాభాలు పునాదిగా జరిగేది, అంతే తప్ప ఖచ్చితమైన న్యాయచట్రం ఏదీ ఉండేది కాదు.

ఈ నేపథ్యంలో మనం ప్రవక్త ముహమ్మద్(స) బోధనలను

చూడాలి. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ప్రవక్త ముహమ్మద్(స) బోధనలు, ఆయన ఆచరణలు అప్పటి ప్రపంచంలో సరికొత్త భావనలను ప్రవేశపెట్టాయి. ఈ భావనలే అంతర్జాతీయ వ్యవహారాలపై తర్వాతి కాలాల్లో గొప్ప ప్రభావాన్ని వేశాయి. ఇందులో మతపరమైన మైనారిటీల హక్కులను గుర్తించడం కూడా ఒకటి. యుద్ధ నియమాలు, రాయబారులకు రక్షణ, యుద్ధఖైదీల హక్కులు ఇలాంటి అనేక భావనలు నెమ్మదిగా చోటు చేసుకున్నాయి. అంతర్జాతీయ శాసనాలు మధ్యయుగాల్లో, ఐరోపాలో సాంస్కృతిక పునరుజ్జీవనం తర్వాతి కాలాల్లో యూరపులో ప్రారంభమయ్యాయని చాలా మంది విశ్వసిస్తున్నప్పటికీ, ఈ భావనలకు పునాదులు మనకు ఇస్లామీయ చట్టాల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రారంభ కాలాల్లోని ఇస్లామీయ న్యాయనిపుణులు, ఉదాహరణకు అల్ షేబానీ, అల్ మవార్దీ వంటి వారు అంతర్జాతీయ సంబంధాలపై, వివిధ దేశాల వ్యవహారాల శైలి గురించి వివరణాత్మకంగా గ్రంథాలు రాశారు. ఈ గ్రంథాలు తర్వాతి కాలాల్లో అంతర్జాతీయ శాసనాల రూపకల్పనపై ప్రభావం వేశాయి.

ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో తెగల పాలనా భూభాగం దేనికదే ఒక రాజ్యంగా ఉండేది. రోమన్, పర్షియన్ సామ్రాజ్యాలు మహాశక్తిమంతమైన సామ్రాజ్యాలుగా ఉండేవి. వివిధ రాజ్యాలు సామంత రాజ్యాలుగా ఉండడమో లేక మహాసామ్రాజ్యం తరపున నియమించబడిన గవర్నర్ పరిపాలనలో ఉండడమో జరిగేది. ఈ పరిస్థితుల్లో ఒక చిన్న ముస్లిం రాజ్యం రూపుదిద్దుకుంటున్నప్పుడు ప్రవక్త ముహమ్మద్ (స) చూపించిన రాజనీతి, దౌత్యనీతికి సంబంధించిన కొన్ని ఉదాహరణలు మనకు ఆ కాలంలో ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు, ఆచరణలు నేటి అంతర్జాతీయ శాసనానికి ఎలా తోడ్పడ్డాయో అర్థమవుతుంది. నేడు అంతర్జాతీయ శాసనంలో అత్యంత కీలకమైన విషయం శాంతి స్థాపన అన్నది మరిచిపోరాదు. ఇదే సూత్రం అప్పట్లో ప్రవక్త ముహమ్మద్(స) బోధనల్లో, ఆచరణల్లో ముఖ్యంగా కనిపిస్తుంది.

ఇలాంటి ఒప్పందాల్లో క్రీ.శ.628లో జరిగిన హుదైబియా ఒప్పందం గురించి ప్రస్తావించాలి. అంతర్జాతీయ సంబంధాలు, దౌత్యనీతి, రాజనీతి ఇవన్నీ మనకు ఈ హుదైబియా ఒప్పందంలో కనిపిస్తాయి. మదీనాలో ఇస్లామీయ రాజ్యానికి, మక్కాలోని ఖురైష్ తెగల రాజ్యానికి మధ్య కుదిరిన ఒప్పందం ఇది. ఈ ఒప్పందం పదేళ్ళ కొరకు కుదిరిన నిర్దిష్ట ఒప్పందం. నేటి ఆధునిక కాలంలోను మనకు నిర్దిష్ట ఒప్పందాలు, కాల్పుల విరమణ అంగీకారాలు తెలుసు. ఈ ఒప్పందాలు శాంతి స్థాపన ముఖ్య లక్ష్యంగా జరుగుతుంటాయి. జాతీయ రాజకీయాలు ఎలా ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా ఇలాంటి ఒప్పందాల్లో కొంతమేరకు సర్దుబాట్లు చేసుకోవటం, కొంత వెనక్కి తగ్గడం, పట్టువిడుపులు చూపించడం అనేది దౌత్యనీతి. పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం కుదిరిన ఈ ఒప్పందంలోను మనకు ఈ దౌత్యనీతి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆరేళ్ళుగా ఎడతెగకుండా మదీనా, మక్కాల మధ్య ఘర్షణలు, యుద్ధాలు కొనసాగుతున్నప్పుడు ఈ ఒప్పందం ద్వారా పదేళ్ళ శాంతియుత పరిస్థితులను ప్రవక్త తన సంప్రదింపుల రాజనీతి ద్వారా సాధించారు. ఈ ఒప్పందం కోసం ఆయన అవసరమైన పట్టువిడుపు చూపించారు. శాంతిసాధన ముఖ్యలక్ష్యంగా అవసరమైన రాజీ ధోరణి ప్రదర్శించారు. ఆయన రాజీ ధోరణి ప్రదర్శించడం, వెనక్కి తగ్గినట్లు కనిపించడం స్వయంగా ఆయన సన్నిహిత అనుయాయుల్లో కూడా చాలా మందికి నచ్చలేదు. ఇది సహజమే. నేడు కూడా అంతర్జాతీయ వ్యవహారాల్లో చేసుకునే ఒప్పందాలను జాతీయ స్థాయిలో విమర్శించడం మనకు కనిపిస్తూనే ఉంటుంది. ఇది చాలా దేశాల వ్యవహారాల్లో జరుగుతుంది. కాని శాంతిసాధనే ముఖ్యమైనప్పుడు జాతీయ స్థాయి వ్యవహారాలను పక్కన పెట్టి పట్టువిడుపులు చూపించాలన్న దౌత్యనీతికి ఒక గొప్ప పాఠం వంటిది హుదైబియా ఒప్పందం. ఈ ఒప్పందం తర్వాత మదీనా రాజ్యం బలహీనంగా కనిపిస్తుందనుకున్న వారి అంచనాలు ఆ తరువాత తారుమారయ్యాయి. శాంతియుత వాతావరణమే ఇస్లాంకు అవసరం. హుదైబియా ఒప్పందం నిజానికి ప్రవక్త (స) సాధించిన ఒక గొప్ప విజయంగా చరిత్రలో నిలిచిపోయింది. ఈ శాంతి కాలంలోనే ఇస్లామ్ శరవేగంగా విస్తరించింది. ఇస్లామ్ అంటేనే శాంతి.

మరో ఉదాహరణ మదీనాలో ముస్లిం రాజ్యం స్థాపించిన తర్వాత ఈ రాజ్యానికి ఒక రాజ్యాంగాన్ని కూడా ప్రవక్త ముహమ్మద్ తీసుకొచ్చారు. ఇది మదీనా చార్టర్‌గా కూడా పేర్కొనబడుతుంది. మదీనాలోని వివిధ సముదాయాలు, తెగల విధులు, బాధ్యతలు, హక్కుల సమగ్ర వివరణ ఇందులో ఉంది. ముస్లిములు, యూదులు, ఇతర తెగలకు సంబంధించి వారి విధి బాధ్యతలు, హక్కుల ప్రస్తావన స్పష్టంగా ఉన్న డాక్యుమెంట్ ఇది. దీనివల్ల వివిధ తెగల మధ్య ఒక విధమైన విశ్వాసం, నమ్మకం, సామాజిక సంబంధం ఏర్పడ్డాయి. వివిధ తెగల

మతస్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తిని కూడా ఈ డాక్యుమెంట్ గుర్తించింది. ఆధునిక కాలంలోని అంతర్జాతీయ చట్టంలో కనిపించే మైనారిటీ హక్కులు, మతసహనం వంటి భావాలకు పునాదులు ఇక్కడే ఉన్నాయి. ఈ ఒప్పందాలను మరింత నిశితంగా పరిశీలిద్దాం. ప్రవక్త మదీనా వచ్చిన తర్వాత ఎదుర్కొన్న సమస్యలు చాలా ఉన్నాయి. మదీనాలో యూదులు బలంగా ఉండేవారు. మదీనాలోని వివిధ తెగలతో వారికి సంబంధాలున్నాయి. యూదులకు అప్పటికే ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల తీవ్ర వ్యతిరేకత ఉంది. కాని మదీనాలో ప్రవక్త ప్రజాదరణ చూసిన తర్వాత వారు పైకి మాత్రం వ్యతిరేకతను ప్రదర్శించలేదు. కాని ఈ వ్యతిరేకత గురించి ప్రవక్తకు బాగా తెలుసు. అందువల్ల ఖచ్చితమైన ఒప్పందాలతో శాంతిభద్రతల వాతావరణం ఏర్పరచాలని నిర్ణయించారు. యూదులతో ఒప్పందం చేసుకున్నారు. వారికి పూర్తి మతస్వేచ్ఛ, మతాచారాల స్వేచ్ఛ, ఆస్తిహక్కు విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇస్తూ ఒప్పందం చేసుకోవాలనుకున్నారు. ఈ ఒప్పందం తర్వాత ముస్లిములకు సంబంధించిన వివిధ తెగల మధ్య కూడా సంబంధాలు మెరుగు పడ్డాయి. ఈ ఒప్పందం తర్వాత మదీనా దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని తెగలన్నీ ఒక గణతంత్ర ప్రజాస్వామిక రాజ్యంగా ఏర్పడ్డాయి. ఒప్పందాల ద్వారా శాంతిభద్రతలను సాధించడానికి ప్రవక్త ఆ తర్వాత వివిధ తెగలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆ విధంగా ఒప్పందం లేదా అల్ అహద్ అనేది ఇస్లామీయ అంతర్జాతీయ వ్యవహారాల్లో ఒక ముఖ్యాంశం అయ్యింది. నిజానికి ఒప్పందం అనేది ఇస్లాంలో ప్రతి వ్యవహారంలోను కీలకమైనది. చివరకు వ్యక్తిగతంగా ఆడ మగ కలిసి జీవించడానికి చేసుకునే పెళ్ళి కూడా ఇస్లాములో ఒక ఒప్పందమే అయ్యింది. ఒప్పందంలో చేసిన వాగ్దానాలకు ముస్లిములు ఖచ్చితంగా కట్టుబడాలని స్వయంగా దివ్యఖుర్ఆన్ ఆదేశించింది. "చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది" (దివ్య ఖుర్ఆన్: 17:34)

"ముస్లిములు తాము చేసుకున్న ఒప్పందాల షరతులకు కట్టుబడాలి" అని ప్రవక్త ముహమ్మద్ (స) ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. యుద్ధాలకు సంబంధించిన స్పష్టమైన నియమావళి కూడా ఈ కాలంలోనే క్రోడీకరించడం జరిగింది. ఈ నియమాలను ముస్లిము సైన్యాలు ఎన్నడూ అతిక్రమించలేదు. అంతేకాదు దౌత్యవేత్తలు, రాయబారులకు రక్షణ కల్పించే నియమాలను ఖచ్చితంగా ప్రవేశపెట్టింది ప్రవక్త ముహమ్మద్ (స). మరణానికి కొన్ని రోజుల క్రితం కూడా ఆయన(స), రాయబారుల పట్ల మర్యాదగా మసలుకోవాలని తన సహచరులకు గట్టిగా తాకీదు చేశారు. మనం గమనించవలసిందేమిటంటే, పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం నేటి మాదిరి అంతర్జాతీయ శాసనం, జెనివా ఒప్పందాలు ఏమీ లేని కాలంలో, క్రూరమైన అమానుష యుద్ధాల ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడమే జరుగుతున్న కాలంలో సలహా సంప్రదింపులు, దౌత్యనీతి, పరమత సహనం, దౌత్యవేత్తలకు రక్షణ, యుద్ధాల్లో మానవీయవిలువలు వంటివి ప్రవేశపెట్టి వాటికి కట్టుబడిన కారుణ్యమూర్తిగా ప్రవక్త ముహమ్మద్ (స) కనిపిస్తారు. ఆయన మాటలు, చేతలే తర్వాతి కాలాల్లో అంతర్జాతీయ శాసనాలకు బీజాలేశాయి.

ఒక హదీసులో ప్రవక్త (స) చెప్పిన మాటలు కూడా గమనార్హమైనవి, "మీ సోదరుడికి సహాయం చేయండి, అతడు బాధితుడైనా, దౌర్జన్యపరుడైనా సరే" అన్నారు. ఈ మాటలు విన్న అనుచరులు ప్రవక్తా (స) దౌర్జన్యపరుడికి సహాయం చేయడమేమిటి అని ప్రశ్నించారు. ప్రవక్త జవాబిస్తూ, అతన్ని దౌర్జన్యం చేయకుండా నిరోధించడమే అతనికి చేసే సహాయం అన్నారు. నిజానికి ఈ హదీసులో అంతర్జాతీయ నియమాలున్నాయి. అణిచివేత, అన్యాయం, దౌర్జన్యాలను నిరోధించే సూత్రాలు ఇందులో ఉన్నాయి. ఇది వ్యక్తిగత స్థాయిలో చూస్తే ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక బాధితుడు, ఒక దౌర్జన్యపరుడిగా కనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో దౌర్జన్యపరుడిని అడ్డుకోవడం, నిరోధించడం, అతను తన స్వంత తమ్ముడైనా, కొడుకైనా అతన్ని ఆపడం అనే బోధనలో గొప్ప మానవీయ విలువలున్నాయి. అలా ఆపడం ద్వారా నిజానికి అతనికి సహాయం చేస్తున్నామనే భావన ఉంది. అతనికి వ్యతిరేకంగా హాని చేయడం లేదన్న బోధన ఉంది. ఇదే హదీసును సాముదాయిక పరిధిలో విస్తరించి చూస్తే మరో భావం కనిపిస్తుంది. ఒక రాజ్యం మరో రాజ్యంపై దౌర్జన్యానికి పూనుకుంటే, ఒక సముదాయం మరో సముదాయంపై దుర్మార్గానికి పాల్పడితే అలాంటి సందర్భాల్లో బాధిత సముదాయానికి సహాయసహకారాలు అందించడమే కాదు, దుర్మార్గానికి పాల్పడుతున్న సముదాయంతో చర్చించాలి. సలహా సంప్రదింపులు జరపాలి, వారిని ఒప్పించాలి, నిజానికి ఇరు వర్గాలను ఒప్పించవలసి ఉంటుంది. ఇదే శాంతిస్థాపన. ఈ శాంతిస్థాపన బాధిత సముదాయానికి మాత్రమే కాదు, దుర్మార్గానికి పాల్పడిన సముదాయానికి లేదా తెగకు లేదా రాజ్యానికి కూడా సహాయం చేయడమే. ఎందుకంటే,

శాంతిస్థాపన ద్వారా ఆ సముదాయం లేదా రాజ్యం కూడా ప్రయోజనం పొందుతుంది. ఇది చాలా కీలకమైన అంశం. నేడు అంతర్జాతీయ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం వహించడానికి ఏర్పడిన అంతర్జాతీయ సంస్థలు, ఒకప్పటి నానాజాతి సమితి, నేటి ఐక్యరాజ్యసమితి– ఇవన్నీ చేసేది మధ్యవర్తిత్వమే. ఈ ప్రయత్నాల్లో కొన్ని రాజ్యాల స్వార్థ వైఖరి శాంతిస్థాపనకు విఘాతం కలిగిస్తుంది, కాని ప్రవక్త (స) సూచించిన మాదిరిగా ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడడం అనేది జరిగి ఉంటే ఈ ప్రయత్నాలు ఫలించేవి. ఇక్కడ గమనించవలసిన మరో హదీసు, చెడును చూస్తే చేత్తో ఆపాలి, లేదా మాటలతో ఆపాలి లేదా కనీసం మనసులోనయినా చెడును చెడుగా భావించాలి. ఈ మాటను కూడా కేవలం వ్యక్తిగత స్థాయిలో మాత్రమే అర్థం చేసుకోరాదు. రాజ్యాల స్థాయిలో కూడా వర్తించే మాట ఇది. ఒక రాజ్యం మరో రాజ్యంపై అణచివేతకు, దురాక్రమణకు పాల్పడుతున్నప్పుడు అంతర్జాతీయ సమాజం ఏం చేయాలి? సాధారణంగా అంతర్జాతీయ వ్యవహారాల్లో బలాబలాల తూకమే అసలు నిర్ణాయక శక్తి. ఈ నిర్ణాయక శక్తి తమ వద్ద ఉండాలనుకున్నాయి కాబట్టే అగ్రరాజ్యాలు అణ్వాయుధాలు సేకరించుకున్నాయి. అందువల్ల వాటి మాట చెల్లుబాటయ్యేలా ఒత్తిడి పెంచగలుగుతున్నాయి. కాని ఈ ఒత్తిడి మంచి కోసం, బాధిత రాజ్యాన్ని ఆదుకోవడం కోసం ఉండాలని సూచిస్తున్నాయి ఈ హదీసులోని మొదటి పదాలు. చేత్తో ఆపడం అనే మాటకు అర్థమిదే. కాని ఈ బలాబలాల తూకం తన పక్షాన లేనప్పుడు అంతర్జాతీయ సమాజం ఏం చేయాలి? చర్చలు, సలహా సంప్రదింపులు, దౌత్యమార్గాల ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని చెబుతుంది హదీసులోని రెండవ భాగం. అంటే మాట ద్వారా ఆపాలి అన్న పదాలు. కాని చర్చలు సంప్రదింపుల ద్వారా కూడా పరిష్కారం సాధ్యం కాని పరిస్థితుల్లో ఏం చేయాలి? విధానపరంగా అంతర్జాతీయ సమాజం దౌర్జన్యం చేస్తున్న రాజ్యాన్ని దురాక్రమక రాజ్యంగా గుర్తించాలి. విధానపరంగా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి. తన స్థాయిలో ప్రతి రాజ్యం దురాక్రమక రాజ్యంతో వ్యవహరిస్తున్నప్పుడు ఆ రాజ్యం దురాక్రమణలకు పాల్పడిన రాజ్యమనే భావనతోనే వ్యవహరించాలి. హదీసులోని మూడో మాట, మనసులో దౌర్జన్యాన్ని దౌర్జన్యంగా భావించాలనే మాటకు అర్థమిదే. నేటి కాలంలో కూడా అంతర్జాతీయ వ్యవహారాల్లో ఈ పద్ధతులు మనకు కనిపిస్తున్నాయి. కాస్త నిశితంగా గమనిస్తే ఈ పద్ధతులను నిజాయితీతో అవలంబిస్తే అంతర్జాతీయ శాంతి సుహృద్భావాలు సుసాధ్యం అవుతాయన్నది త్రోసిపుచ్చలేని విషయం.

దౌత్యవేత్తలు, రాయబారులకు ప్రవక్త(స) ముందు కాలంలో రక్షణ ఉండేది కాదు. స్వయంగా ప్రవక్త (స) పంపిన రాయబారులకు కూడా అప్పట్లో రక్షణ లభించలేదు. కాని మానవప్రాణాలకు సంబంధించి ప్రవక్త (స) చెప్పిన మాటలు రాయబారుల రక్షణకు కూడా వర్తిస్తాయి. "ఒప్పందం కుదుర్చుకున్న తెగలోని వ్యక్తి ఎవరినైనా చంపిన వాడు స్వర్గం వాసన కూడా ఆఘ్రాణించలేడు" అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). ఈ హదీసులో ఒప్పందాలకు ఉన్న పవిత్రత అర్థమవుతుంది. అలాగే ఒక వ్యక్తి ప్రాణాలను అన్యాయంగా తీసినవాడు మొత్తం మానవాళిని చంపినట్లే, ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన వాడు మొత్తం మానవాళిని కాపాడినట్లే అనే బోధన కూడా అంతర్జాతీయ వ్యవహారాలకు వర్తించేదే. ముఖ్యంగా రాయబారుల రక్షణకు వర్తించే ప్రబోధన. రాయబారులపై దాడి చేయడం ద్వారా కవ్వించడం, రెచ్చగొట్టడం యుద్ధాలకు దారి తీస్తుంది. ప్రాణనష్టానికి దారితీస్తుంది. మానవాళిని చంపినట్లే అనే మాటలకు ఈ అర్థం కూడా ఉంది. అలాగే ఒక రాయబారిని సముచితంగా గౌరవించడం ద్వారా, రాయబారాన్ని పంపించిన రాజ్యంతో అంగీకరించకపోయినా, ఆ రాజ్యంతో ఒక స్నేహపూర్వక సంబంధాన్ని ప్రారంభించినట్లే అవుతుంది. ఇది యుద్ధాన్ని నివారించి ప్రాణనష్టాన్ని నివారించడం అవుతుంది. ఒక ప్రాణాన్ని కాపాడిన వాడు మొత్తం మానవాళిని కాపాడ్డం అనే మాటలకు ఈ అర్థం కూడా ఉంది. అలాగే యుద్ధనియమాల్లో యుద్ధఖైదీలకు సంబంధించి ప్రవక్త ముందు కాలంలో ఎలాంటి నియమాలు లేవు. కాని ప్రవక్త స్పష్టంగా యుద్ధఖైదీలకు సంబంధించిన ఆదేశాలిచ్చారు. యుద్ధఖైదీల పట్ల అనుచితంగా వ్యవహరించినవాడు మాలోని వాడు కాదు అన్నారు. అంటే యుద్ధఖైదీల పట్ల అనుచిత వ్యవహారశైలి ప్రదర్శిస్తే ఆ వ్యక్తి ముస్లిం సముదాయం నుంచి వేరుపడినట్లే అని చెప్పడం చాలా తీవ్రమైన విషయం. యుద్ధఖైదీల పట్ల సముచిత వ్యవహారశైలి గురించి కీలకమైన హదీసు ఇది.

అంతర్జాతీయ వ్యవహారాల్లో న్యాయం, నిష్పక్షపాతం, ఒప్పందాలు, ఒప్పందాలను గౌరవించడం, మానవీయ వ్యవహార శైలి, యుద్ధనియమాలు, యుద్ధఖైదీల నియమాలు, శాంతిసాధనకు రాజీ ధోరణి ప్రదర్శించడం– ఇవన్నీ నేటి ఆధునిక అంతర్జాతీయ శాసనాల్లో కీలకమైన అంశాలు. వీటన్నింటికీ పునాదులు మనకు ప్రవక్త (స) జీవితాన్ని నిశితంగా అధ్యయనం చేస్తే కనిపిస్తాయి.




ఎస్.ఎమ్. మలిక్

**మహనీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్)** దేవుని అంతిమ సందేశహరుడు. ఆయన అందజేసిన సందేశం కూడా చివరి సారిగా ప్రజలకు అందజేయబడుతోంది. ఆయన తరువాత మరో ప్రవక్త, మరో దైవసందేశహరుడు రాబోవడం లేదు. అందువల్ల విశ్వప్రభువు తన సందేశాన్ని అందజేయడానికి ఓ ప్రత్యేక ప్రజను ఎన్నుకున్నాడు, ప్రత్యేక భాషను ఎన్నుకున్నాడు. అరబీ క్లాసికల్ (Classical) భాష మాత్రమే కాదు అదో జీవ భాష. ఆ కాలంలో అనేక క్లాసికల్ భాషలున్నాయి కాని అన్నీ దాదాపు ప్రజల నాలుకలకు దూరమయి, కేవలం కొన్ని గ్రంథాల వరకు, కొందరు వ్రేళ్ళపై లెక్కించదగ్గ వ్యక్తుల వరకు పరిమితమయి పోయాయి. కాని అరబీ భాష ఇంకా ప్రఫుల్లంగా ప్రజల మధ్య సజీవంగా అలరారుతోంది. ఓ మహా దేశంలో అది ప్రజల వాడుక భాషే కాదు, ఆ ప్రజల సంస్కృతీ నాగరికతల చిహ్నమయి, సాహితీ సాంస్కృతిక కార్యకలాపాల మాధ్యమంగా కూడా భాసిల్లుతోంది.

అలాగే అరబ్బులు తమ గుణగణాల రీత్యా ఇతర సభ్య, నాగరిక, వృద్ధీ వికాసాలు సాధించిన జాతులకు భిన్నంగా ఆనాటి నాగరికతా భేషజాలకు దూరంగా ఉన్న ఓ జాతి. అయితే ధైర్య సాహసాలు, సంకల్పంలో దృఢత్వం, అనుకున్న దాన్ని సాధించి తీరవలసిందేనన్న పటిష్ఠమయిన పూనిక ప్రదర్శించగల ధీశాలురు. ఎంత దృఢ సంకల్పం గలవారో అంతే త్యాగ నిరతులు. తమకు ప్రియమయిన దాని సాధనకు ఎటువంటి త్యాగానికయినా, సమస్త ధన ప్రాణాలనయినా ధారబోయడానికి సంసిద్ధులయిన యోధులు. వారి ఈ విశేష లక్షణాలు, ప్రకృతి సిద్ధమయిన ప్రత్యేకతల కారణంగానే విశ్వకర్త అరబ్బుల్ని తన కడపటి సందేశ ధ్వజవాహకులుగా ఎన్నుకున్నాడు. అటువంటి అపూర్వ జాతిలోని వ్యక్తినే తన అంతిమ సందేశహరునిగా ఆవిర్భవింపజేశాడు.

## దేవుని ఏకత్వం

ఆయన ప్రపంచానికి అందజేసిన సందేశం కొన్ని విశ్వజనీన సత్యాల సంచయనం. ప్రప్రథమమయినది, దేవుని ఏకత్వం.

ఈ విశ్వానికి దైవం ఒక్కడే అని విశ్వసించడం వేరు, ఆ విశ్వాసానికి విరుద్ధమయిన సమస్త మూఢ విశ్వాసాలను పరిత్యజించి, వ్యతిరేకించి, కేవలం అదొక్కటే యదార్థమని, కడకు నమ్మకాలన్నీ అసత్యాలని, మిథ్య అని, అవాస్తవాలని నమ్మడం వేరు. అంతే కాదు ఆ విశ్వాసానికి ఆధారభూతమయిన ఓ సంపూర్ణ జీవన వ్యవస్థను నెలకొల్పబూనడం, ఆ విశ్వాసం వైపునకు ప్రపంచ మానవులనందరినీ ఆహ్వానించడం వేరు. బహు దైవ భావన, ఆ భావనకు లోనయిన ఆరాధనా విధానం, మానవ జీవితంలో, వ్యక్తిగతంగానయినా సాముదాయికంగానయినా అటువంటి బహు దైవభావనా ప్రధానమయిన సిద్ధాంతాలను త్రోసిపుచ్చడం, దాని ఏవిధమయిన దాఖలాలు సయితం మానవ జీవితంలోని ఏ కోణంలోనూ చోటు చేసుకోకుండా ప్రత్యేక జీవిత విధానాన్ని నిర్మించడం ఆయన సందేశంలోని ప్రముఖాంశం.

ఆయన(స) ఈ సందేశాంశాన్ని బోధిస్తూ తాను ఏదో కొత్త విషయాన్ని, అనన్యమయిన ఆవిష్కరణను ఆ ప్రజల ముందు పెడుతున్నట్లు ప్రకటించలేదు. దైవం, అనాదిగా ప్రభవింపజేస్తూ వచ్చిన దైవసందేశహరులందరూ ఈ దేవుని ఏకత్వపు సందేశాన్నే మానవాళికి అందజేస్తూ వచ్చారని గట్టిగా ప్రకటించాడు.

ఆయన అందజేసిన దైవగ్రంథం, దివ్య ఖుర్‌ఆన్, ఈ సందర్భంగా ఇలా ప్రకటిస్తుంది :

**మేము ప్రతి సముదాయంలో ఒక సందేశహరుణ్ణి ఆవిర్భవింపజేశాము, వారి బోధన ఇదే, 'అల్లాహ్‌ను ఆరాధించండి. (ఆయన్ని కాదని, ఆయనకెదురుగా నిలిచే ప్రతి) దైవేతర శక్తి ఆరాధన నుండి దూరంగా మెలగండి. *(అన్ నహ్ల్ : 16: 36)***

ఇంకా :

**ప్రవక్తా! నీకు పూర్వం మేము ఏ సందేశహరుని పంపినా అతనికి ఇలా మాత్రమే వహీ (సందేశవాణి) పంపాము, 'నేను తప్ప మరో దైవం లేదు, కాగా మీరంతా నన్నే ఆరాధించండి."**

***(అల్ అన్బియా : 21: 25)***

## దైవదౌత్యం

మానవులకు పరమ ప్రభువు, సృష్టికర్త, దేవుని సందేశం చేరగల ఒకే ఒక మార్గం, దైవం పక్షాన అందజేయబడే 'వహీ' లేదా దైవ వాణి. ప్రతి మానవునికి అది అందడం తద్వారా మానవ సంస్కరణ జరగడం అన్నది సుసాధ్యమయిన విషయం కాదు. ఎవరో ఒకరు దాన్ని దైవం ద్వారా గ్రహించి తోటి మానవ సోదరులకు చేరవేయాలి. ఇదొక్కటే సరయిన, సమంజసమయిన, ఆచరణాత్మకమయిన విధానం. దానిగ్గాను విశ్వప్రభువు తాను సృష్టించిన మానవుల్లో నుంచే తాను కోరిన వ్యక్తిని ఎన్నుకుని అతని ద్వారా తన సందేశాన్ని ప్రజలందరికీ అందజేస్తాడు. ఆయన ఆది నుండి ఈ పద్ధతి ద్వారానే మానవులలో నుంచి సందేశహరుల్ని ఎన్నుకుని మానవాళికి తన విధేయతా మార్గాన్ని అందజేస్తూ వచ్చాడు.

**ఆది మానవుడు ఆదమ్ సంతానమా! గుర్తుంచుకోండి, మీ వద్దకు, స్వయంగా మీలో నుంచే, మీకు నా వచనాలను వినిపించే సందేశహరులు వచ్చినప్పుడు, ఎవరయితే అవిధేయతకు పాల్పడక తప్పించుకుంటారో, తమ వైఖరిని సంస్కరించుకుంటారో వారికి ఎటువంటి భయానికీ, దుఃఖానికీ (గురయ్యే) అవసరముండదు. మరెవరయితే మా వచనాలను తిరస్కరిస్తారో, ఆ వచనాల ఎడల తలబిరుసుతనం చూపుతారో వారే నరకవాసులవుతారు, అక్కడే వారు సదా ఉంటారు.**

***(అల్ ఆరాఫ్ : 7: 35, 36)***

ఇదే మానవుని సఫలతా నిష్ఫలతల ప్రమాణం. దైవ సందేశహరులు అందజేసిన సందేశాన్ని స్వీకరించడం, తదనుగుణంగా తమ వ్యక్తిగత, సాముదాయిక జీవితాలను చక్కదిద్దుకోవడం సాఫల్యానికి సోపానమయితే ప్రవక్తల్నీ వారు అందజేసిన సందేశాన్నీ తిరస్కరించడం, వారికెదురుగా తిరుగుబాటు వైఖరి నవలంబించడం దుష్ఫలితానికి, శాశ్వత వైఫల్యానికి దారి అవుతుంది. ఇది సూత్రప్రాయంగా మానవులు గుర్తుంచుకోవలసిన సిద్ధాంతం!

## ప్రతి సముదాయంలో ప్రవక్త

దివ్య ఖుర్‌ఆన్, ప్రతి సముదాయంలోనూ వారికి దైవమార్గం చూపెట్టే ప్రవక్తలు ఆ జాతిలో నుంచే ప్రభవింపజేయబడ్డారని గట్టిగా ప్రకటిస్తుంది :

**ఒక (దైవం పట్ల) భయపెట్టే, హెచ్చరించేవాడు రానిదే ఏ సముదాయమూ గతించలేదు. *(ఫాతిర్ : 35: 24)***

**ప్రతి జాతి కొరకు ఒక మార్గబోధకుడు ఉండేవాడు.**

***(అర్ రాద్ : 13: 7)***

**ఇంకా మేము ప్రతి సముదాయంలోనూ ఒక సందేశహరుణ్ణి (ఈ సందేశాన్ని అందజేసేందుకు) పంపాము, 'అల్లాహ్ (దైవం) విధేయత పాటించండి, తాగూత్ (దైవేతర శక్తుల) విధేయతకు దూరంగా మెలగండి' అని అతని ద్వారా హెచ్చరిక చేశాము.**

***(అన్ నహ్ల్: 16: 36)***

దివ్య ఖుర్‌ఆన్‌లో ఆది నుండి ఏ ఏ ప్రవక్తలు ఆవిర్భవింపజేయబడ్డారో వారి గాథలు కొన్నింటిని పేర్కొనడం జరిగింది. ఖుర్‌ఆన్ అధ్యయనంవల్ల ఆ వివరాలు తెలిసివస్తాయి. ఖుర్‌ఆన్‌లో ప్రవక్తల

పేర్లన్నీ ప్రకటించబడలేదు. ప్రవక్త ముహమ్మద్(స) పలికిన సూక్తుల్లో వారి సంఖ్య ఒక లక్షా 24 వేలని తెలుస్తోంది. సూత్రప్రాయంగా ఎక్కడెక్కడ మానవ సముదాయాలు వెలిశాయో అక్కడల్లా ప్రవక్తలు, దైవ సందేశహరులు తప్పక వచ్చారు. ప్రజల విశ్వాసా లను, ఆచరణలను చక్కదిద్ది సామాజిక సంస్కరణను వారిలో ప్రవేశపెట్టారు. ఆయా జాతుల గాథల ద్వారా ఆ ప్రవక్తల్ని తిరస్క రించినవారు, దూషించినవారు, ద్వేషించినవారు, వారిని హింసిం చిన వారు కూడా గతించారని తెలుస్తోంది.

## ముహమ్మద్(స) అంతిమ ప్రవక్త

చరిత్ర, ప్రవక్తల గాథల ఈ నేపథ్యంలో చివరి దైవప్రవక్తగా మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)ని దైవం తన అంతిమ గ్రంథంతోపాటు ప్రభవింపజేశాడు. ముహమ్మద్(స) లోగడ ఆవిర్భవించిన ప్రవక్తల్లోనివారేనని, వారు మానవ మనుగడ ఆరంభం నుంచి ఏ ధర్మాన్ని మానవాళికి అందజేస్తూ వచ్చారో ముహమ్మద్ కూడా అదే ధర్మాన్ని, దైవ విధేయతా ధర్మాన్ని దాని స్వచ్ఛమయిన రూపంలో, పరిపూర్ణ రూపంలో, ఎటువంటి కల్తీలేని ప్రస్ఫుటరూపంలో అందజేయడానికే నియుక్తులయ్యారని స్పష్టపరచడం జరిగింది. ప్రపంచం మొత్తాన ఈ సత్యాన్నే చాటడానికి, ప్రారంభం ఏదో ఒకచోట ఏదో ఒక సముదాయంలో జరగవలసి ఉంది గనక అరేబియాలో, ఆయన్ని ప్రభవింపజేసి అంతిమ గ్రంథాన్ని సజీవ భాష అరబీలో అంద జెయ్యబడుతోందని ప్రకటించబడింది :

> **యాసీన్. విజ్ఞతా సంభరితమయిన కుర్ఆన్‌పైన ఒట్టు, ముహమ్మద్! నీవు సందేశహరులలోని వాడవు, రుజుమార్గాన ఉన్నావు.** ***(యాసీన్ : 36: 1-4)***

ఇంకా,

> **అదేవిధంగా మేము (ముహమ్మద్!) ఈ అరబీ కుర్ఆన్‌ని నీ వద్దకు వహీ ద్వారా పంపాము. తద్వారా నీవు నగరాల కేంద్రం (మక్కా), మరి దాని పరిసర ప్రాంతాలలో నివసించే వారిని హెచ్చరించాలని.** ***(అష్ షూరా : 42: 7)***

ఆయన ఏదో ఒక జాతి కొరకు కాదు, కేవలం తన నాటి మానవు లందరికి కూడా కాదు, ప్రళయం వరకు, ఏ ఏ ప్రజల వద్దకు ఆయన సందేశం చేరగలదో వారందరి కొరకు ప్రభవింపజేయ బడ్డారు. ఇదే మాట ఆయన నోట ఇలా ప్రకటించడం జరిగింది:

> **ఈ ఖుర్ఆన్‌ని నా వద్దకు వహీ ద్వారా పంపడం జరిగింది- దీని ద్వారా మిమ్మల్నీ ఇంకా ఇది ఎవరెవరికి చేరుతుందో వారం దరినీ హెచ్చరించాలని.** ***(అల్ అన్ఆమ్ : 6: 19)***

## పరలోక జీవితం

దైవ సందేశహరులు అందజేసిన సందేశంలో మరో ముఖ్యాంశం పరలోక జీవితం. దీని వివరాలు ఏమిటంటే;

మానవుడు బాధ్యతా రహితుడయిన జీవి కాడు. మానవుని ప్రాపం చిక జీవితం ఓ పరీక్షా వ్యవధి. ఇక్కడ అతను ఆచరించిన ప్రతి ఆచరణ కొరకు అతను పరమ ప్రభువు సమక్షంలో సమాధానం చెప్పుకోవలసి వస్తుంది. ఇలా సమాధానం చెప్పుకునేందుకు విశ్వప్రభువు ఒక సమయాన్ని నిర్ణయించిపెట్టాడు. మానవాళి ఆచరణా వ్యవధి ముగిసిన తరువాత ప్రళయం సంభవిస్తుంది. విశ్వమంతా ఛిన్నాభిన్నమయి పోతుంది. తదుపరి మరో వ్యవస్థ నెలకొలిపి అందులో ఆది మానవుడు మొదలుగా ప్రళయం వరకు జన్మించిన అంత్య మానవుని వరకు అందరూ సజీవంగా లేపబడతారు. ఆ మరో ప్రపంచంలో ప్రాప్తమయ్యే మరో జీవితం శాశ్వత మయింది. అందులో మృత్యువు వంటిది సంభవించదు. అది చిరకాలం మనగలిగే వ్యవస్థ, పరలోక వ్యవస్థ.

మానవుడు ఇహలోకంలో చేసే చేష్టలన్నీ, మాటలు చేతలు సర్వం, అల్లాహ్ లేదా పరమ ప్రభువు, విశ్వకర్తకు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటుంది. అయినా ఆయన మనిషి చేసే మాటలు, చేతలు అన్నింటి సాక్ష్యాధారాలను సయితం నమోదు చేసి భద్ర పరుస్తూ ఉంటాడు. ఈ ప్రపంచం తరువాత ఉనికిలోకి వచ్చే మరో ప్రపంచంలో ఆయన ఓ న్యాయపీఠాన్ని స్థాపించి అందులో ఒక్కొక్క మనిషిని హాజరుపరచి భద్రపరచిన అతని రికార్డు ప్రకారం అతన్ని ప్రశ్నించడం జరుగుతుంది. ఆ ప్రశ్నించే పరీక్షలో నెగ్గినవారు సఫలీకృతులుగా ప్రకటించబడతారు, పరలోక జీవితంలో సుఖాల స్వర్గ జీవితం ఆస్వాదిస్తారు. మరెవరయితే ఆ పరీక్షలో నిష్ఫలురవుతారో వారు శాశ్వత నరకవాసులుగా ఎంచబడతారు.

ఈ సఫలతా నిష్ఫలతకు ప్రమాణం మానవుడు, తన జీవితాన్ని తనకు అందిన దైవప్రవక్తల బోధనల ప్రకారం గడిపాడా లేదా ఆ బోధనల్ని తిరస్కరించి తనకు ఇష్టమయిన విధానాలను అవలంబించాడా అన్నది. ప్రవక్తల బోధనలకనుగుణంగా జీవిం చిన వ్యక్తి శాశ్వత స్వర్గానికి, వాటికి భిన్నమయిన రీతిలో బ్రతికిన వ్యక్తి అంతం కాని నరకానికి పాత్రుడవుతాడు.

ఇవి ప్రవక్తల బోధనలకనుగుణంగా మానవుని సహజమయిన, యదార్థ మయిన విశ్వాసాలు. వీటికి భిన్నమయినవన్నీ అవాస్తవ మయినవి, అసహజమయినవి, నిరర్థకమయినవి. ❀



# అంతిమ దైవ గ్రంథంలో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## సద్గుణ సంపన్నులు

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్)పై అవతరించిన చిట్టచివరి దైవగ్రంథం ఖుర్ఆన్. మరి ఆ ఉద్గ్రంథాన్ని మానవాళికి చేరవేసే ప్రవక్త నైతికంగా ఎలా ఉండాలి? దాని గురించే విశ్వప్రభువు ఆ గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు :

> **"(ఓ ముహమ్మద్-సఅసమ్!) నీవు నైతికంగా అత్యున్నత శిఖరాన్ని అధిరోహించి ఉన్నావు"** ***(అల్ ఖలమ్ : 4)***

ఒకసారి ప్రవక్త ప్రియ శిష్యులు కొంతమంది అమ్మ ఆయిషా (ర.అ) దగ్గరకు వచ్చి, 'అమ్మా! దైవప్రవక్త(స) గుణగణాలు ఎటువంటివో కాస్త విడమరిచి చెబుతారా!' అని అడిగితే, "ఏమిటి, మీరు ఖుర్ఆన్ చదవరా? దైవప్రవక్త(స) గుణగణాలు ఖుర్ఆన్ ప్రబోధనలకు ప్రతిబింబం" అని ఆమె సమాధానమిచ్చారు.

మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్)లోని మృదుత్వాన్ని, మార్దవాన్ని ప్రస్తుతిస్తూ సృష్టికర్త ఒక చోట ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

> **"(ఓ ముహమ్మద్-స!) అల్లాహ్ యొక్క అనంత కరుణ వల్లనే నీవు వారి (సహచరుల) యెడల మృదు మనస్కుడవు అయ్యావు. ఒకవేళ నీవే గనక కర్కశుడవు, కఠినాత్ముడవు అయి వుంటే వారందరూ నీ చుట్టుపక్కల నుండి దూరంగా పోయేవారు."**
> ***(ఆలి ఇమ్రాన్ : 159)***

ఒక వ్యక్తిలోని మంచితనాన్ని, సద్గుణాలను గురించి నిర్ధారించుకోవాలనుకుంటే, అతని భార్య నుండి ధ్రువీకరణ పత్రం పొందవచ్చు. ఎందుకంటే ఒక పురుషుని బలహీనతల గురించి భార్య కన్నా ఎక్కువగా ఎరిగినవారు మనుషుల్లో ఎవరూ ఉండరు. హజ్రత్ ఖదీజా(ర.అ) పాతిక సంవత్సరాలు దైవప్రవక్త(స) సతీమణిగా ఉన్నారు. దైవదౌత్యం మొట్టమొదటిసారి అందినప్పుడు ముహమ్మద్(స) ఎంతో ఉత్కంఠకు, ఆందోళనకు గురై, "ఖదీజా! నాపై దుప్పటి కప్పు. నా ప్రాణం పోయేలా ఉంద'ని చెప్పారు.

అప్పుడు ఆమె ఏమన్నారో చూడండి-

**"ముమ్మాటికీ అలా జరగదు. దైవసాక్షిగా చెబుతున్నాను- అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని వృథా గావించడు. ఎందుకంటే మీరు బంధువుల హక్కు ఇస్తారు. రుణగ్రస్తులకు రుణభారం నుండి విముక్తి కల్పిస్తారు. పేదవారికి సహాయం చేస్తారు. అభాగ్య జీవులను ఆదుకుంటారు. అతిథులకు మర్యాద చేస్తారు. సత్యాన్ని సమర్థిస్తారు. ఆపదల్లో ఉన్నవారికి ఆపద్బాంధవుల్లా తోడ్పడతారు."** *(సహీహ్ బుఖారీ)*

మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) గుణగణాలను పూసగుచ్చినట్లు వివరించటంలో అమ్మ ఆయిషా(ర.అ)ను మించిన వారెవరూ లేరు. ఆమె ఇలా అనేవారు-

**"మహాప్రవక్త(స) ఎవరినీ దూషించేవారు కారు. అపకారం చేసిన వారికి అపకారం తలపెట్టేవారు కారు. పైగా వారి పట్ల మన్నింపుల వైఖరిని అవలంబించేవారు. ఏదేని ఆచరణ విషయంలో ఆయనకు ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడితే సరళ విధానాన్ని అవలంబించటానికే ఇష్టపడేవారు. అయితే విషయంలోని ఉచితానుచితాలను, ధర్మాధర్మాలను పరికించి ధర్మసమ్మతమైన దానినే ఎంపిక చేసుకునేవారు. స్వవిషయంలో ఆయన(స) ఎన్నడూ ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే దైవాజ్ఞలను ఉల్లంఘించిన వారికి దైవ శాసనానుసారం శిక్ష విధించేవారు."** *(తిర్మిజీ, సహీహ్ బుఖారీ)*

## దైవదాసులకు దైవ సందేశం

మహాప్రవక్త(స) ప్రభవనంలోని ముఖ్య ఉద్దేశం దైవ సందేశాన్ని దైవదాసులకు చేరవేసి, వారి జీవితాలను తీర్చిదిద్దటం! ప్రజల అంతరంగాలను పరిశుద్ధపరచటం!! దైవ వచనాలను ప్రజలకు వినిపించటం!!! దైవగ్రంథంలోని లోతైన విషయాలను విడమరచి చెప్పటం!!!! ప్రజాబాహుళ్యానికి యుక్తిని, విజ్ఞతా వివేచనలను ఉపదేశించటం!!!!! ఆ విషయాన్నే అల్లాహ్ తన గ్రంథంలో ఒక చోట ఇలా సెలవిచ్చాడు-

**"ఆయనే నిరక్షరాస్యులలో (ఉమ్మీలలో) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు."** *(అల్ జుముఅహ్ : 2)*

మరో చోట ఈ విధంగా సెలవిచ్చాడు :

**"చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోని వాడే. మీరు నష్టానికి గురికావడం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సౌలభ్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం, కారుణ్యం కలవాడు".** ***(అత్ తౌబా : 128)***

అంటే, దైవప్రవక్త(స) మీరు సన్మార్గాన్ని పొందాలనీ, తద్వారా మీరు ఇహపర సాఫల్యాలకు పాత్రులు కావాలని అభిలషిస్తున్నారు. మీరు నరకాగ్నికి ఆహుతి కావటం ఆయనకు ఎంత మాత్రం ఇష్టం ఉండదు. అందుకే ఆయన(స) ఒకసారి ఇలా వక్కాణించారు: ''నేను మీ నడుం పట్టి వెనక్కి లాగుతూ ఉన్నాను. కాని మీరేమో నా నుండి విడిపించుకుని పోయి నరకంలో పడుతున్నారు''. *(బుఖారీ- కితాబుర్రిఖాఖ్)*

ప్రవక్తగా నియుక్తులైన తొలి కాలంలో అల్లాహ్ ఆయన్ని ఉద్దేశించి- సందేశాన్ని మానవాళికి చేరవేసే విషయమై ఏమని ఉపదేశించాడో చూడండి-

**"వస్త్రం కప్పుకుని పడుకున్న మనిషీ (ఓ ముహమ్మద్-స)! లే; లేచి భయబోధ చెయ్యి. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు. నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో. మాలిన్యానికి దూరంగా ఉండు. ఎక్కువగా పొందాలనే కాంక్షతో ఉపకారం చేయకు. నీ ప్రభువు కొరకు ఓర్పు వహించు."** *(అల్ ముద్దస్సిర్: 1-7)*

వేరొక చోట అల్లాహ్ ఇలా ఉపదేశించాడు-

**(ఓ ముహమ్మద్-స!) నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి. ఒకవేళ నీవుగాని అలా చెయ్యకపోతే, ఆయన ప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించలేదన్న మాటే. (నిర్వహించే మాటైతే) జనుల కీడు నుండి అల్లాహ్ నిన్ను రక్షిస్తాడు."** *(అల్ మాయిదా : 67)*

ఒక దైవప్రవక్త అతి ముఖ్యమైన బాధ్యతలలో మొట్టమొదటిది, జన బాహుళ్యానికి దైవ సందేశాన్ని చేరవేయటం. దైవప్రవక్త గనక ఈ బాధ్యతను నెరవేర్చటంలో లోటు కనబరిస్తే, అతను తన విధి నిర్వహణ పట్ల అశ్రద్ధ కనబరిచినట్లే. దైవ సందేశాన్ని దైవ దాసులకు- హెచ్చుతగ్గులు లేకుండా- చేరవేసినట్లయితే సందేశ ప్రదాతను జనుల కీడు నుండి రక్షించే బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకుంటాడు. ఈ ఆయత్ అవతరించగానే, దైవ ప్రవక్త(స) తన ఇంటి బయట పహరాగా ఉండే సహచరులతో, ''ఈనాటి నుంచీ మీరు నా రక్షణ కోసం పహరాగా ఉండాల్సిన అవసరం లేదు. నా ప్రభువు స్వయంగా నా రక్షణా బాధ్యతను తీసుకున్నాడ''ని చెప్పారు. అల్లాహ్ తన ప్రియతమ ప్రవక్త(స)కు

చేసిన వాగ్దానాన్ని కడదాకా నిలుపుకున్నాడన్న దానికి సీరత్‌లోని ఒక్కొక్క పుట సాక్షీభూతంగా ఉంది.

ఈ ఆయత్ (5: 67)కు భావార్థంగా విద్వాంసులు, ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలేమంటారంటే, ముహమ్మద్ అనుచర సమాజం మనుగడ, దాని ఉన్నతి 'సత్యధర్మ పరిచయ కార్యం'తో ముడివడి ఉంది. సందేశ ప్రదానం పట్ల అశ్రద్ధ, ఏమరుపాటు దాని అధోగతికి ప్రధాన కారణమవుతుంది. నేడు భారతదేశంలో ముస్లిములపై అనుదినం విరుచుకుపడుతున్న ఆపదలకు మూలకారణం దైవ సందేశాన్ని దైవదాసులకు చేరవేసే బాధ్యతను వారు విస్మరించటమే.

## శ్రేయోభిలాషకు పరాకాష్ఠ

పై ఆయత్ (5: 67) ప్రభావం మహాప్రవక్త(స)పై ఎంతగా పడిందంటే, తన సందేశాన్ని లక్ష్యపెట్టని అవిశ్వాసుల గురించి ఆయన ఎంతో వ్యాకులతకు గురయ్యేవారు. దుఃఖంతో కుమిలి పోయేవారు. ప్రవక్త(స) యొక్క ఈ స్థితిని చూసి దైవ కారుణ్యం ఒక్కసారిగా ఉప్పొంగింది- ఈ ఆయత్ అవతరించింది-

> **"అయితే (ఓ ముహమ్మద్-స!) ఒకవేళ వారు ఈ ఉపదేశాన్ని విశ్వసించకపోతే, బహుశా నీవు వారి కోసం దుఃఖిస్తూ నీ ప్రాణాలకే ముప్పు కొనితెచ్చుకునేలా ఉన్నావు."** *(అల్ కహ్ఫ్: 6)*

> **"ఓ ముహమ్మద్! వారు విశ్వసించరు అని దుఃఖపడుతూ, బహుశా నీవు నీ ప్రాణాలను కోల్పోతావేమో! మేము కోరితే ఆకాశం నుండి ఒక సూచనను దించి, దాని ముందు వారి మెడలు వంగిపోయేలా చేయగలం"** (కాని వారికి ఇవ్వబడిన స్వేచ్ఛాధికారం దృష్ట్యా **మేము వారికి విడుపు ఇస్తూ పోతున్నాము)".** *(అష్ షుఅరా : 3,4)*

గ్రంథం కల ప్రజలు (యూదులు, క్రైస్తవులు) పిడివాదానికి దిగిన సందర్భంలో అల్లాహ్ తన అంతిమ ప్రవక్త(స)కు అవతరింపజేసిన వాక్యం కూడా గమనార్హమే.

> **ముహమ్మద్! ఇలా చెప్పు: "గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్యన సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అదేమి టంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకో రాదు."** *(ఆలి ఇమ్రాన్: 64)*

## ఔదార్యం వర్షించిన వేళ...

ముహమ్మద్ ప్రవక్త(స)లోని దయా గుణం గురించి ఖుర్‌ఆన్‌లో ఇలా అనబడింది :

> **"ఓ ముహమ్మద్! మేము నిన్ను లోకవాసుల కోసం కారుణ్యంగా పంపాము."** *(అల్ అంబియా : 107)*

ఒకసారి ఒక సహచరుడు వచ్చి, ఫలానా తెగవారిని శపించండి అని దైవప్రవక్త(స)ను కోరాడు. దానికి ఆయన(స), "నేను ప్రభవింపజేయబడినది శపించడానికి కాదు, నేను కారుణ్యంగా మాత్రమే పంపబడ్డాన"ని అన్నారు.

మక్కాలో కరువు కాటకాలు తీవ్రరూపం దాల్చాయి. ఖురైషులకు తినడానికి ఆహారం లేదు. దైవప్రవక్త(స) మదీనాలో ఉన్న కాల మది. కరడుగట్టిన అవిశ్వాసి, మక్కా నాయకుడు అబూ సుఫ్యాన్ వచ్చి,"మీరు బంధువుల హక్కు గురించి నొక్కి వక్కాణిస్తారు కదా! మక్కాలో మీ వారు ఆకలితో అలమటిస్తున్నారు. మరోవైపు సుమామా బిన్ ఉసాల్ మాకు ఆహార ధాన్యాల సరఫరాను నిలిపి వేశాడు. మీరు మా కొరకు ప్రార్థించండి" అని విజ్ఞప్తి చేసినప్పుడు దైవప్రవక్త(స) జాలి గుండె కరిగిపోయింది. అప్పటికప్పుడే మక్కా జనుల కోసం దైవాన్ని వేడుకోవటమేగాక, కొంత నగదు సొమ్మును ఆర్థిక సహాయంగా ఇచ్చి పంపించారు. మక్కా నగరానికి ఆహార సరఫరాను కొనసాగించాలని సుమామా బిన్ ఉసాల్‌కు ఆదేశం పంపారు.

## పేదల పెన్నిధి

సమాజంలో ధనికులతోపాటు పేదవారు కూడా ఉంటారు. అందరూ భాగ్యవంతులే ఉండరు, అభాగ్యజీవులు కూడా ఉంటారు. అయితే మహాప్రవక్త(స) అందరిపట్లా సమభావంతో మెలిగేవారు. ఒక్కోసారి పేదవారిలో ఆత్మన్యూనతా భావం

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

జనించరాదన్న ఉద్దేశంతో వారి పట్ల మరింత ఔదార్యంతో మెలిగే వారు. ఎందుకంటే తనను ప్రవక్తగా నియమించి పంపిన దేవుడు చేసిన ఉపదేశం అదేను. ఉదాహరణకు- ఈ విధంగా సెలవీయ బడింది-

**ప్రవక్తా! ఎవరు తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఉదయం, సాయంత్రం ఆయనను వేడుకుంటూ ఉంటారో, వారి సాహచర్యంతో నీ హృదయాన్ని సంతృప్తపరచుకో, వారి నుండి నీ దృష్టిని ఏమాత్రం మరల్చకు." *(అల్ కహ్ఫ్ : 28)***

వేరొక చోట ఇలా సెలవీయబడింది-

**"ప్రవక్తా! రేయింబవళ్ళు తమ ప్రభువును వేడుకునే వారినీ, ఆయన ప్రసన్నతను పొందగోరే ప్రయత్నంలో నిమగ్నులై ఉన్నవారినీ నీవు దూరంగా తొలగి పొమ్మనకు. వారికి సంబంధించిన లెక్కలోని ఏ విషయాన్ని గురించిన భారమూ నీపై లేదు. నీకు సంబంధించిన లెక్కలోని ఏ విషయాన్ని గురించిన భారమూ వారిపై లేదు. దీని తరువాత కూడా నీవు గనక వారిని దూరంగా త్రోసి వేస్తే దుర్మార్గులలో చేరిపోతావు."**

***(అల్ అన్ఆమ్ : 52)***

ఒకసారి మానవ సహజమైన బలహీనత కారణంగా దైవప్రవక్త(స) గారి వ్యవహరణ ఆయన స్థాయికి తగ్గట్టుగా ఉండకపోయే సరికి- తక్షణం- దైవాజ్ఞ అవతరించింది. ఇది మక్కాలో జరిగిన సంఘటన.

మహనీయ ముహమ్మద్(స) కొంతమంది ఖురైష్ నాయకులకు ఇస్లాం సందేశం వినిపిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో ఒక అంధ సహచరుడు, పేదవాడు అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) ఏదో ధర్మసందేహం అడగటానికి అక్కడకు వచ్చి కూర్చున్నారు. గర్విష్టులైన ఖురైషు సర్దారులకు ఇది సహించలేదు. దైవప్రవక్త(స) ఇబ్నె ఉమ్మె మక్తూమ్ గారిని పట్టించుకోకుండా ఖురైషు నాయకులపైనే తన దృష్టిని కేంద్రీకరించి ఉపన్యసిస్తు న్నారు. ఈపాటి అనాసక్తత కూడా దైవానికి నచ్చలేదు. అది దైవసన్నిధిలో తీవ్రమైన విషయంగా పరిగణించబడింది. వెంటనే దైవ సందేశం అవతరించింది. దేవుడు తన ప్రవక్తను సున్నితంగా మందలించాడు-

**విసుగుకొని (ముహమ్మద్-స) ముఖం త్రిప్పుకున్నాడు. ఆ అంధుడు తన వద్దకు వచ్చాడని. నీకేమి తెలుసు, బహుశా అతను దారికి రావచ్చు లేదా హితోపదేశం గురించి ఆలోచించ వచ్చు. హితోపదేశం అతనికి లాభదాయకం కూడా కావచ్చు. లక్ష్యపెట్టని వాడి పట్లనైతే నీవు శ్రద్ధ చూపుతున్నావు; వాస్తవానికి, ఒకవేళ అతడు దారికి రాకపోతే, దానికి నీపై బాధ్యత లేదు కదా! ఎవడు తనంతట తానుగా నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాడో మరియు (దైవానికి) భయపడుతూ ఉంటాడో అతని వైపు నుండి నీవు ముఖం తిప్పుకుంటున్నావు. ఎంతమాత్రం కాదు, ఇదసలు ఒక హితబోధ. ఇష్టమైనవారు దీనిని స్వీకరించ వచ్చు.** *(అబస: 1-12)*

మహాప్రవక్త(స) సత్యసంధులు అనడానికి ఈ వచనాలు మచ్చు తునకలు. ఒకవేళ ఆయన(స) గనక తనకు అవతరించిన కొన్ని వచనాలను దాచే మాటైతే, తనను మందలించే ఇలాంటి వచనా లను దాచేవారు. కాని ఆయన(స) దైవ సందేశాన్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా మానవాళికి అందజేశారు. అంతేకాదు, ఆనాటి నుండీ ఆయన వికలాంగులు, పేదవారైన తన సహచరుల పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. తాను మదీనా నగరాన్ని విడిచి యుద్ధ ప్రయాణాలు చేసినప్పుడు ఈ అంధ సహాబీ (అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్)కి మదీనా నగర ఇన్‌ఛార్జిగా నియమించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాగే 'అస్‌హాబె సుఫ్ఫా' (అరుగువాళ్ళు)గా పేరుబడిన ప్రియ సహచరులంతా నిరుపేదలు, నిర్వాసితులే. వారంతా దైవప్రవక్త(స) సాంగత్యంలో ఉండి, జామియతుల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ యూని వర్సిటీ) నుండి ఆర్జించిన మహాప్రవక్త మీరాశీని మానవ జగతికి పంచిపెట్టారన్న దానికి చరిత్రే సాక్షి.

## అత్యుత్తమ ఆదర్శం

మహాప్రవక్త(స) పవిత్ర జీవితానికి సంబంధించి దివ్య ఖుర్ఆన్‌లో ఉన్న మరొక- రోల్‌మోడల్- వచనం ఇది :

**"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఉత్తమమైన ఆదర్శం ఉంది."** ***(అల్ అహ్‌జాబ్ : 21)***

ఒక ప్రవక్తగా, సంస్కర్తగా, తండ్రిగా, భర్తగా, యజమానిగా, సేనాధిపతిగా, పరిపాలనాధీశునిగా, న్యాయాధిపతిగా- ఇలా ఒక్కటేమిటి, సర్వవిధాలా ఆయన(స) జీవితం మానవాళికి ఆదర్శప్రాయమే.

## న్యాయం, ధర్మం

ఒకసారి మక్కాలో మఖ్‌జూమ్ తెగకు చెందిన ఒక కులీన స్త్రీ దొంగతనం చేసింది. షరీఅత్ ప్రకారం ఆమె చేతిని నరకాలి. ఆమె వంశానికి ఉన్న పరువు ప్రతిష్టల దృష్ట్యా ఎలాగైనా ఆమెకు ఈ శిక్ష పడకుండా ఉంటే బావుండునని కొంతమంది సహచరులు తలపోశారు. వారు పరస్పరం సంప్రతించుకుని దైవ

ప్రవక్త(స)కు ఎంతో సన్నిహితంగా ఉండే ఉసామా బిన్ జైద్ (రజి)ను సిఫారసు నిమిత్తం పంపారు. ఉసామా ప్రతిపాదన వినగానే దైవప్రవక్త(స) ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. ఆయన అప్పటికప్పుడే తన శిష్యగణాన్ని సమావేశపరచి ఇలా ప్రసంగించారు : "ఇలాంటి ఆశ్రిత పక్షపాతం కారణంగానే బనీ ఇస్రాయీల్ నాశనమైంది. వారు పేదవారి నేరాలకు శిక్షలు విధించి, ధనవంతుల యెడల సడలింపుల వైఖరిని అవలంబించేవారు. వినండి! ఒకవేళ ముహమ్మద్ కూతురు ఫాతిమా దొంగతనం చేసినా, నేను ఆమె చేయి నరకడానికి వెనుకాడను."

చివరకు దొంగతనానికి ఒడిగట్టిన ఆ మఖ్జూమ్ తెగ మహిళ (ఫాతిమా) చేయి నరకబడింది. కాని దైవప్రవక్త(స) ఆమెను ఉపేక్షించటంగానీ, ఆమెను దూరంగా పెట్టడం గానీ జరగలేదు. మదీనాలో ఒక సహాబీ ఆమెను మనువాడారు. ఆమె తరచూ దైవప్రవక్త ఇంటికి రాకపోకలు సాగించేది. ఆమెకు ఎప్పుడు ఏ ఆర్థిక అవసరం ఉన్నా నేను దైవప్రవక్త(స)కు సిఫారసు చేసేదానినని, బైతుల్ మాల్ నుండి ఆమెకు దైవప్రవక్త సహాయం చేసేవారని హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పారు.

## ప్రవక్త విధేయతే పరమావధి

**(ఓ ముహమ్మద్-స!) నీవు ప్రజలకు ఇలా చెప్పు : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే, మీరు నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు."** ***(ఆలి ఇమ్రాన్ : 31)***

పై వచనం ద్వారా మనకు స్పష్టంగా బోధపడేదేమంటే మనం దైవ ప్రేమకు, ఆయన క్షమాభిక్షకు నోచుకోవాలంటే మహాప్రవక్త(స) ఆదేశాలను శిరసావహించాలి. ఆయన అడుగు జాడల్లో నడవాలి. ఆయన నెలకొల్పిన సంప్రదాయానికి, విధానానికి కట్టుబడి జీవించాలి.

**"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని సంతోషంగా పుచ్చుకోండి. ఆయన నిషేధించిన దాని జోలికి పోకండి." (అల్ హష్ర్: 7)**

**"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి, ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు".**

***(అల్ అన్ఫాల్ : 24)***

**"అల్లాహ్‌కు విధేయులు కండి, దైవప్రవక్త ఆదేశాలను శిరసావహించండి. కాని ఒకవేళ మీరు విముఖులైతే, బాగా తెలుసుకోండి. దైవప్రవక్తపై పెట్టబడిన కర్తవ్య భారం వరకే అతను బాధ్యుడు. మీపై మోపబడిన కర్తవ్య భారానికి మీరు బాధ్యులు. దైవప్రవక్తకు విధేయులైతే మీరే మార్గదర్శకత్వం పొందుతారు. లేకపోతే స్పష్టంగా ఆజ్ఞను అందజెయ్యటాన్ని మించి ఎక్కువ బాధ్యత దైవప్రవక్తపై లేదు."** ***(అన్ నూర్ : 54)***

**"విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త (ముహమ్మద్)కు విధేయత చూపండి. మీ పనులను వృథా చేసుకోకండి."** ***(ముహమ్మద్: 33)***

## వ రఫానా లక జిక్రక్

**"(ఓ ముహమ్మద్-స!) నీ కొరకు మేము నీ ప్రస్తావనను అత్యున్నత స్థానానికి చేర్చాము."** ***(అలమ్ నష్రహ్ : 4)***

నేడు దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రస్తావన ప్రపంచమంతా ప్రతి రోజూ, ప్రతి క్షణం ప్రస్తుతించబడుతోంది. రోజూ అయిదు పూటలు మస్జిద్ నుండి ఇవ్వబడే 'అజాన్' సందర్భంగా **'అష్‌హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్'** అన్న వాక్యం ప్రతిధ్వనిస్తోంది. అనుదినం ఆయనపై అనేకసార్లు దురూద్ పంపబడుతోంది. ప్రపంచంలో ఆయన ప్రస్తుతించబడని ఖండం ఏదీలేదు. ఆయన్ని కొనియాడే జనులు లక్షల సంఖ్యలో కాదు, కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఆయన నిర్మించిన 'మస్జిదె నబవీ' ఎల్లకాలం, ఎల్లవేళలా దురూద్ సలామ్‌లతో కళకళలాడుతూ ఉంది.

అల్లాహ్ ఆయనకు 'ఇస్రా-మేరాజ్'ను ప్రసాదించి దైవప్రవక్తలందరి (అలైహిముస్సలామ్)పై ఆయనకు గల విశిష్ట స్థానాన్ని, నేతృత్వాన్ని విశదపరిచాడు. అయితే అత్యున్నతమైన చోటికి తీసుకెళ్ళే సమయంలో కూడా ఆయన్ని 'అబ్ద్' (దాసుడు)గా పేర్కొని దేవుని స్థానం వేరు, దాసుని స్థానం వేరన్న విషయాన్ని స్పష్టపరిచాడు.

**"తన శక్తి సూచనలు కొన్నింటిని చూపటానికి, తన దాసుణ్ణి ఒక రాత్రి మస్జిదె హరామ్ నుండి, దూరంగా ఉన్న మస్జిద్ వద్దకు తీసుకుపోయిన ఆయన పరిశుద్ధుడు."**

***(బనీ ఇస్రాయీల్ : 1)***

## మరణం తథ్యం

దైవప్రవక్తలందరూ మానవ మాత్రులే. ముహమ్మద్(స) ప్రవక్త కూడా మానవ మాత్రులే; దైవం కారు. ప్రవక్తలకు కూడా మరణం తథ్యమే.

**"(ఓ ప్రవక్తా!) నీవూ మరణిస్తావు. వారూ మరణించవలసిన వారే. చివరకు ప్రళయం నాడు మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీ వ్యాజ్యాలను వినిపిస్తారు."** ***(అజ్ జుమర్ : 30,31)***

మహాప్రవక్త (స)పై మోపబడిన కార్యం పూర్తయిన మీదట ఆయనకు ఈ సందేశం అందజెయ్యబడింది-

**"అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు, ప్రజలు తండోపతండాలుగా వచ్చి అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ఓ ముహమ్మద్!) నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించు, ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు."**

***(అన్ నస్ర్ : 1-3)***

ఈ వచనాల ద్వారా మహాప్రవక్త(స)కు మరణం సమీపించబోతుందన్న సంకేతం ఇవ్వబడింది. అంతే, దైవారాధనలో ఆయన రాత్రిపూట చాలాసేపు లీనమైపోయేవారు. చాలాసేపు నిలబడటం వల్ల ఆయన(స) పాదాలపై వాపు వచ్చేసింది. 'దైవప్రవక్తా! అల్లాహ్ మీ ముందటి వెనుకటి పొరపాట్లన్నీ మన్నించాడు కదా! మరి అలాంటప్పుడు మీరు ఇంత కఠోర సాధన ఎందుకు చేస్తున్నార'ని ఆయన సతీమణి ఆయిషా(ర.అ) అడగ్గా, "ఆయిషా! నేను దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునే దాసుడు కానవసరం లేదా?!" అన్నారాయన.

ఎందుకంటే నిశ్చయమైన మరణం సంభవించేవరకూ దైవారాధన చేస్తూ ఉండాలని ఆయన(స)కు ఆదేశించటం జరిగింది-

**"(ఓ ముహమ్మద్!) తప్పకుండా వచ్చే చివరి గడియ వరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు."** ***(అల్ హిజ్ర్ : 99)***

ఆలి ఇమ్రాన్ సూరాలోని ఈ ఆయత్‌ని కూడా చూడండి-

**"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. ఆయనకు పూర్వం కూడా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను చనిపోతే లేక చంపబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించే వారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు."** ***(ఆలి ఇమ్రాన్ : 144)*** ❀



# ఉషోదయం అవుతేనే గాని సూర్యోదయం అవదు



సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**భూమండలం** నియంతల, నిరంకుశవాదుల పాదాల కింద ఎంతగా నలిగి పోకూడదో అంతగానూ నలిగిపోయాక, మానవ జాతి ఎంతగా బానిస అయిపోరాదో అంతగానూ అయిపోయాక, బ్రతుకు ఎంతగా దుర్భరం అవకూడదో అంతగానూ అయిపోయాక, మానవ రక్తం ఎంతగా పారకూడదో అంతగానూ పారాక, భవిష్యత్తు ఎంతగా అంధకార బంధురం అవకూడదో అంతగానూ అయిపోయాక, స్వేచ్ఛా పువ్వు విప్పారింది ఓ పవిత్రాత్మ. పుడమిని పావనం గావించేందుకు సిద్ధమయింది ఓ మానవాత్మ. మనుజ జాతి మనుగడకు మెరుగులు దిద్దేందుకు సమాయత్తమయింది ఓ మహితాత్మ. దేశ దుస్థితిని సంస్కరించేందుకు, దళితుల దుర్గతిని సుగతిగా మార్చేందుకు దృఢ సంకల్పం చేసుకుంది ఓ శుభాత్మ. అచేతనావస్థలో కొట్టుమిట్టాడుతున్న కొడిగట్టిన దీపం వంటి సమాజంలో చేతనా దీపాలు వెలిగించేందుకు పూనుకుంది ఓ ప్రవక్తాత్మ.

ఆ మహిమాన్వి తాత్మయే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స). భావికి బాట వేసిన ముహమ్మద్ (స) వారధి గతానికి, వర్తమానానికి, భావితారలకు వెలుగుబాటయింది. మానవ జాతి సంస్కరణకూ, ఆదర్శ సమాజ ఆవిష్కరణకూ, లోకోద్ధరణకూ, సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రప్రథమమైనది, పునాది వంటిది దైవభీతి - తౌహీద్ అన్నారు ఆ ప్రవక్త (స). మనిషి ఇహ పర సాఫల్యానికీ, ముక్తికీ - మోక్షానికీ, స్వర్గానికీ - తౌహీద్‌కీ (దేవుని ఏకత్వానికీ) మధ్య గల అవినాభావ సంబంధం ఎన్నటికీ చెరిగిపోనిది. దేశ ప్రజల, పరిపాలకుల, పుణ్యాత్ముల పట్ల అభిమానం పెంచుకోవటం తప్పు కాదు. కానీ దైవాన్నీ, దైవానుగ్రహాలనూ మరచి, షిర్క్‌కు పాల్పడి, తౌహీద్‌ను విడనాడితే ఆ జాతి గతి సుగతి కాదు, దుర్గతే అన్నారు ఆ మహా మనీషి.

పిల్లలకు బాల్య దశ నుండే తౌహీద్ విశిష్ఠతను బోధిస్తూ ఉంటే

**మానవ జాతి సంస్కరణకూ, ఆదర్శ సమాజ ఆవిష్కరణకూ, లోకోద్ధరణకూ, సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రప్రథమమైనది, పునాది వంటిది దైవభీతి - తౌహీద్ అన్నారు ఆ ప్రవక్త (స). మనిషి ఇహ పర సాఫల్యానికీ, ముక్తికీ - మోక్షానికీ, స్వర్గానికీ - తౌహీద్‌కీ (దేవుని ఏకత్వానికీ) మధ్య గల అవినాభావ సంబంధం ఎన్నటికీ చెరిగి పోనిది.**

వచ్చే ఫలితాలు బహుళం. దైవభీతి ద్వారా జాతి ఆచరణ సక్రమంగా ఉంటుంది. నీతి సంపద వృద్ధి చెందుతుంది. మాటలో, బాటలో సారూప్యత ఏర్పడుతుంది. దేశ పౌరుల్లోని ప్రజ్ఞాపాటవాలు ప్రగతి పథాన వెచ్చించబడతాయి. స్వచ్ఛమయిన సహజ భావాల పురోభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. భావ దారిద్ర్యం నుండి బయటపడి, భావ దాస్యపు సంకెళ్ళను త్రెంచే ధైర్య సాహసాలు అబ్బుతాయి. వర్గ, వర్ణ, జాతి, కుల, భాష, ప్రాంత విభేదాలు తగ్గి విశాల దృక్పథం అలవడుతుంది. దైవ దాసులు అందరూ సమానులు అన్న భావన పరిఢవిల్లుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఏకముఖంగా అందించగల ఏకేశ్వరోపాసన-తౌహీద్-ను విస్మరించడం క్షంతవ్యంకాని అలసత్వమే కాదు, క్షమించరాని పాపం కూడా. '70 తల్లుల కన్నా అధిక ప్రేమ గలవాడు అల్లాహ్. మరి అట్టి కరుణామయుణ్ణి విస్మరించడం అంటే ఎంతటి ఘోరపాపమో ఆలోచించండి' అని జాతిని జాగృత పర్చారు జగత్ప్రవక్త ముహమ్మద్ (స).

లోకోద్ధరణకు, శాంతికి పాటు పడాల్సిన బుద్ధి జీవులే బానిసత్వాన్ని ఇష్టపడి స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని నిర్లక్ష్యం చేశారు. 'బానిసత్వాన్ని ప్రేమించేవారు, చిల్లర దేవుళ్లను, రాళ్ళను, రప్పలను, అన్య ప్రతిమలను ఆరాధించటం నిత్యం కానవచ్చే దృశ్యం. 'మనకు మాత్రం తౌహీదే ప్రాణం' అని చాటడమే కాక, ప్రజల్లో స్ఫూర్తిని నింపి, చైతన్యాన్ని రగిలించి సత్య సమరయోధులుగా వారిని తీర్చిదిద్దారు. మనిషి నిద్రావస్థ నుండి మేల్కోవాలి. అసత్యాన్ని ఎదిరించాలి. బూజు పట్టిన వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. తమస్సుకి వ్యతిరేకంగా తిరగబడాలి' అని ప్రేరేపించారు. ఈ తర్ఫీదు ఎందుకో తెలుసా? అసత్యాధిక్యతా ప్రవృత్తి అతి చెడ్డది. అది గనక జూలు విదిల్చిందంటే దానికిక యుక్తాయుక్తాల విచక్షణ ఉండదు. ఒకనాటి 70 వేల పసికందుల్ని ఇట్టే అవలీలగా హతమార్చేంతటి దుష్టతరమైనది. అందుకే సత్యాన్వేషి, సత్య ప్రియుడు తనను తాను రక్షించుకోక తప్పదు అని కర్తవ్యబోధ చేసి, విజయ ఢంకా మ్రోగించారు ప్రవక్త ముహమ్మద్ (స).

ఆయన చేపట్టిన ఉద్యమంలో నీగ్రో బానిసయిన బిలాల్ ఉన్నాడు. పారశీక దేశస్థుడైన సల్మాన్ ఫార్సీ ఉన్నాడు. రోము దేశస్థుడైన సుహైబ్ రూమీ ఉన్నాడు. అరబ్బు ధీరోదాత్తుడైన అలీ ఉన్నాడు. వీర జవాను అయిన ఉమరూ ఉన్నాడు. మొక్కవోని ముసఅబూ ఉన్నాడు. ఓపికలో అందెవేసిన అబూ బకరూ ఉన్నాడు. ఉక్కు వనిత సుమయ్యా ఉంది. ఆదర్శ మహిళ అస్మా ఉంది. అరుణకాంత ఆయిషా ఉంది. పేదల పెన్నిధి జైనబ్ కూడా ఉంది. స్వర్గ స్త్రీల నాయకురాలు ఫాతిమా ఉంది-వీరి గురించి ఖుర్‌ఆన్ ఇచ్చిన సాక్ష్యం ఒకటి చాలు. అది మానవ జాతి మర్యాదకు మచ్చుతునక. స్త్రీ జాతి కీర్తికి కలికితురాయి.

అయితే అభూత కల్పనలను దైవ గ్రంథాలలో జొప్పించి, వాటి మాతృకలను మటుమాయం చేసి, వాటి అర్థాలను. తాత్పర్యాలను వక్రీకరించి, వాటినే వ్యాపింపజేస్తూ సంఘానికి, సమాజానికి, దేశానికి, ప్రపంచానికి తీరని అపచారం చేయడం అన్నది ఆనాడే కాదు, ఈనాడు కూడా జరుగుతోంది.

చరిత్రను శాస్త్రాన్నే కాదు, ఏకంగా తౌహీదునే తగులబెట్టడానికి 'ఉజైర్, యేసు' చాటున గ్రంథవహుల్లోని కొందరు ఛాందసులు వేసుకున్న పథకం దైవ గ్రంథాలన్నింటిలోనూ సమానమైన తౌహీద్ భావనను మట్టు పెట్టి, సకల విశిష్ఠతలు, సమస్త విశేషాలు ఒక్క షిర్క్‌కే కట్టబెట్టి, ధర్మాన్ని, నీతిశాస్త్రాన్ని వంచకులకు ముట్టజెప్పడానికి సాగించిన మంతనాల బండారమంతా ఈ 'మోజునే' నిరూపిస్తున్నది. 'ఉజైర్, యేసు' అలాంటి ఇతరులు - దేవుళ్ళు, దైవాంశ సంభూతులు, దేవుని కుమారులు అనడానికి ఎలాంటి చారిత్రక, గ్రంథ పరమైన ఆధారాలు లేనప్పటికీ. 'త్రిత్వం' (Trinity) అన్న పదమే సువార్తల్లో ఎంత దేవులాడినా దొరకనప్పటికీ. 'ఆయన వాక్యమై ఉండెను, వాక్యం దేవుని వద్దనుండెను, ఆ వాక్యమే దేవుడై ఉండెను' అని కుట్రలు పన్నేందుకు సైతం బరి తెగించారు. పైగా మేధకందని, పామరులకే కాదు, పండితులకు సయితం అంతుబట్టని, అర్థమవని ఆ సిద్ధాంతాల పంచన, ఆ విశ్వాసాల పట్టున

అహంకారంతో, తలబిరుసుతనంతో ప్రవర్తిస్తున్నారు, తద్వారానే లోకశాంతి సాధ్యం అని బల్ల గుద్ది మరీ వాదిస్తున్నారు.

హితం కోరేదే మతమై ఉండాలి. మతం అన్నది ఇహంలో, పరంలో, సర్వత్రా మనిషి మోక్షానికి పూబాట వేసేదిగా ఉండాలని, పేదల బ్రతుకుల్ని బాగు చేసేదిగా, పీడిత ప్రజల సాధక బాధకాల్ని పట్టించుకునేదిగా, వారి జీవితాలను ప్రగత పథాన నడిపించేదిగా ఉండాలని ఆయన (స) చెప్పిన మాటలు నాటికీ, నేటికీ, ఏనాటికీ సప్త సముద్రాల ఆవలి గట్టు వరకు అనుసరించదగ్గవే.

దైవగ్రంథాలన్నింటినీ కాచివడబోసి, వాటిలోని సారాన్ని, సత్యాన్ని సంపూర్ణాకారంలో లోకానికి అందజేసిన అపురూప గ్రంథం, అంతిమ దైవ బహుమానం ఖుర్‌ఆన్. అది నిజాల్ని నిగ్గు తేల్చి మరి ఉన్నవి ఉన్నట్లుగా ఎలాంటి జంకూగొంకూ లేకుండా ప్రకటించింది. వర్ణం, వంశం, భాష, ప్రాంతం, జాతి, వర్గం వల్ల గొప్పతనం రానేరాదనీ, గుణయోగ్యత, దైవభీతి వల్లనే గొప్పదనం వస్తుందని ఘంటాపథంగా చెప్పింది.

ఇదే సందేశాన్ని, జీవన సత్యాన్ని ప్రజలకు తెలియపర్చేందుకు వచ్చిన యావన్మంది ప్రవక్తలు 'జనం తమ మూలధనం' అని భావించారు. నీతికి విలువ, నాతికి వలువ ముఖ్యమని చాటిన వీరు 'మనీ'కి విలువ ఇవ్వలేదని చెప్పటానికి వారి ఆదర్శ జీవితాలే సాక్షి! వారు ఎంత సేపటికీ ప్రజల యోగ క్షేమాల్ని, ముక్తి మోక్షాల్ని ఆశించారేగానీ, తాము వెనుకేసు కున్నదేమీ లేదు. 'ప్రవక్తలు దేన్నీ వారసత్వ సొత్తుగా వదలి వెళ్ళరు - ఒక ధర్మ విద్యను తప్ప' అన్నది వారన్న మాటే. ఈ కారణంగానే దైవం పట్ల భయం భక్తి, ప్రజల పట్ల అనురక్తి వారందరిలోనూ ఒకే స్థాయిలో దర్శన మిస్తుంది.


అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వారికి గల ప్రత్యేకత ఏమిటంటే- దైవప్రవక్తలందరి జీవితాల్లో గల విశేష దృక్కోణాలన్నీ ఆయనలో మూర్తీభవించి అందంగా, అతి మనోహరంగా ప్రతిబింబిస్తూ కన్పిస్తాయి. ఆయన కేవలం ఒక ప్రవక్త మాత్రమే కాదు - నీతిమంతుడైన ఒక వ్యాపారి, నిజాయితీపరుడైన ఒక ఉద్యోగి, దయా హృదిగల ఒక యజమాని, అవిరళం శ్రమించే ఒక కార్మికుడు, శత్రువులకు సైతం న్యాయం చేసే ఒక న్యాయాధిపతి. ధర్మ సంస్థాపనార్థం ధన, మాన, ప్రాణాలొడ్డి పోరాడే ఒక సైనికుడు, ఆయన రాజ్యాలను జయించటానికి వచ్చిన రాజు కారు, హృదయాలను జయించడానికి అరుదెంచిన శుభోదయ కిరణం! దైవప్రవక్త!! అంతిమ దైవప్రవక్త!!! మనిషిని మానవునిగా మలచగ వచ్చిన మానవ మహోపకారి!!!!

ఒక్కసారిగా ఇన్ని లక్షణాలు మూర్తీభవించిన ప్రవక్తోత్తములు ఈ జగాన ఒక్క ముహమ్మద్(స) వారే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ బహుముఖ శేముషీ సంపన్నత ఆయనకెలా ప్రాప్తమయింది? దివ్యావిష్కృతామృత జీవ జలం నుంచి, పరమోన్నత ప్రభువైన అల్లాహ్ జ్ఞాన శక్తి నుంచి. 'అన సయ్యిదు ఉలిది ఆదమ్, వలా ఫఖర్' (నేను ఆదం సంతతి మొత్తానికి నాయకుణ్ణి, ఇది గర్వాతిశయంతో చెప్పే మాట కాదు) అన్న పలుకు ఆయన నోట జాలు వారినదే. 'నేను ఇబ్రాహీమ్ (అ) ప్రార్థనా ఫలాన్ని, ఈసా (అ) సువార్త రూపాన్న'ని కూడా ఆయన అనేక సార్లు చెప్పారు.

అయితే - బుద్ధి తికమక పడిన వారు ఈ ప్రవచనాలకు పెడర్థాలు తీసి నేటి ఆధునిక యుగంలో ఆ మహా మహుని గురించి చేసే దుష్ప్రచారం జోరుగానే సాగుతున్నది. 'మనిషి తనకు తెలియని దానికి శత్రువ'న్నట్టు ఆ మహితాత్ముని జీవితం, ఆదర్శమెరుగని ప్రపంచం ఆయన్ను శత్రువుగానే చిత్రీకరిస్తున్నది. దాన్నే నిజం అని నమ్మబలుకుతున్నది. ఇట్టి దయనీయ స్థితిలో సైతం దైవాదేశాలకు, దైవప్రవక్తల ప్రవచనాలకు విలువిచ్చేవాళ్ళు, వాటి వేగాన్ని, లాభాన్ని కొలిచేవాళ్ళు, వాటిలో దాగివున్న ముత్యాలను, పగడాలను వెలికి తీసి లోకానికి అంద జేసేవాళ్ళు లేకపోలేదు. వారు ఎక్కువ సంఖ్యలో కాకపోయినా, తక్కువ సంఖ్యలో ఉన్నారన్నది అసత్యవాదుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించే సత్యం.

'కడుపు నిండిన వారి స్థితి వేరు, కడుపు పండిన వారి స్థితి వేరు, కడుపు మండిన వారి దుస్థితి చాలా వేరు' అన్నట్టు, సత్యం తెలిసిన వారి గతి వేరు, సత్యం పాటించేవారి స్థితి వేరు, సత్యాన్ని తృణీకరించిన వారి దుర్గతి చాలా వేరు. నేడీ ఆధునిక యుగంలో సైతం లోకం కాంతికి కళ్ళు తెరవాలంటే... సత్సమాజ సంస్థాపన జరగాలంటే ...ప్రవక్త (స) వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, లోతుగా పరిశీలన జరిపి, ఆయన ప్రవచనాలను బాగా జీర్ణం చేసుకుని కార్యాచరణకు ఉపక్రమించటం తప్ప మార్గాంతరం లేదు. ఇదే నేడు విశ్వ జనులందరి పాలిట తరుణోపాయం. వేయి సూర్యులు ఉదయించు గాక, వేయి చంద్రులు ఉదయించుగాక, మహాప్రవక్త (స) వారి మహితోక్తుల కాంతి ద్వారా తప్ప మనో చీకట్లు, మనుషుల మధ్య దూరాలు తొలగవు. సత్యశోధన అనే ఉషోదయం అవనిదే 'లోక శాంతి' అనే సూర్యోదయం అవదు. మరి జనులు ఇరుకు బుద్ధులు పెంచుకుని ఇరకాటం లోనే కొట్టుమిట్టాడుతారో, సార్వజనీన భావాన్ని వృద్ధి పరచుకుని లోక శాంతినే సాధించుకుంటారో వారే నిర్ణయించుకోవాలి. ❁

# ఆయన(స) అడుగు జాడలే...



**అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్**

**నేడు** ఊరు, వాడ అనే తేడా లేకుండా... ఇంకా చెప్పాలంటే గల్లీ నుండి ఢిల్లీ వరకూ.. ప్రపంచవ్యాప్తంగా ఎటు చూసినా అన్యాయాలు, దౌర్జన్యాలు, అశ్లీలం, అత్యాచారాలు, మద్య సేవనం, వడ్డీ, జూదం, దేశాల మధ్య ఆధిపత్య పోరు... అణు దాడులు, మతోన్మాదం, మూక దాడులు... ఇలా చెప్పుకుంటూ పోతే గుండెల్ని పిండే సంఘటనలెన్నో!


నేటి ఈ పరిస్థితులు దాదాపు 1400 సంవత్సరాలకు పూర్వం అరేబియా సమాజంలో సర్వసాధారణం. మనిషి దైవం ప్రసాదించిన తన ఉన్నత స్థానాన్ని మరిచిపోయి నీచత్వపు చివరి అంచుకు చేరుకున్నాడు. మూర్ఖత్వం ఎంత దాకా ప్రాకిందంటే... చెట్టు, పుట్టా, రాయి, రప్పా... పండితులు, పురోహితులు, పీర్లు, ఫకీరులూ అందరూ దేవుళ్ళయి కూర్చున్నారు.

ఇలాంటి పరిస్థితులలో దైవం మహాప్రవక్త ముహమ్మద్(స)ను ప్రపంచ మార్గదర్శనం కోసం, హితోపదేశం కోసం ప్రవక్తగా నియమించాడు. తద్వారా మానవుని వ్యక్తిగత ప్రవర్తన, మానవుని జీవితపు సామూహిక వ్యవస్థ.. ఈ రెండూ కలిసి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వంతోపాటు విలువలతో కూడిన శ్రేయోరాజ్య స్థాపన ఎలా స్థాపించవచ్చో ఆచరణాత్మకంగా స్థాపించి నిరూపించారు ప్రవక్త(స) వారు.

అనేక కష్టాలు, కడగండ్లు, ఆశలు, ప్రలోభాలు ఎదుర్కొని... స్వయంగా భరించడమే కాకుండా ప్రవక్త(స) గారు తమ అనుచర గణంలో సైతం మొక్కవోని ధైర్యం, దైవభీతి పరాయణతల్ని నూరిపోశారు. ప్రవక్త(స) గారి శిక్షణలో రాటుదేలిన సహాబా తదుపరి ఇస్లామీయ రాజ్యాన్ని ఎలా విస్తరింపజేశారో చరిత్రను అధ్యయనం చేస్తే తెలుస్తుంది.

ఈ విధంగా ప్రవక్త(స) కంటే ముందు హింసా దౌర్జన్యాలతో అట్టుడికిన ఆనాటి సమాజాన్ని తన అత్యుత్తమ ఆచరణతో ఒక సత్సమాజాన్ని నిర్మించారు. ఆ తర్వాత ఖలీఫాలు... ఆ తర్వాత కాలం గడిచిన కొద్దీ... ప్రవక్త(స) వారు ఏకేశ్వర నినాదంతో, ప్రజల్లో ఏ చైతన్యం కలిగించారో... రానురాను ప్రజల్లో దైవభీతి కనుమరుగై మళ్ళీ అత్యంత మూర్ఖత్వపు, నీచమైన సంస్కృతి నేడు విలయ తాండవం చేస్తున్నది. కారణం... ఆయన(స) గారి 'అడుగు జాడల్ని' విడనాడడమే! ఆయన(స) అడుగు జాడల్లో నడిచిన కాలంలో... ఓ మహిళ ఒంటరిగా సనా నుండి మక్కా నగరం వరకు ఒంటరిగా ప్రయాణం చేయగలిగింది. ఆ 'అడుగు జాడల్ని' విడనాడిన కారణంగా మళ్ళీ మత విద్వేషాలు, మూకదాడులు, దోపిడీ, దౌర్జన్యాలు, ఇంకా అనేక దాష్టీకాలు రాజ్యమేలుతున్నాయి.

మరి వీటికి ముగింపు లేదా? ఆనాటి శ్రేయో రాజ్యం తిరిగి స్థాపించలేమా? అంటే ముమ్మాటికి సాధ్యమే? ఏకైక పరిష్కారం... ఆయన(స) గారి అడుగుజాడల్లో నడుచుకోవడమే. కేవలం నోటితో కాకుండా... ఆచరణ ద్వారా ప్రతి విశ్వాసి ఆచరణాత్మకంగా కదిలితేనే ఇది సాధ్యం!



# సంక్షేమ ప్రదాత ముహమ్మద్ ప్రవక్త (స)

**ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**మానవ జాతి** సంస్కరణకు, సముద్ధరణకు భువిపై ప్రభవించిన మహనీయులలో ముహమ్మద్ ప్రవక్త (స) చిట్ట చివరివారు. ఈయన క్రీ.శ. 571 ఏప్రిల్ నెల 20వ తేదీన సోమవారం రోజు అరేబియా దేశంలోని మక్కా నగరంలో జన్మించారు. ఆమినా, అబ్దుల్లాహ్ తల్లిదండ్రులు. జననానికి రెండు నెలల ముందే తండ్రినీ, ఆరేళ్ళప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. అనాథ అయిన ఆరేళ్ళ బాబును తాతయ్య అక్కున చేర్చుకున్నారు. ఆయన తరువాత ముహమ్మద్ సంరక్షణా బాధ్యతను పెత్తండ్రి స్వీకరించారు. ముహమ్మద్ ప్రవక్త(స) వారు చదవడం, రాయడం రాని నిరక్షరాసి. అయినా ఆయన బోధనలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. మానవ సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు, సవాళ్ళకు ఆయన పరిష్కారం చూపారు. ఒక కులానికో, మతానికో, ఒక వర్గానికో, ప్రాంతానికో, ఒక దేశానికో ఆయన బోధనలు పరిమితం కాలేదు. సమస్త మానవులూ ఆయన సంబోధితులే. మానవ జీవితంలోని ఏ రంగమూ ఏ దశలోనూ ఆయన మార్గదర్శకానికి వెలుపల లేదు. కుటుంబం, సమాజం, ఉద్యోగం, వ్యాపారం, నైతికం, ఆర్థికం, ఆరోగ్యం, ఆధ్యాత్మికం, రాజకీయం- ఇలా.. అదీ ఇదీ అని కాకుండా, మానవ జీవితంలోని సమస్త రంగాల్లో ఆయన మార్గదర్శకత్వం వహించారు. మనిషి పుట్టింది మొదలు మరణించే వరకు వివిధ దశల్లో, వివిధ రంగాల్లో ఎలా నడుచుకోవాలో, ఏది హితమో, ఏది హితం కాదో ఆచరణాత్మకంగా విశదపరిచారు.

మానవాళి ఈ బోధనలను అనుసరించినంత కాలం సమాజం సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉంది. ఎప్పుడైతే మానవులు దీనికి విరుద్ధంగా నైతికతకు తిలోదకాలిచ్చి, న్యాయాన్ని, ధర్మాన్ని తుంగలో తొక్కారో, అప్పటినుండీ మళ్ళీ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగానే నేడు సమాజంలో నైతిక పతనం కొనసాగుతోంది. బడుగు బలహీన వర్గాల హక్కులు హరించబడుతున్నాయి. అనేక వర్గాల ప్రజలు హక్కుల కోసం రోడ్లెక్కుతున్నారు. సమాజంలో వివక్ష కొనసాగుతోంది. వరకట్న హత్యలు, శిశుహత్యలు సమసి పోలేదు. మహిళలు నేటికీ తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. కుల వివక్ష, అంటరానితనం ఇప్పటికీ కనబడుతూనే ఉంది. మద్యం ఏరులై ప్రవహిస్తోంది. మత్తుపదార్థాలు, మద్యపాన ప్రియత్వం పెరుగుతూనే ఉంది. అపసవ్యమైన ఆర్థిక విధానాల వల్ల పేదవాడు కడు దరిద్రుడుగా, సంపన్నుడు మరింత సంపన్నుడుగా మారిపోతున్నాడు. మహిళామణుల ధన మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. కళల పేరుతో, స్వేచ్ఛ పేరుతో స్త్రీని బజారుకీడ్చి, అంగడి సరుకుగా మార్చింది నేటి మన ఆధునిక సమాజం. అస్తవ్యస్త విధానాలవల్ల ఆర్థిక రంగం కుదేలైపోయింది. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాలు కలుషితమయ్యాయి. మోసం, దగా, వంచన, అవినీతి, అక్రమాలు సర్వసాధారణ మయ్యాయి. రాజకీయ రంగం అవినీతి, బంధుప్రీతి, అనైతికత, అమానవీయతలతో నిండిపోయింది. రాజకీయాలు ప్రజాసేవ


కోసం అన్న పవిత్ర భావన అటకెక్కి, అందిన వరకు పిండుకొనే ఆయాచిత వరంగా మారిపొయ్యాయి.

ఈ విధంగా సమాజంలోని అన్ని రంగాలూ కలుషితమై, భ్రష్టుపట్టి అశాంతి, అలజడి, అభద్రతలతో సతమతమవుతుంటే, మనం సాధించిన ప్రగతికి ఇక అర్థమేముంటుంది? ఈనాడు మనం అనేక రంగాల్లో అద్భుతాలు సాధించామనడంలో ఏ మాత్రం సందేహం లేదు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన ప్రగతి అంబరాన్ని చుంబిస్తోంది. కాని నైతికంగా, ధార్మికంగా, విలువల పరంగా మనం ఏ దిశగా పయనిస్తున్నామన్నది ప్రశ్నగానే మిగిలి ఉంది. కనుక, ఇకనైనా మనం మరిచిపోయిన పాఠాన్ని మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విస్మరించిన మార్గాన్ని అనుసరించాల్సిన ఆవశ్యకత ఉంది.

ముహమ్మద్ ప్రవక్త(స) వారి బోధనలు, ఉపదేశాల వైపు మరలవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, ఆ మహనీయులు గొప్ప దైవప్రవక్త అయి ఉండి కూడా ఒక సామాన్యుడిలా, సామాజిక కార్యకర్తలా సమాజానికి సేవ చేస్తూ, ప్రజల్ని సన్మార్గ పథాన నడిపించారు. ఇహపర వైఫల్యాల నుండి రక్షించారు. సమాజంలోని సమస్త అసమానతలు, అమానవీయతలతో పాటు, అన్నిరకాల దుర్మార్గాలు, దౌర్జన్యాలను రూపుమాపారు. మానవులంతా ఒక్కటే, మనిషీ మనిషికి మధ్య ఎలాంటి వ్యత్యాసం, ఆధిక్యత లేదు. అందరూ సమానమే. అంతా ఒక తల్లిదండ్రి బిడ్డలే అన్నది ఆయన సందేశం. ఆధిక్యతకు, గౌరవానికి అసలైన కొలమానం నీతి నిజాయితీ, సత్ ప్రవర్తనలే అనేది ఆ మహనీయుని నిర్వచనం. మానవ సమానత్వానికి, సామరస్యం, సోదరభావాలకు ఇది నిలువెత్తు నిదర్శనం. సాటి మానవుల ధన, ప్రాణాలను హరించడం, వారి గౌరవ మర్యాద లకు భంగం కలిగించడం, వారి మనోభావాలను గాయపరచడం, ఒకరిపై నిందలు వేయడం, చాడీలు చెప్పడం, వారి హక్కులను కాలరాయాలనుకోవడం మహా పాతకాలు, క్షంతవ్యం కాని నేరాలన్న ఆ మహనీయుని హితోపదేశాలు మానవ హక్కుల పరిరక్షణకు అద్భుతమైన కవచాలు. శ్రామికుల స్వేద బిందువుల తడి ఆరకముందే వారి వేతనం చెల్లించి వేయాలన్న కారుణ్య బోధ కష్టజీవుల పట్ల ఆ మమతల మూర్తికున్న కరుణకు తిరుగులేని నిదర్శనం. కార్మికుల హక్కుల్ని మానవ హక్కులుగా పరిగణించి, పనికి తగిన గౌరవం ఇవ్వాలని, సహేతుకమైన వేతనం నిర్ణయించాలని, ఆ వేతనం వెంటనే చెల్లించాలని పద్నాలుగు వందల యాభై సంవత్సరాల నాడే ప్రవక్త ప్రబోధించారు. 'మీ క్రింది సేవకులు మీ సోదరులు. దైవం వారిపై మీకు కాస్త అధికారం ఇచ్చాడు, కనుక మీ సోదరుల పట్ల గౌరవ మర్యాదలతో ప్రవర్తించండి. మీరు తినేదే వారికి పెట్టండి, మీరు ధరించేదే వారికి ఇవ్వండి. శక్తికి మించిన భారం వారిపై మోపకండి, అధిక భారం మోపినట్లయితే ఆ పనిలో వారికి సహాయం చేయండి' అని కింది ఉద్యోగులకు సోదర సమాన హోదా ప్రసాదించారు. ప్రవక్త (స) ఆ సేవకులను తన కుటుంబ సభ్యులుగా చూసేవారు. వారిపట్ల ఎన్నడూ కఠినంగా వ్యవహరించేవారు కారు. వారిలో ఎవరైనా వ్యాధిగ్రస్తులైతే స్వయంగా వెళ్ళి పరామర్శించేవారు. వారి ఆరోగ్యం కోసం దుఆ చేసి, ఆర్థిక సహాయం అందించేవారు.

మహిళలను గౌరవించాలని, వారిపట్ల చులకనభావం కూడదని ముహమ్మద్ ప్రవక్త (స) విస్పష్టంగా ప్రకటించారు. తల్లిపాదాల క్రింద స్వర్గం ఉన్నదని చెప్పి స్త్రీజాతి ఔన్నత్యాన్ని శిఖరస్థాయికి చేర్చారు. పురుషులకు స్త్రీలపై ఎలాంటి హక్కులున్నాయో, ధర్మం ప్రకారం స్త్రీలకు కూడా పురుషులపై అలాంటి హక్కులే ఉన్నాయని స్త్రీ హక్కులను నిర్వచించారు. గుడ్డివారు, చూడగలిగే వారు సమానం కానట్లే, జ్ఞానులు, జ్ఞాన విహీనులు సమానులు కాజాలరు అని చెప్పారు. తల్లిదండ్రులు తమ సంతానానికి మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని, భావి తరాల సంక్షేమానికి ఇది చాలా అవసరమని నొక్కి వక్కాణించారు. విద్య నేర్చుకోడానికి అవసరమైతే చైనా దేశమైనా వెళ్ళమని విద్యా విజ్ఞానాల ప్రాముఖ్యతను తెలియజేశారు. పారేనది ఒడ్డున ఉన్నప్పటికీ నీటిని వృధా చేయరాదని, వృక్ష సంపదను నాశనం చేయ కూడదని, ప్రకృతి సమ తుల్యతకు, మానవాళి మనుగడకు ఇవి అత్యంత అవసరమని ఉద్బోధించారు. ప్రళయం ముంచు కొస్తున్నప్పటికీ, మీ చేతిలో ఒక మొక్కఉంటే ముందు దాన్ని నాటండని పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటి చెప్పారు. మొక్కలు నాటడం సదఖా అని కూడా ప్రవక్త మహనీయులు ఉపదేశించారు.

అందుకే, "ధర్మబోధకులందరిలో అధికంగా సాఫల్యాన్ని పొందిన వారు ప్రవక్త ముహమ్మద్ మాత్రమే"నని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ఘనంగా కీర్తించింది. కనుక ఈనాటి పరిస్థితులు, పరిణామాల దృష్ట్యానైనా ముహమ్మద్ (స) ప్రవక్త వారి బోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం ఆధునికత, శాస్త్రవిజ్ఞానమొక్కటే సర్వరోగ నివారిణి కాదు. దాంతోపాటు నైతిక, మానవీయ విలువలను ప్రోదిచేసే దైవప్రవక్తల ఉపదేశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. శాస్త్రవిజ్ఞానానికి ఆధ్యాత్మిక దృక్పథం జోడించి విలువల పునర్నిర్మాణానికి పూనుకోవాలి. ఈ విషయంలో ముహమ్మద్ ప్రవక్త(స) వారు తన 23 ఏళ్ళ దైవదౌత్య కాలంలో సాధించిన అపూర్వ విజయ సాఫల్యాలను, ఆయన నిర్మించిన సత్ సమాజాన్ని, ఆయన స్థాపించిన శ్రేయోరాజ్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. తద్వారా నేటి మన సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అధిగమించి, నైతిక, మానవీయ విలువలతో నిండిన సంక్షేమ రాజ్యాన్ని పునర్ నిర్మించుకోవచ్చు.



# స్త్రీల పట్ల దైవప్రవక్త (స) కారుణ్యం

నసీరా బేగం

**ప్రపంచం మొత్తంలో** స్త్రీ స్థానం గురించి, ఆమె హక్కుల గురించి ఎల్లప్పుడూ చర్చ జరుగుతూనే ఉండేది, జరుగుతూ ఉంది కూడాను. ఆమెకు గౌరవ స్థానాన్ని, హక్కులను ఇవ్వటానికి చాలామంది మహానుభావులు కృషి చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వారు తమ కృషిలో పూర్తి సాఫల్యాన్ని పొందలేకపోతున్నారు. ఈనాటికీ ఆమె పుట్టుకను భారంగా భావించటం జరుగుతూనే ఉంది. ఇంతకన్నా ఘోరమైన పరిస్థితి కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) గారి రాకకు పూర్వం కూడా ఉండేది. ఈ విషయం ఖుర్‌ఆన్ గ్రంథంలో ఈ విధంగా ప్రస్తావించబడింది : వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కి నక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా అని ఆలోచిస్తాడు. చూడు! వారు దేవుని విషయంలో చేసే నిర్ణయాలు ఎంత దుష్టమైనవో'' (16: 58,59). అరబ్బు సమాజంలో ఆనాడు ఆడపిల్లకు జీవించే హక్కు కూడా ఉండేది కాదు. సజీవంగానే ఆమెను పాతి పెట్టడం జరిగేది.

హజ్రత్ ఉమర్(రజి) ఇలా తెలియజేశారు : అజ్ఞాన కాలంలో స్త్రీలను మేము ఎంతో నీచంగా చూసేవారము. ఒక వస్తువుగానో లేదా ఒక బానిసగానో పరిగణించేవారము. ఆమెకు సమాజంలో ఎటువంటి గౌరవాన్ని, స్థానాన్ని ఇచ్చేవారము

కాము. కాని దైవప్రవక్త(స,) పురుషుని మాదిరిగానే స్త్రీ కూడా గౌరవప్రదమైనదే. ఆమెకు కూడా పురుషుల మాదిరిగానే హక్కులన్నీ వర్తిస్తాయి అని తెలియజేశారు. ఆమెకు పూర్తి హక్కులివ్వటం, ఆమెను గౌరవించటం పురుషునిపై విధిగా చెయ్యబడిందని, వీటిలో ఏ విధమైన భంగాన్ని కలుగజెయ్యకూడదని కూడా తాకీదు చేశారు.

ఆయన(స) గారు బోధించటమే కాదు క్రియాత్మకంగా చేసి చూపించారు కూడాను. ఒక పురుషునితో ఒక స్త్రీకి ముఖ్యమైన నాలుగు సంబంధాలు ఏర్పడి ఉంటాయి. 1) తల్లి 2) చెల్లి 3) భార్య 4) కూతురు.

**1) తల్లి :** దైవప్రవక్త(స) గారి తల్లి గారు బాల్యంలోనే మరణించారు. కాని ఆయన(స) గారికి పాలు త్రాపించిన తల్లి హజ్రత్ హలీమా సాదియా (ర) పెద్ద వయసు వరకు జీవించారు. ఆయన(స) ఆమె గారిని ఎంతో గౌరవించేవారు. ఒకసారి ఆయన(స) తన అనుచరులతో సమావేశమై ఉన్నారు. అంతలో అక్కడికి ఒక ముసలి స్త్రీ వచ్చింది. ఆయన(స) ఆమెను చూడగానే లేచి నిలుచున్నారు. ఎంతో ఆప్యాయతతో, ప్రేమతో ఆమెను ఆహ్వానించారు. ఆయన(స) పవిత్ర భుజాలపై కప్పుకుని ఉన్న శాలువాను తీసి ఆమె గారి కాళ్ళ వద్ద పరిచారు. ఆమెను చేయి పట్టుకుని దానిపై కూర్చొబెట్టారు. ఆ తరువాత ఆయన(స) కూడా ఆమె ముందు కూర్చొని చాలాసేపు ముచ్చటించారు. ఈ దృశ్యాన్ని చూసిన ఆయన(స) గారి సహచరులు ఆశ్చర్యపోయారు. ఆమె కన్న తల్లి కూడా కాదు. కేవలం పసి పిల్లాడిగా ఉన్నప్పుడు పాలు త్రాపించిన తల్లినే ఇంతగా గౌరవిస్తున్నారా? అని ఇంకా ఆయన ప్రవక్త పదవీ బాధ్యతలో తలమునకలై ఉన్నప్పటికీ ఆ తల్లి రాగానే వెంటనే లేచి నిలబడటం, ఆమెను ఆహ్వానించటం, ఆమెను గౌరవించటం, ముచ్చటించటం మామూలు విషయం కాదు. తల్లుల పట్ల ఎలా వ్యవహరించాలో ఆయన(స) చూపించారు. ఇంకా తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది అని తెలియజేశారు. ఆమెను గౌరవించకుండా, సేవించకుండా స్వర్గాన్ని పొందటం అసంభవమనే విషయాన్ని కూడా తెలియజేశారు.

**2) చెల్లి :** ఆయన(స) గారికి సొంత అన్నాతమ్ముళ్ళు, అక్కాచెల్లెళ్ళు ఎవ్వరూ లేరు. ఆయన తన తల్లిదండ్రులకు ఒక్కరే సంతానం. హునైన్ సంగ్రామంలో కొంతమంది పట్టుబడి ఖైదీలుగా వచ్చారు. కాని హవాజున్ తెగకు చెందిన సమూహం వచ్చిన తరువాత ఆ ఖైదీలందరినీ విడిచిపెట్టారు. ఆ ఖైదీలలోని ఒక స్త్రీ ఆయన(స) గారి వద్దకు వచ్చి నేను మీ చెల్లిని అని అన్నది. దానికి దైవప్రవక్త(స) నీవు నాకు ఎలా చెల్లివి అవుతావు. నాకు చెల్లెలెవరూ లేరే అన్నారు. దానికి ఆమె నేనూ, మీరూ ఒకేసారి హలీమా సాదియా(ర) తల్లిపాలు త్రాగినవారము. మనమిద్దరము కలిసి ఆడుకునేవారము అని ఆమె గుర్తు చేయగా ఆయన(స) గారికి కూడా జ్ఞాపకం వచ్చింది. అవును అవును... అని సంతోషపడ్డారు. ఇస్లామ్ ధర్మంలో ఒకే స్త్రీ పాలు త్రాగినవారు అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళు అవుతారు. ఆ తరువాత ఆయన(స) ఆమె గారితో నీ ఈ సోదరునితోపాటు మదీనా పట్టణానికి వచ్చినట్లయితే నీ బాధ్యతనంతా నీ ఈ సోదరుడు చూసుకుంటాడు. ఒకవేళ నీవు తిరిగి వెళ్ళిపోదలిస్తే ఈ నీ సోదరుడు ఖాళీ చేతులతో నిన్ను పంపించడు అని అన్నారు. దానికి ఆమె తన ప్రాంతానికి తిరిగి వెళతాను అని చెప్పింది. అప్పుడు ఆయన(స) అన్న చెల్లెలికిచ్చే గౌరవ మర్యాదలన్నీ చేసి ఎన్నో కానుకలిచ్చి అటుగా వెళ్ళే బృందంతోపాటు క్షేమంగా ఇంటికి చేరే ఏర్పాట్లన్నీ చేసి మరీ పంపించారు. ఆయన(స) గారిచ్చిన ఈ సందేశం అన్నాచెల్లెళ్ళ మధ్య ఉండే బంధాన్ని, బాధ్యతని చక్కగా తెలియజేస్తోంది.

**3) భార్య :** దైవప్రవక్త(స) గారి మొదటి భార్య హజ్రత్ ఖదీజా(ర). ఆయన(స) గారు దైవప్రవక్త కాక పూర్వం అంటే పదిహేను సంవత్సరాలకు పూర్వమే ఆమె గారితో వివాహం జరిగింది. ఈ భార్యాభర్తల బంధం ఎంతో అన్యోన్యంగా, ప్రేమగా సాగింది. వారి ఈ వైవాహిక జీవితం మొత్తం ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా గడిచింది. ప్రతి విషయంలోనూ ఒకరి కొకరు తోడు నీడగా ఉండేవారు. ఆయన(స) ప్రవక్త అయిన తరువాత మొట్టమొదట ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించింది కూడా ఆమెయే. ఆ తరువాత ఆయన(స) గారిపై విరుచుకుపడిన కష్టనష్టాలన్నింటిలోనూ ఆమె సహాయాన్ని అందించారు. తమ సర్వస్వాన్ని భర్త కోసం, ఆయన ప్రచారం చేసే ధర్మం కోసం త్యాగం చేశారు. దీని దృష్ట్యా ఆయన(స) ఆమెను ఇంకా ఎంతో గౌరవించే వారు. ప్రేమించేవారు. ఆమె గారు మరణించిన సంవత్సరాన్ని దుఃఖ సంవత్సరం అని చెప్పి ఎంతో బాధపడ్డారు. ఆమె గారు జీవించి ఉన్నంత వరకు రెండో వివాహం చేసుకోలేదు. ఆ తరువాతనే అవసరం దృష్ట్యా, వివేకం దృష్ట్యా వివాహాలు చేసుకున్నారు. ఆ కాలంలో ఒక్కో పురుషుడు ఎన్నో

**మిగతా 30వ పేజీలో...**




తహ్సీన్ హుమైర్వీ

**హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(ర)** అనారోగ్యం పాలయ్యారని తెలిసి ఆయన్ను పరామర్శించడానికి దైవప్రవక్త (స) వెళ్ళారు. ఇహ లోకంలోనే స్వర్గ శుభవార్త పొందిన పదిమందిలో ఆయనొకరు. అప్పుడు సాద్(ర) విపరీతమైన నొప్పితో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రతలో కూడా ఆయన ప్రవక్త(స)తో సలహా సంప్రదింపులు జరిపారు. వారి సంభాషణ ఇలా సాగింది.

'దైవప్రవక్తా! నా రోగం ఎంత ముదిరిపోయిందో మీరు చూస్తూనే ఉన్నారు. నేనొక ధనవంతుణ్ణి. నాకు ఒక్కగానొక్క కూతురు తప్ప వారసులెవ్వరూ లేరు. నేను నా మొత్తం ఆస్తి పాస్తుల్లో నుంచి మూడింట రెండొంతులను దానం చేయొచ్చా?'

"వద్దు, అంతొద్దు"

'అయితే సగం సంపద దానం చేయనా?'

"వద్దు, ఇది కూడా సరైనది కాదు".

'అలాగైతే మూడింట ఒక వంతైనా దానం చేయమంటారా?

"సరే, అలా చేయొచ్చు. మూడింట ఒక వంతు కూడా ఎక్కువే. ఎందుకంటే నీవు నీ వారసులను పరుల ముందు చేయి చాపుతూ తిరిగే దరిద్రులుగా వదిలి వెళ్ళటం కన్నా స్థితిమంతులుగా వదిలి వెళ్ళటం ఎంతో శ్రేయస్కరం" అంటూ ఆ మహనీయుని(స) గొంతు పలికింది. ఇది ఆయన(స) తన శిష్యునికి తెలిపిన ఒక ఆర్థిక ప్రణాళిక.

స్వయానా ఆయన ఏనాడూ మూడు పూటలా భోజనం చేయలేదు. కొన్నిసార్లు రోజుకొక్కసారి మాత్రమే భోంచేసే వారు. అప్పుడు కూడా కడుపునిండా తినేవారు కాదు. ఇంకొన్ని సార్లు పస్తులతోనే గడిచిపోయేది.

ప్రణాళిక అంటేనే ఒక పనిని చిత్తశుద్ధితో సక్రమంగా సకాలంలో నిర్వర్తించేందుకు మానసికంగా సిద్ధం కావటం. సమస్త విషయాల్లో సకల రంగాల్లో ఆదర్శనీయమైన మహనీయ ముహమ్మద్(స) జీవితం ఈ విషయంలో కూడా మార్గ నిర్దేశన చేస్తుంది. చరిత్రను నిశితంగా పరిశీలిస్తే ఆయన ప్రణాళికలు ప్రధానంగా నాలుగు రకాలుగా ఉండేవని తెలుస్తుంది.

## దీర్ఘకాలిక ప్రణాళిక లేదా శాశ్వత ప్రణాళిక

చిట్టచివరి ప్రవక్త(స) మానవాళిని శాంతి వైపునకు, దైవ విధేయత వైపునకు పిలిచారు. ఈ ప్రాపంచిక జీవితం అశాశ్వతమని, మరణాంతర జీవితమే శాశ్వతమైందని బోధించారు. శాశ్వతమైన జీవితంలో స్వర్గ సౌఖ్యాలు పొందాలంటే, అశాశ్వతమైన ఈ జీవితంలో విలువలతో కూడిన జీవనం కొనసాగించాలని, ఇక్కడ చేసే ప్రతి పనికి అక్కడ జవాబు ఇవ్వాల్సి ఉంటుందనేది ఆయన బోధనల సారం.

అలా కాకుండా గాలిలో దీపం పెట్టి, పైవాడి మీదే భారమంతా అన్నట్టు, నేరాలపై నేరాలు చేస్తూ క్షమించేవాడు దేవుడున్నాడులే అంటూ బూటకపు విశ్వాసాన్ని ప్రదర్శిస్తే ప్రయోజనం ఉండదని ఆయన(స) హితవు పలికారు. "నిత్యం ఆత్మ పరిశీలన చేసుకుంటున్న వాడు, ఇంకా మరణాంతర జీవితం కోసం సన్నాహాలు చేసుకునేవాడు వివేకవంతుడు. దీనికి విరుద్ధంగా తన మనోవాంఛలకు లొంగిపోయి అల్లాహ్‌పై ఆశలు పెట్టుకొని కూర్చునేవాడు మూర్ఖుడు" అన్నారాయన. (తిర్మిజీ)

### జీవితకాల ప్రణాళిక

బ్రతికి ఉన్నన్నాళ్ళు ఎలా బ్రతకాలి? ఏం చేయాలి? ఏం చేయకూడదు? కన్నవాళ్ళు, బంధువులు, ఇరుగుపొరుగు వారితో ఎలాంటి వ్యవహారం ఉండాలి? పిల్లలను ఎలా తీర్చిదిద్దాలి? మనం వాళ్ళ కోసం ఏం చేశాం? చేయగలం? ఇలాంటి సవాలక్ష ప్రశ్నలకు ప్రవక్త జీవితంలో అనేకానేక సమాధానాలు ఉన్నాయి. వాటిలో తొలుత ప్రస్తావించిన సంఘటన ఒక మచ్చుతునక.

## స్వల్పకాలిక ప్రణాళిక

అత్యవసర పరిస్థితుల్లో, యుద్ధ సమయాల్లో, ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించడానికి రూపొందించే ప్రణాళిక. హిజ్రత్ సమయంలో, బద్ర్, ఉహుద్ యుద్ధ మైదానాల్లో, కందకం తవ్వకాల్లో ఇంకా చాలా సందర్భాల్లో ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

మక్కావాసుల దౌర్జన్యం మితిమీరి పోయి, చివరాఖరికి దైవప్రవక్త(స)ను అంతమొందించేందుకు పన్నాగాలు పన్నారు ఖురైషులు. ఆ కుతంత్రాలను, కుయుక్తులను బెడిసి కొట్టిన హిజ్రత్ సంఘటన ఇస్లామీయ చరిత్రలో ఒక మైలురాయి. మక్కా నుండి మదీనాకు పోయే సాధారణ మార్గాన్ని ఆయన (స) వలస పోవటానికి ఎంచుకోలేదు. సత్య తిరస్కారుల వెతుకులాట అటువైపు ఎక్కువగా ఉంటుందని ఆయన ముందుగానే పసిగట్టారు. మక్కా పట్టణానికి కుడి వైపున మూడు మైళ్ళ దూరంలో ఉన్న సౌర్ గుహలో మిత్రుడు అబూబక్ర్ (ర)తో పాటు మూడ్రోజులు తలదాచుకున్నారు.

హ్జ్రత్ అబూబక్ర్(ర) కుమారుడు అబ్దుల్లాహ్(ర) రోజంతా బజారుల్లో తిరుగుతూ శత్రువుల కుట్రలను, పన్నాగాలను పసిగట్టి, అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ప్రియతమ నాయకునికి సమాచారం అందించేవారు. పెద్ద కుమార్తె హ్జ్రత్ అస్మా(ర) రోజుకు సరిపడా ఆహారాన్ని తయారు చేసుకొని ఇచ్చొచ్చేవారు. ఒకసారి భోజనాన్ని కట్టడానికి ఏ వస్తువు లేకపోతే ఆమె తన నడుముకు కట్టుకున్న నడికట్టును రెండుగా చింపి, ఒక దాన్ని నడుముకు కట్టుకొని, రెండో దానితో ఆహారాన్ని సర్దారు. ఆమె సమయస్ఫూర్తిని చూసి దైవప్రవక్త (స) ఆమెను 'జాతున్నితాఖైన్' (రెండు చున్నీలామె)గా కితాబు ఇచ్చారు. అబూబక్ర్ (ర) గారి పశువుల కాపరి ఆమిర్ బిన్ ఫుహైరా మేకలను తోలుకుంటూ గుహ వైపుకు వెళ్లి, వారిద్దరికీ పాలు త్రాపించేవాడు. శత్రువులు అడుగుజాడల్ని గుర్తించడానికి వీలు లేకుండా, ముందుగా అన్నాచెల్లెలు నడుస్తుంటే వారి వెనుక మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు. అంతేకాకుండా ఈ ప్రయాణంలో అబ్దుల్లాహ్ బిన్ ఉరైఖిత్ దారి చూపించేవాడిగా నియమించబడ్డాడు. అదొక గొప్ప ప్రణాళిక.

## రోజువారి ప్రణాళిక

దైవప్రవక్త(స) దినచర్య తెల్లవారుజామున కంటే ముందే దైవధ్యానం (Meditation) నమాజుతో మొదలయ్యేది. మరో కొత్త దినం ప్రసాదించినందుకు ఆయన దైవానికి కృతజ్ఞతలు తెలిపేవారు. ఈ ధ్యానం శారీరకంగానూ మానసికం గానూ ఒత్తిడిని తగ్గించేది. దాని ద్వారా ఏకాగ్రత, ప్రశాంతత, సానుకూల ఆలోచనలతో పాటు నూతన ఉత్తేజం లభించేది. అంతేకాకుండా 'శాశ్వత ప్రణాళిక' ప్రతీసారి గుర్తు చేసేది.

ఆయన (స)ఫజ్ర్ నమాజు తర్వాత శిష్యులకు శిక్షణా తరగతులు (Training Classes) జరిపేవారు. ఖుర్ఆన్ అవగాహన తరగతులే కాకుండా ఎవరైనా కలగంటే దాన్ని విశ్లేషించేవారు. ఈ శిక్షణా తరగతులు చాలా ఆసక్తికరంగా ఉండేవి. కొన్నిసార్లు ప్రశ్నోత్తరాల మాదిరిగాను, ఇంకొన్నిసార్లు

నేలపై గీతలు గీసి బోధించేవారు. ప్రజల యోగక్షేమాల గురించి వాకబు చేసేవారు.

తర్వాత ఇంటి బాధ్యతలను (Family Responsibilities) నిర్వర్తించేవారు. దైవప్రవక్త (స) ఇంట్లో ఏం చేసేవారని తరుచుగా ఆయిషా(ర)ను ప్రజలు అడిగేవారు. దానికామె 'ఆయన తన పనులు తాను చేసుకునేవారు. ఇంటివారికి, వారి పనుల్లో సహాయపడేవారు' అని చెప్పేవారు.

దైనందిన పనులు ముగించుకొని ప్రజా నాయకుడు ప్రజా సమస్యలపై (public issues) దృష్టి సారించేవారు. మదీనా వీధుల్లో తిరుగుతూ ప్రజల బాగోగులు చూసుకునేవారు. రోగులను పరామర్శించేవారు. సేవకుడిగా అందరికీ సహాయపడే వారు. ప్రజా నాయకుడిగా ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉండేవారు.

జుహ్ర్ నమాజు అనంతరం కాస్సేపు వేను వాల్చేవారు. తిరిగి మస్జిదె నబవీలో సహచరులతో పాటు కలసి ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరిపేవారు. ఈ ప్రక్రియ అస్ర్ నమాజు వరకు కొనసాగేది.

అస్ర్ తర్వాత తన విలువైన సమయాన్ని కుటుంబీకులతో (Family Time) గడిపేవారు. ఆయన తన ఇంటి వారితో ప్రేమగా మసలు కునేవారు. మగ్రిబ్ నుంచి ఇషా నమాజు వరకు తిరిగి ప్రజా సేవకు అంకితమయ్యేవారు. రాత్రి భోజనం, నమాజ్ కంటే ముందే చేసేవారు. ఇషా తర్వాత అవసరం ఉంటే తప్ప మాట్లాడేవారు కాదు. దైవాన్ని ధ్యానిస్తూ పడుకునేవారు.

సృష్టికర్త మొత్తం విశ్వాన్ని ఒక క్రమబద్ధంగా, ప్రణాళికతో నడిపిస్తున్నాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలి అయిన మానవ మహోపకారి ప్రణాళికాబద్ధమైన జీవితం, ప్రళయం వరకు ఆదర్శంగా నిలిచింది. ఖైరె ఉమ్మత్ మాత్రం ఇంకా గాఢ నిద్రలోనే ఉండటం ఎంతవరకు సమంజసమో మనం ఆలోచించాలి.

## స్త్రీల పట్ల కారుణ్యం (27వ పేజీ తరువాయి)

వివాహాలను చేసుకునేవాడు, కాని వారి హక్కులను సక్రమంగా నెరవేర్చేవాడు కాదు. కాని దైవప్రవక్త(స) ఆచరణాత్మకంగా భార్య లందరినీ సమానంగా ప్రేమించి, వారి హక్కులను సమానంగా నెరవేర్చి మరీ చూపించారు.

ప్రియ సతీమణి హజ్రత్ ఆయిషా(ర.జి) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త(స) ఏనాడూ ఏ భార్యనుగాని, ఏ బానిసను గాని చిన్న దెబ్బ కూడా కొట్టలేదు. ఆయన(స) కఠినంగాను, క్రూరంగానూ ఏనాడూ వ్యవహరించలేదు. భార్యలందరినీ సమాన దృష్టిలో చూసేవారు. సమాన హక్కులను ఇచ్చేవారు. అందరితో ప్రేమానురాగాలతో వ్యవహరించేవారు. వారితో ముచ్చటించేవారు. వారి పనులలో సహాయపడేవారు. అంతేకాదు, వారి సలహాలను కూడా గౌరవించేవారు. ఏనాడూ ఆయన(స) గారి భార్యలకు ఆయన గారిపై ఎలాంటి ఫిర్యాదులు ఉండేవి కావు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే తన ఇంటివారితో మంచిగా వ్యవహరిస్తాడో అతనే అందరికంటే ఉత్తముడు. నేను నా ఇంటి వారితో మీ అందరి కంటే ఉత్తమంగా వ్యవహరిస్తాను.

**4) కూతురు :** దైవప్రవక్త(స) గారికి హజ్రత్ ఖదీజా(ర) గారి ద్వారా నలుగురు కూతుళ్ళు జన్మించారు. ఆనాటి కాలంలో ఆడపిల్లలను సజీవంగా సమాధి చేసేవారు. కాని ఆయన(స) ప్రతి పాప పుట్టుకపైనా సంతోషించారు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఎంతో గారాబంగానూ, వాత్సల్యంతోనూ పెంచి పోషించారు. వారి వివాహాలు చేశారు. అల్లుళ్ళతో కూడా చక్కగా, గౌరవంగా, ప్రేమగా వ్యవహరించే వారు. కాని ముగ్గురు కూతుళ్ళు తక్కువ వయసులోనే పరమపదిం చారు. తన మనవలు, మనవరాళ్ళను కూడా అధికంగా ప్రేమించేవారు. ఆడించుకునేవారు. ముద్దాడేవారు. ఆయన(స)గారి పిల్లల పట్ల ఈ ప్రవర్తనను చూసి ప్రజలు ఆశ్చర్యచకితులయ్యే వారు. ఆయన(స) గారి చివరి కుమార్తె హజ్రత్ ఫాతిమా(ర) గారు తన ఇంటికి వచ్చినప్పుడు లేచి నిలబడి ఆహ్వానించేవారు. నుదుటిని ముద్దాడేవారు. తాను కూర్చుని ఉన్నచోట ఆమె గారిని కూర్చొబెట్టేవారు. అప్పుడప్పుడు ఆమె గారి ఇంటికివెళ్ళి క్షేమ సమాచారాలు తెలుసుకునేవారు. ఏదైనా ప్రయాణం నుంచి తిరిగి వచ్చినట్లయితే మొదట మస్జిద్‌కు వెళ్ళి రెండు రకతులు నమాజు చేసుకుని మొట్టమొదట కూతురు ఫాతిమా(ర) ఇంటికి వెళ్ళి వచ్చేవారు. కూతుళ్ల పోషణ తండ్రిని స్వర్గంలో ప్రవేశింపజేస్తుందనే శుభవార్తను కూడా ఇచ్చారు.

# మనోవాంఛల దాస్యం మంచిది కాదు

షమీమ్ సుల్తానా

**పచ్చి దొంగలాంటిది సుఖాపేక్ష.** ఇది మన ఇంట, మన నివాసంలో అవలీలగా ప్రవేశించి, వ్యసనంగా మారి, అతిథిగా మర్యాదలందుకొని, క్రమంగా మనల్ని బానిసల్ని చేసి, మన మనో నివాసానికి యజమానురాలై కూర్చొంటుంది.

ఈ సుఖాపేక్ష క్రమంగా మానవుల్ని క్రూర మృగాలుగా మార్చే పథకాలతో, మితిమీరే మన కోర్కెలకు ఆజ్యం పోసి, నిప్పంటించి నిలువునా మనల్ని దహించివేస్తుంది. మానవునిలో నిదురపోయే దానవునికి చురక పెట్టి లేపి, బురద కోర్కెలు జల్లి మనల్ని కీలుబొమ్మల్ని చేస్తుంది. ఈ సుఖాపేక్ష చూపించే కలలు మనోహరంగా, మతి పోగొట్టే విధంగా ఉంటాయి. దాని చేతులు పట్టులాగా మృదువుగా ఉన్నా, దాని గుండె రాతి బండై, హృదయం ఇనుము వలే కఠినంగా ఉంటుంది. అది మన ప్రక్కనే ఉంటూ, మాయమాటలతో మనల్ని మభ్యపెడుతూ, మనల్ని ఐహిక మత్తులోకి లాగి, రకరకాల నినాదాలతో జోకొట్టి, నిద్రపుచ్చి మన జ్ఞానేంద్రియాలను అచేతనావస్థలో పడవేస్తుంది. మన పంచేంద్రియాలను తనకు అనుకూలంగా మలచుకుంటుంది. మనం మత్తులోకి జారుకున్నాక మన నిస్సహాయ స్థితిని చూసి ఎగతాళి చేస్తుంది. మాటకు బాటకు పొంతన లేని మన ప్రవర్తనను చూసి వెర్రిగా నవ్వుకుంటుంది. 'మీరా స్వర్గానికి పోయేది?' అని పరిహాసమాడుతుంది. పెళుసై విరిగిపోయే కొమ్మవలె, మన ఇంద్రియాల్ని విరిచి, విసిరి కోరికల ముళ్ళపొదలో పారేస్తుంది. మనిషికి ఆజన్మ శత్రువైన ఈ సుఖాపేక్ష మనిషి ఆత్మ శక్తిని హరించి, దాని అంత్యక్రియల్లో ఎంచక్కా పాల్గొంటుంది. అదే పైశాచికత్వం- వాడే షైతాన్. వాడే మన బహిరంగ శత్రువు.

**ఈ విషయంలో ప్రవక్త (స) మనకు చేసిన హితవు:** నిశ్చయంగా షైతాన్ మీ పాలిట శత్రువు. వాడిని శత్రువుగానే భావించండి. వాడి విష వలయంలో చిక్కుకోకండి. మీరు అతని మాటలకు మచ్చిక కావద్దు. మీ తండ్రి ఆదంను శ్రేయోభిలాషి ముసుగులో వెళ్ళి దైవాగ్రహానికి గురిచేసినట్లే మిమ్మల్ని సైతం నట్టేటా ముంచే ప్రమాదం ఉంది. ఈ లోకం మీ శాశ్వత నిలయం కాకూడదు. ఇక్కడ మీరో బాటసారిలా జీవితం గడపాలి. దారిన సాగిపోయే బాటసారికి చెట్టు నీడ ఎలాంటిదో మీకు ఈ లోకం అలాంటిదే. మీరు మీ ఇళ్ళల్లో ప్రవేశించేటప్పుడు సలాం చేసి, **'బిస్మిల్లాహ్'** అంటూ ప్రవేశించండి. **'బిస్మిల్లాహ్'** అనే భోంచేయండి. **'బిస్మిల్లాహ్'** అంటూనే పడక మీద మేను వాల్చండి. మీ ఇళ్ళల్లో ఎప్పుడూ ఖుర్ఆన్ పారాయణం వినబడుతూ ఉండాలి. సూరతుల్ బఖరాను ఖచ్చితంగా చదువుతూ ఉండండి. ఏ గృహంలోనైతే బఖరా సూరా పారాయణం జరుగుతుందో ఆ గృహం దరిదాపు

మిగతా 33వ పేజీలో...

# మహానగరిలో మహా ప్రవక్త (స) మహితోక్తులు

అబుల్ హసన్

**మానవ** సృష్టికి మునుపే దైవదూతల కాలం నాటిది కాబా గృహం. ఆకాశంలో దైవదూతల ఆరాధనా క్షేత్రం బైతుల్ మామూర్ అయితే, అవనిలో మనుజ భక్తుల ప్రార్థనాలయం ఈ ప్రతిష్ఠాలయం. భువిలో తొలి దైవగృహం, భూతల స్వర్గం ఈ గృహం. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) హృదయాలను ఏలిన మహీతలం మక్కా నగరం. అనాదిగా ఈ గృహం విశ్వమానవ మార్గదర్శక కేంద్రం.

ఈ పుణ్య క్షేత్రానికి దైవ ప్రవక్తలందరూ తమ జీవిత కాలంలో ఏదో ఒక సందర్భాన వచ్చి దర్శించుకున్నట్లు, వారిలోని అనేకమంది ప్రవక్తలు తమ శేష జీవితాన్ని ఇక్కడే గడిపినట్లు, అమరవీరులై కీర్తిశేషులైనట్లు ప్రతీతి.

ఈ మహా నగరాన్నే పూర్వం 'బక్కా' అని పిలిచేవారు. ఎట్టి శత్రువునయినా ఇట్టే క్షమించి వదిలేయాలన్నది దానర్థం. ఎంత మధురం! ఎంత మనోహరం - మక్కా నగరం? బైబిల్లో, పురాణాల్లో ప్రపంచ ఇతిహాసాల్లో - అంతిమ దైవ గ్రంథం ఖుర్ఆన్‌లో - ఈ పవిత్ర పురం గురించి ఎన్నో వర్ణనలు, ఉదంతాలు ఉన్నాయి. ప్రవక్తల పితామహులు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన పుత్ర రత్నంతో కలిసి ఈ పవిత్ర గృహాన్ని పునర్నిర్మించారన్నది ప్రసిద్ధిగాంచిన ప్రతీతి. ఆ కుమారుని పేరు ఇస్మాయీల్. ప్రవక్త (స) వారి వంశానికి మూల పురుషుడు. వారిరువురి ప్రార్థనా ఫలితమే మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రభవనం. ముహమ్మద్ (స) వారు ప్రభవింపజేయబడింది ఈ నగరంలోనే.

ఆ నగరం భక్తిపరులకు ఆలవాలం. సత్యసంధులకు పంట పొలం. సాత్వికులకు, శాంతి ప్రియులకు ఆలయం. అటువంటి మహానగరం కొన్నేళ్ళుగా అంధకారాలతో, మూఢ నమ్మకాలతో అతలాకుతలమవుతూ ఉంది. అట్టి తరుణంలో ప్రకృతి ధర్మాన్ని, సంపూర్ణ ధర్మశాస్త్రాన్ని, అంతిమ గ్రంథాన్ని, దివ్య జ్ఞానాన్ని అనేక రేఖల్లో, రూపాల్లో - అక్షరాల్లో - ఆచరణల్లో అభిషేకించేందుకు వచ్చారు మహాప్రవక్త ముహమ్మద్ (స). నీతి నడవడికలు, సత్యం ధర్మాల రీత్యా ఆయనో మహోన్నత పర్వత శిఖరం. అందు నుండి ఎన్నో సెలయేర్లు లోకంలో నలుదిశలా ప్రవహించి - మహానదులై - ఎందరివో సత్యార్తిని తీర్చి - అనంత, అద్భుత, అద్వితీయ ఆదర్శప్రాయుల్ని చేశాయి.

ఇవీ ఆ పవిత్ర పురానికీ, పుర ప్రవక్తకు సంబంధించిన కొన్ని పూర్వేతిహాసాలు. ఇక ఆ నగరంలో ఆయన చిలికించిన అమృత జల్లులు, ఆదర్శ పలుకుల గురించి తెలుసుకుందాం! పవిత్ర మైన మార్గదర్శక కేంద్రాన్ని ఫలవంతం చేయడానికీ, ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దడానికి నిర్మలమైన దివి నుండి కురిసిన కారుణ్య జల్లే, అంతరాత్మ హరివిల్లే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స). అజ్ఞానులకు జ్ఞానకాంతుల నిచ్చి, చీకట్లలో మ్రగ్గుతున్న జనాలకు వెలుగు బాట చూపి సత్యమార్గాన శాంతి పథాన నడిపించేందుకు ఆవిర్భవించిన క్రాంతికారుడే, శాంతమూర్తియే కారుణ్య ప్రవక్త ముహమ్మద్(స).

తెల్లవారు జామున మంచు కురిసే వేళలో ఎడారి ఓడల క్షీరసాగరాలు, పక్షుల కిల కిలా రావాలు, అండ పిండ బ్రహ్మాండాల స్తుతిగీతాల, ప్రత్యూషల దైవనామ స్మరణలు, రెక్కల్లో తలదూర్చి ఆత్మ పరిశీలన చేసుకుంటున్న పక్షులు - అప్పుడే తొలిజాము తొలి కోడి కూసింది. చల్లని నీటితో వుజూ చేసుకుని పవిత్ర భావాలతో పరమోన్నతుడి సన్నిధిలో మోకరి ల్లేందుకు బయలుదేరారు ప్రవక్త శిఖామణి (స). మలి కోడి కూసే వేళకు ప్రార్థన పూర్తి చేసుకుని దివ్యగ్రంథ పఠనంలో లీనమైనారు. ప్రపంచ చీకట్లను పటాపంచలు చేసేందుకు ఆ ప్రభాకరుడు పగటి పూట ఉదయిస్తే, ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు నిద్రను త్యజించి నిశిరాత్రి ప్రార్థనల్లో ప్రభువు సన్నిధానంలో ప్రణమిల్లుతున్నాడు ఈ ధర్మప్రభాకరుడు. ఆ రవికిరణం చీకటి పడ్డాక కనుమరుగైపోతే, ఈ రవితేజం రాత్రిళ్లు సైతం తేజోవంతమై వెలుగునందిస్తున్నాడు. తెల్లవారింది ... సూర్యకాంతులతో తడి స్నానాలు చేస్తోందీ లోకం. ప్రియ ప్రవక్త (స) వారు ప్రజల జీవితాలను జ్యోతిర్మయం చేసేందుకు, వారి అంతః చక్షువుల్ని తెరిపించేందుకు, వాస్తవ జగత్తులో, సత్యామృతంలో జలకాలాడించేందుకు, వారి పుట్టుకకు పరమార్థాన్నిచ్చేందుకు, వారి బ్రతుకు బాట సరి చేసేందుకు, వారి ఉనికికి లక్ష్యాన్ని బోధించేందుకు, వారి జీవితాల్ని పునీతం చేసేందుకు, వారి జన్మను ధన్యం గావించేందుకు బయలు దేరారు- మనిషి జీవితానికి అర్థాన్నిచ్చే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స).

సత్యవంతుల సత్యార్తిని తీర్చే జీవజలం దివ్య ఖుర్ఆన్. మనిషికి స్వర్గ సౌఖ్యాలను, కోరిన వరాలను అనుగ్రహించే శాంతి మార్గం ఇస్లాం. చీకటి అనే జగత్తులో విరిసిన క్రాంతి మొగ్గ, శాంతి ప్రభాకరుడు ప్రియప్రవక్త. అందానికే అందమైన ఆయనకు అలంకారాలు దేనికన్నట్లు దేదీప్యమానంగా వెలిగిపోతోంది ఆయన వదనం. ఆ దృశ్యం ఎంత మధురం! ఎంత ముగ్ధ మనోహరం!! ఆయనే ధర్మజ్యోతి అయితే చీకట్లు పటాపంచలు కావా, శాంతి సామరస్యాలను తేవా? ప్రేమపూరితమైన ఆయన పలుకులు మధురానుభూతులలో మైమరపించే దివ్యవాణులు. మరపురాని, మరచిపోలేని మహితోక్తులు, రండీ! విని తరించండి!! ❁

## మనోవాంఛల దాస్యం మంచిది కాదు

(31వ పేజీ తరువాయి)

లకు కూడా షైతాన్ రాడు. మీ మనోమస్తిష్కాలను మాలిన్యం నుండి పరిశుద్ధపర్చుకోండి. దైవ నామస్మరణతో మీ మృత హృదయాలలో జీవం పోయండి. ఖుర్ఆన్ లేని హృదయం ఖనన వాటిక లాంటిది. అలాంటి హృదయంతో మీరు జీవించకండి. మీ ఖుర్ఆన్ పారాయణం ఎంత బాగా ఉంటుందో మీ మనో క్షేత్రం కూడా అంతే దేదీప్యమానంగా వెలుగుల్ని విరజిమ్ముతూ ఉంటుంది. మీ హృదయంలో దాగి ఉన్న ప్రతి నిగూఢ రహస్యం ఆ నిజ దేవుడికి తెలుసని గ్రహించండి.

మనిషి మత్తు వీడి, నిద్ర మేల్కొని, ఆత్మ విమర్శ చేసుకున్నప్పుడు, సహజంగా పశ్చాత్తాపపడతాడు. నిజాన్ని తెలుసుకోగలుగుతాడు. "పగటిపూట పాపం చేసిన వాడు రాత్రికైనా పశ్చాత్తాపం చెందుతా డని అల్లాహ్ తన చేయిని చాపుతాడు. అలాగే రాత్రివేళ పాపం చేసినవాడు పగలు పశ్చాత్తాపం చెందుతాడని అల్లాహ్ తన చేయిని చాపి ఉంచుతాడు. ఈ పరంపర సూర్యుడు పడమటి దిక్కు నుండి ఉదయించేంత వరకూ కొనసాగుతూనే ఉంటుంది" అని మీకు తెలియజేస్తున్నాను. ఎడారి ప్రయాణం కొనసాగించే వ్యక్తి ఆహార సామగ్రి, నీరు ఉన్న తప్పిపోయిన ఒంటె ఒక్క సారిగా దొరికితే ఎంత ఆనందపడతాడో, దానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ తన దాసుని పశ్చాత్తాపంపై అల్లాహ్ సంతోషిస్తాడు అన్న విషయం మీరు గ్రహిస్తే ఎంత బాగుండు.

మనిషి కోర్కెలకు హద్దు లేదు. మనిషి దగ్గర ఓ లోయ నిండా బంగారమున్నా, అతను దాంతో సంతృప్తి చెందక రెండో దాని కోసం అర్రులు చాస్తాడు. చివరికి (కాటి) మట్టి మాత్రమే అతని నోటిని నింపగలదు. ఇకపోతే తన పాపాల నుండి మరలిపోయే వాని వైపునకు అల్లాహ్ కూడా మరలుతాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. కాబట్టి మనో దాస్యాన్ని మానుకోండి. విద్యా విజ్ఞా నాలు ఉండి కూడా తుచ్ఛ మనోవాంఛలకు దాసుడయ్యేవాడి ఉదాహరణ కుక్క వంటిది. మీరు దానిపై దాడి చేస్తే అప్పుడు కూడా అది తన నాలుకను వెళ్ళబెట్టుతుంది. దాన్ని అలానే వదిలేసినా చొంగ కారుస్తూనే ఉంటుంది. మనస్సును శుద్ధ పర్చు కున్నవాడే సిసలైన సఫలీకృతుడన్న సంగతి మరువకండి. ❁

# గెట్ టుగెదర్

ఖుర్షీద్ బేగం

**రఫీ ఫోన్ రింగవుతోంది. రాత్రి 11 గంటలు. బద్ధకంగా ఫోన్ లిఫ్ట్ చేశాడు. అవతల రజాక్ గొంతు. ఏరా రేపు మన గెట్ టుగెదర్ ప్రోగ్రాం ఉంది వస్తున్నావు గా? అడిగాడు రఫీని. ఇన్షాఅల్లాహ్ చెప్పాడు రఫీ. తప్పకుండా రావాలి. దాదాపు 20 సంవత్సరాల తర్వాత కలుస్తున్నాం ఫ్రెండ్స్ అంతా. నువ్వు రాకపోతే ఎలా? నచ్చజెప్పబోయాడు రజాక్‌ను. వస్తానులే అని ఫోన్ పెట్టేశాడు రఫీ.**



ఫోన్ పెట్టేసినా వెంటనే నిద్ర పట్టలేదు రఫీకి. తన ఆలోచనలు అప్రయత్నంగా ఇరవై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి పోయాయి.

అది కర్నూల్‌లో ఒక డిగ్రీ కాలేజీ. ఆ కాలేజీ చాలా ఫేమస్. ఎక్కడెక్కడి నుండో విద్యార్థులు అక్కడికి వచ్చి చదువుకుంటూ ఉంటారు. కేవలం బాయ్స్ మాత్రమే. కో-ఎడ్యుకేషన్ లేదు. విశాలమైన ప్రాంగణం, పెద్ద ఆట స్థలం, అన్ని సౌకర్యాలతో అహ్లాద కరంగా ఉంటుంది కాలేజీ వాతా వరణం. హాస్టల్, కాలేజీ అంతా క్యాంపస్‌లో ఉంటాయి.

రఫీ కొత్తగా ఆ కాలేజీలో చేరాడు డిగ్రీ ఫస్టియర్‌లో. కొత్తకొత్తగా, భయం, బెరుకుతో క్లాసుకు అటెండ్ అయ్యాడు. అంతా ప్రెషర్స్. పరిచయాలు అవు తున్నాయి క్లాస్‌లో. రఫీ చలాకీ అబ్బాయి. చూడటానికి కూడా ఎంతో అందగాడు. స్వత హాగా కలుపుగోలుతనం ఉన్న రఫీ చాలా తొందరగానే క్లాస్‌లో, హాస్టల్‌లో అందరితో కలిసిపోయాడు. రఫీకి తన క్లాస్‌లోని మోహన్, బాలాజీ, రజాక్, అబ్రహం... ఇలా ఎంతోమంది ఫ్రెండ్స్ అయ్యారు. ఫస్టియర్‌లో సీనియర్లు కొంచెం ర్యాగింగ్ చేసేవారు. అయినా ఆ ర్యాగింగ్ కూడా ఎంతో సరదాగానే ఉండేది.

ఒక నెల తర్వాత కాలేజీలో మధు అనే విద్యార్థి చేరాడు. ఎంతో చలాకీ. రఫీ లాగే మంచి క్రికెట్ ప్లేయర్. అందరితో ఫ్రెండ్లీగా ఉండే రఫీ మధును కూడా ఫ్రెండ్‌లాగే భావించేవాడు. అయితే రఫీ అతి మంచితనం, మృదుత్వం, స్నేహ స్వభావం వల్ల కాలేజీలో అందరు రఫీని బాగా అభిమానించేవారు. మధు రఫీతో ఎంతో కొంత స్నేహంగా ఉన్నా ఎక్కడో ఒక మూల ఒకింత ఈర్ష్య ఉండేది రఫీ పట్ల. రఫీ చదువుల్లో టాపర్. మధ్యతరగతి కుటుంబం కాబట్టి ఆర్థిక బాధలు తెలుసు. అందుకే చదువును

నిర్లక్ష్యం చెయ్యకుండా చదివేవాడు. జీవితంలో ఎన్నో ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలి అని అనుకునేవాడు. సివిల్స్ సాధించాలనేది అతని కల. మధు ఒక సంపన్న కుటుంబంలో పుట్టాడు. కాబట్టి బాధ్యత తెలీదు. బైక్‌లు, కావాల్సినంత డబ్బు, ఫ్రెండ్స్‌కు పార్టీలు... ఇలా స్టూడెంట్ లైఫ్ బాగా ఎంజాయ్ చేసేవాడు. అయితే క్రికెట్ అంటే పిచ్చి. మంచి క్రికెటర్ అవ్వాలని కలలు కనేవాడు.

తన దగ్గర డబ్బున్నా, తను మంచి క్రికెట్ ప్లేయర్ అయినా తన అహంకారం వల్ల ఫ్రెండ్స్ మధును అంతగా ఇష్టపడేవారు కాదు. కాలేజీలో, హాస్టల్‌లో అందరూ తన మాటే వినాలని పంతం ఉండేది మధులో. రఫీ మధులో ఒక మంచి స్నేహితుణ్ణి మాత్రమే చూసేవాడు. అతనితో ఎంతో మంచిగా ఉండటానికి ప్రయత్నించేవాడు.

డిగ్రీ ఫస్టియర్ ముగిసింది. పరీక్షలు అయిపోయాయి. రఫీ ఫస్టియర్‌లో కాలేజీ టాపర్‌గా నిలిచాడు. కాలేజీ వార్షికోత్సవ ఫంక్షన్‌లో బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రఫీకి వచ్చింది. రఫీ కాలేజీలో ఒక రోల్‌మోడల్ అయిపోయాడు. లెక్చరర్స్, ప్రిన్సిపాల్, తోటి విద్యార్థులు అంతా రఫీని ఎంతో అభిమానించేవారు. రఫీకి బెస్ట్ స్టూడెంట్ అవార్డు రావడం, అందరూ రఫీని అభిమానించడం మధులో ఈర్ష్యకు కారణం అయింది. ఈర్ష్య మనిషిలో విచక్షణను చంపేస్తుంది. అకారణంగా తోటివారిని ద్వేషించేలా చేస్తుంది. ఒకరి కీర్తి, సామర్థ్యం, వాళ్ళ టాలెంట్ జీర్ణించుకోలేని వారు ఎదుటివారికి ఏ కారణం లేకుండానే ద్వేషించడం మొదలుపెడతారు. రఫీ విషయంలో మధు అలానే ఆలోచించేవాడు. మధులో కనిపించే అసూయా ద్వేషాలు రఫీ గమనించేవాడు. అయినా ఏనాడూ పట్టించుకోలేదు. ఫ్రెండ్‌షిప్‌లో ఇవన్నీ సహజం అని భావించేవాడు. మధుతో ఎప్పటిలాగే ఫ్రెండ్లీగా ఉండటానికి ప్రయత్నించేవాడు.

డిగ్రీ ఫైనల్ ఇయర్‌లోకి వచ్చేశారు అందరూ. ఎప్పటిలాగే ఫైనలియర్‌లో కూడా బెస్ట్ స్టూడెంట్ అవార్డు రఫీనే వరించింది. మధులో ఈర్ష్య మరింత పెరిగిపోయింది. రఫీ ఎందుకో తనకు కంటిలో నలకలాగా, పంటి కింద రాయిలాగా తగలడం ప్రారంభించాడు. స్నేహధర్మం మర్చిపోయాడు. తనను ఎలాగైనా అందరిలో అవమానించాలని నిర్ణయించుకున్నాడు. అక్కడికి కొంతమంది ఫ్రెండ్స్ మధును హెచ్చరించారు. అయినా మధు ఎవరి మాట వినే పరిస్థితిలో లేడు. ఏదో ఒకటి చేయాలి? కాలేజీ ముగిసేలోపు రఫీ మర్యాదను మంటకలపాలి అనే నిర్ణయానికి వచ్చాడు.

కాలేజీలో మధు ప్రవర్తన నచ్చక కొందరు అతనికి దూరంగా ఉండేవారు. మధు వర్గం, రఫీ వర్గం ఇలా రెండు గ్రూపులుగా విద్యార్థులు అయిపోయారు. ఆ రోజు కాలేజీ సెండ్ ఆఫ్ పార్టీ..

అందరూ ఒకింత బాధ, మరికొంత ఆనందంతో ఫంక్షన్‌లో ఉన్నారు. ఎలాగైనా రఫీతో గొడవ పెట్టుకోవాలని అనుకున్నాడు మధు. ఏదో ఒక వంకతో రఫీని రెచ్చగొట్టేలా మాట్లాడటం, అతన్ని అవమానపరిచేలా ప్రవర్తించడం చేశాడు. రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి పెద్ద గొడవయింది. గొడవ హద్దులు దాటి మాటల నుంచి చేతల్లోకి మారిపోయింది. రఫీ ఎంత వద్దని వారించినా వినే పరిస్థితిలో ఎవరూ లేరు. చిన్న మాట గొడవకు దారి తీసింది. ఒక్కసారిగా వాతావరణం అంతా మారిపోయింది. రెండు గ్రూపుల మధ్య పెద్ద గొడవ. పరిస్థితి చేయిదాటిపోయింది. అందుకే పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మధు ఇదే మంచి అవకాశంగా భావించి తన మీద రఫీ దాడి చేయించాడని, తనని చంపాలని ప్రయత్నం చేశాడని, హత్యాయత్నం కింద కేసు ఫైల్ చేశాడు. తనకు ఉన్న ధనబలంతో రాజకీయ నాయకులకు చెప్పించి రఫీ మీద కేసు బలంగా పెట్టించాడు. రఫీ మీద ఎఫ్ఐఆర్ ఫైల్ అయింది. అతని జీవితం జైలు పాలయింది. అతని కలలు అన్నీ కూలిపోయాయి. తన ఐఏఎస్ లక్ష్యం మట్టిపాలయింది. చేయని తప్పుకు రఫీ శిక్షను అనుభవించాల్సి వచ్చింది. రఫీ టైమ్ చూశాడు. రాత్రి 2 గంటలయింది. 20 సంవత్సరాల గతం నుంచి ఒక్కసారిగా బయటికి వచ్చాడు. గుండె భారం అయింది. అయినా ఎవరి మీద కోపం లేదు. ద్వేషం అంతకన్నా లేదు. ఎందుకంటే తన గురించి తనకు తెలుసు. ఆ అల్లాహ్‌కు తెలుసు. తను ఏ తప్పూ చేయలేదు అనేది నిజం.

ఆ గొడవల తర్వాత కొన్ని రోజులకు రఫీ మీద పెట్టిన కేసును కొట్టివేశారు ఏ తప్పు చేయలేదని. కానీ ఆ కేసు వల్ల తన భవిష్యత్తు నాశనం అయింది. కానీ ఆ దైవం తనను నమ్మిన దాసులను ఏనాడూ విడిచిపెట్టడు. వారి స్థానాలను మరింత ఉన్నతం చేస్తాడు. వారు ఊహించని మార్గాల ద్వారా వారికి ఉపాధిని కల్పిస్తాడు. రఫీ విషయంలో అదే జరిగింది. చిన్న వ్యాపారం మొదలుపెట్టాడు. అల్లాహ్ అందులోనే అతనికి శుభాన్ని ప్రసాదించాడు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందింది. రఫీ చాలా తక్కువ కాలంలోనే మంచి వ్యాపారవేత్తగా పేరు ప్రఖ్యా తులు సంపాదించాడు. అతని వ్యాపారం బాగా విస్తరించింది. రఫీ కోటీశ్వరుడు అయ్యాడు. అయినా అతనిలో

ఏమాత్రం అహంకారం లేదు. అదే మంచితనం, అదే మృదుస్వభావం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే సుగుణం అతని సొంతం. అదే రఫీ విజయానికి కారణం.

తెల్లారింది. రఫీ ఫజ్ర్ నమాజు తర్వాత త్వరగా తయారయ్యి హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు కారులో బయలుదేరాడు. ఇరవై సంవత్సరాల తర్వాత ఫ్రెండ్స్ అందర్నీ కలుస్తామన్న ఆనందం రఫీ ముఖంలో కనిపిస్తుంది.

10 గంటలకు ప్రోగ్రాం స్టార్ట్ అవుతుంది. ఒక్కొక్కరూ కాలేజీకు చేరుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఈ కాలేజీ కళకళలాడుతోంది. ఎన్నో సంవత్సరాల తర్వాత తమ ప్రియ నేస్తాలను కలవాలని అందరూ ఎంతో ఆతృతతో ఉన్నారు. అందరూ నలభైలో పడ్డారు. కొందరు గుర్తుపట్టలేనంతగా మారి పోయారు. లెక్చరర్లు అందరూ పెద్దవారైపోయారు. రఫీ కూడా కాలేజీకి చేరుకున్నాడు. తన ఫ్రెండ్స్ మోహన్, అబ్రహాం, రజాక్ అందరూ రఫీ కోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

రఫీను చూసిన తర్వాత వాళ్ళందరి ముఖాలలో ఆనందం. ఎన్నో సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితుల కళ్ళల్లో కన్నీటి పొర. ఆనందం, దుఃఖం కలిగిన క్షణాలు అవి. ఒకర్ని ఒకరు గుండెలకు హత్తుకున్నారు. యోగక్షేమాల తర్వాత ఎవరెవరు ఎలా సెటిల్ అయ్యారో తెలుసుకుంటూ ఉన్నారు. రఫీ కళ్ళు మాత్రం మధు కోసం వెతుకుతున్నాయి. అతను ఎక్కడా కనిపించలేదు. మధు రాలేదా అని మోహన్‌ని అడిగాడు. మోహన్ రఫీ వంక కోపంగా చూశాడు. ఎందుకురా ఇంకా వాణ్ణి తలచుకుంటావు? సిగ్గు లేదా. నీ జీవితాన్ని నాశనం చేశాడు. ఇంకా వాడు నీకు ఫ్రెండ్ ఏంటిరా? చెప్పాడు మోహన్. రఫీ మోహన్‌ను, తప్పురా ఎంతైనా వాడు మన ఫ్రెండ్. తెలియక, ఆలోచించక వాడు తప్పు చేశాడు. ఆ వయసు అలాంటిది. ఆవేశమే కాని ఆలోచన ఉండదు. అంతమాత్రాన స్నేహితుణ్ణి కాదంటామా? చెప్పాడు రఫీ. అయినా నా జీవితం ఏమీ నాశనం కాలేదురా. నేను చాలా గొప్పగా బ్రతుకుతున్నాను ఆ అల్లాహ్ దయ వల్ల. మోహన్ భుజం తట్టాడు రఫీ.

దాదాపు ఫ్రెండ్స్ అందరూ వచ్చారు. ఒక్క మధు మాత్రం రాలేదు. పాపం వాడు ఎందుకు రాలేదో అని రఫీ మనసులో బాధపడుతూనే ఉన్నాడు. మధు ఫ్రెండ్ అనిల్‌ను అడిగాడు. అనిల్ ఏమీ మాట్లాడకుండా తలదించుకున్నాడు. చెప్పరా ఏమైంది? మధు గెట్ టుగెదర్ ఫంక్షన్‌కు ఎందుకు రాలేదు అని అడిగాడు. మధు ఇక్కడే కర్నూలులోనే ఉంటున్నాడురా చెప్పాడు అనిల్. అవునా? మరి ఇక్కడే ఉండి ఎందుకు రాలేదు? మళ్ళీ అడిగాడు రఫీ.

అది... అది... ఏమి చెప్పాలో అర్థంకాక తలదించుకున్నాడు అనిల్. చెప్పరా ఏమైంది... నిలదీశాడు రఫీ.

చేసిన పాపం ఊరికే పోదు కదరా. నీ మీద అన్యాయంగా కేసు పెట్టి నిన్ను జైల్లో పెట్టించాడు. నీ భవిష్యత్తు నాశనం చేశాడు. దానికి వాడికి ఆ దేవుడు తగిన శాస్తి చేశాడు. క్రికెట్ టోర్నమెంట్‌కు వెళుతున్నప్పుడు కారు యాక్సిడెంట్ అయింది. వెన్నుముకకు గాయం అయి మంచానికే పరిమితం అయ్యాడు. ఒక్కగానొక్క కొడుకు అలా అయిపోయాడని వాళ్ళ అమ్మానాన్న దిగులు పెట్టుకుని నాన్న చనిపోయాడు. ఆస్తులన్నీ కరిగిపోయాయి. వాళ్ళ అమ్మగారు పాపం మధును చూసుకుని ఉంటున్నారు. మంచి వైద్యం చేయిస్తే వాడి పరిస్థితి బాగు పడుతుందట. కానీ అంత డబ్బు వాడి దగ్గర లేదు.. అని కళ్ళు తుడుచుకున్నాడు అనిల్.

రఫీ గుండె బాధతో బరువెక్కింది. పద ముందు మధు ఇంటికి వెళ్దాం అని కారు తీశాడు. రఫీ మధు ఇంటికి వెళ్ళాడు. మంచం మీద జీవచ్ఛవంలా పడి ఉన్న మధును చూస్తే కళ్ళల్లో నీళ్లు తిరిగాయి రఫీకి. మధు కూడా రఫీని గుర్తుపట్టాడు. బాధతో, పశ్చాత్తాపంతో మధు గుండె పగిలేలా ఏడవసాగాడు. తన స్నేహితుడి చెయ్యి పట్టుకుని క్షమించమని కోరాడు. రఫీ మనలో మనకు క్షమాపణలు ఏంటిరా? అని రఫీ మధును ఓదార్చాడు. అతని పరిస్థితి చూసి చలించిపోయాడు. ఫ్రెండ్‌కు ధైర్యం చెప్పాడు. నేనున్నానని భరోసా ఇచ్చాడు. నీకు వైద్యం నా డబ్బులతో చేయిస్తాను అని చెప్పాడు. మధు రఫీ మంచితనానికి ఇంకా కుమిలిపోయాడు.

రఫీ తీసుకున్న నిర్ణయానికి మోహన్ ఆశ్చర్యపోయాడు. నీకేమైనా పిచ్చిపట్టిందా? అని అర్థం కానట్టు చూశాడు మోహన్. నేను ఒక నిజమైన ముస్లింని ప్రవక్త ముహమ్మద్(స) అనుచరుణ్ణి. ఆయనే నా రోల్‌మోడల్. నిన్ను ద్వేషించేవారిని ప్రేమించు. నీకు అపకారం తలపెట్టిన వారికి మాత్రం ఉపకారం చేయి. నీ నుంచి దూరం పోయినా నువ్వు వారికి దగ్గర అవ్వు. ద్వేషాన్ని ప్రేమతో జయించు అనే ప్రవక్త(స) బోధనల్ని నమ్మేవాణ్ని. ఆయన బాటే నాకు ఆదర్శం అని చెప్పి చిన్నగా నవ్వి మధు వైద్యానికి కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోయాడు రఫీ. ❀



# ఆయన(స) జీవితపు కోణాలన్నీ ఆదర్శప్రాయమే!

**తస్నీమ్‌జహాన్ ఖాన్**

**అనాథగా** జన్మించిన ఆమినా, అబ్దుల్లాహ్ దంపతుల పుత్రరత్నం అసాధారణమైన కీర్తిని సొంతం చేసుకున్నారు. నేటికీ కోట్ల ప్రజల గుండె చప్పుడు ఆయన(స). తరతరాలుగా, యుగ యుగాలుగా హృదయాల విజేతగా నిలిచిన ఏకైక వ్యక్తి ఆయన (స). ఆయన బోధనలు, ఆయన నడవడిక, ఆయన వ్యక్తిత్వం, ఆయన ప్రేమ, ఆయన గడిపిన ప్రతీ క్షణం ప్రజలకు గుణపాఠాలే... ఆచరణ యోగ్యమైన హితబోధలు ఆయనవి. అజ్ఞానం, మూఢత్వ బానిస బంధాలను త్రెంచి విజ్ఞానపు తేటతెల్లని కాంతి పుంజాలను చూపి స్వేచ్ఛను ప్రసాదించిన మహానుభావుడు ఆయన(స).

బీద-ధనిక, స్వేచ్ఛా-బానిస, అరబ్బు- అరబ్బేతరుడు, అల్ప-అధిక కులమనే తారతమ్యాలను శాశ్వతంగా చెరిపివేసి మానవ సమానత్వాన్ని స్థాపించిన మహా మనీషి ఆయన(స). సమస్త చెడుగులకు వ్యతిరేకి ఆయన(స). సమస్త సత్కార్యాలకు మద్దతుదారుడు ఆయన(స). మంచి కార్యాలు చేస్తూ, ప్రజలను మంచి వైపునకు ఆహ్వానించమని, చెడు కార్యాలకు దూరంగా ఉంటూ చెడు కార్యాల నుండి ప్రజలను ఆపాలని ప్రబోధించారు ఆయన(స).

ప్రతీ ఒక్కరూ దైవప్రవక్త ముహమ్మద్(స) జీవిత చరిత్రను ఖచ్చితంగా అధ్యయనం చెయ్యాలి. ఎందుకంటే, ఈ పుడమిపై ఆయన(స) వంటి ప్రభావవంతమైన సంస్కర్త, ఆదర్శవంతుడు గత 1450 సంవత్సరాల్లో పుట్టనే లేదు. ప్రళయం వరకూ పుట్టరు కూడాను. ఆయన (స) జీవితం ముస్లింలకే కాదు, ప్రపంచ మానవులందరికీ మార్గదర్శకం. ఆయన(స) అడుగుజాడల్లో నడవడం వల్ల ఇహపరాల గౌరవాన్ని, విజయాన్ని సొంతం చేసుకోవచ్చు. ఇది చరిత్ర ఇస్తున్న సాక్ష్యం. దీన్ని ఏ ఒక్కరూ విస్మరించే వీలులేదు. దైవప్రవక్త(స) సహచరులు, మన పూర్వీకులు ఇప్పటికీ కీర్తించబడుతూనే ఉండటం మనం చూస్తూనే ఉన్నాము కదా..

ఒక చిన్న బాలుడు ఏడుస్తున్న షార్ట్ వీడియో ఒకటి బాగా వైరల్ అయ్యింది. ఆ పిల్లవాడు దైవప్రవక్త(స) పరమపదించారు అనే విషయం తెలుసుకుని కన్నీరు మున్నీరయ్యాడు. దైవప్రవక్త(స) జీవిత చరిత్ర అధ్యయనం చేస్తున్న కొద్దీ ఆయన(స)పై ప్రేమ, వాత్సల్యం అమాంతం పెరిగిపోయి ఒక రకమైన ఎమోషనల్ బంధం ఏర్పడిపోయింది. ఆయన(స) జీవిత చరిత్ర ముగింపు దశకు చేరుకున్నప్పుడు బాధాతప్త హృదయంతో కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఇది ప్రతి విశ్వాసి జీవిత అనుభవమే. ఒక్కొక్కసారి

ఆయన(స) భౌతికంగా, ప్రత్యక్షంగా మన కళ్ళ ముందు ఉంటే ఎంత బాగుండేది, ఆయన(స)ను కళ్ళతో చూసుకుని ఆనంద పడేవాళ్ళం కదా అని అన్పిస్తూ ఉంటుంది. ఆయన(స)ను కలలో తప్ప ఇక మనం చూడలేము, దైవప్రవక్త(స)ను కలలో చూసిన వారు అదృష్టవంతులు.

ఒక్కొక్కసారి ఆయన (స) ఫొటో అయినా ఉంటే బాగుండేది అన్పిస్తూ ఉంటుంది. కనీసం అలా అయినా ఆయన(స) ముఖార విందాన్ని దర్శించేవాళ్ళం అన్పిస్తుంది. దైవప్రవక్త(స) భార్యలైన ఉమ్మె సలమా(రజి), ఉమ్మె హబీబా(రజి) హబ్షా (ఇథియోపియా)కు వలస వెళ్ళిన సహాబాల్లోని వారు. దైవప్రవక్త(స) జీవిత చరమాంకంలో జబ్బుపడ్డారు. ఆ సమయంలో ఆ ఇద్దరు భార్యలు దైవప్రవక్త(స) ఫొటోను గీయించాలనే సలహా ఇస్తూ ఈ విధంగా అన్నారు : దీన్ని ఆయిషా(రజి) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) జబ్బు పడినప్పుడు, ఆయన (స) భార్యలో కొందరు ఇథియోపియాలో చూసిన ఒక చర్చి, దాని పేరు మారియా గురించి ప్రస్తావించారు. ఉమ్మె సలమా(రజి), ఉమ్మె హబీబా (రజి)లు ఇథియోపియాలో ఉన్నప్పుడు 'మారియా' పేరు గల చర్చిలో బొమ్మలు, చిత్రాలున్న విషయాన్ని దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : ''వారిలో ఎవరైనా ఒక మహనీయుడు చనిపోయిన తర్వాత వారు అతని సమాధిపై ప్రార్థనా మందిరం నిర్మిస్తారు. అందులో వారి బొమ్మలు (చిత్రాలు) వేస్తారు. వీరు ప్రళయదినాన దేవుని దృష్టిలో అతి నీచమైన సృష్టితాలుగా పరిగణించబడతారు'' (సహీహ్ బుఖారీ)

దైవప్రవక్త(స) తమ చిత్రాన్ని గీయించుకోవటానికి ఇష్టపడలేదు. ఎందుకంటే, ప్రేమాభిమానాల స్థాయి నుండి ప్రజలు ఆ చిత్రాన్ని ఆరాధనా స్థాయికి చేరుస్తారనే వాస్తవాన్ని ఆయన(స) ముందే గుర్తించారు. యూదులు, క్రైస్తవులకు ఏక దైవారాధన చెయ్యాలనే క్లారిటీ ఉన్నా కూడా దైవప్రవక్తలు, మత గురువుల చిత్రాలకు, విగ్రహాలకు ప్రార్థనా స్థాయిని ఇచ్చి తమ విశ్వాసాన్ని కొల్లగొడుతు కున్నారు. ముస్లిం సమాజం కూడా అలాంటి వలయంలో చిక్కు కుని విశ్వాసానికి తూట్లు పొడుచుకోకుండా దైవప్రవక్త(స) జాగ్రత్త పడ్డారు.

దైవప్రవక్త(స) నిజ జీవితపు హీరో. ఆయన(స) భర్తల్లోకెల్లా ఉత్తమమైన భర్త. భార్యలను గృహ హింసకు, అరాచకాలకు గురి చేయకుండా ప్రేమాభిమానాలతో చూసుకునేవారు. ఆయన(స) ఉత్తమమైన తండ్రి. తమ బిడ్డలకు ఉత్తమ నడవడికను నేర్పి ఆదర్శ వనితలుగా తీర్చిదిద్దారు. ఆయన(స) ఉత్తమమైన అల్లుడు. తమ మామ గార్లను ఎంతో గౌరవంతో చూసేవారు. వారి నుండి ఎలాంటి డబ్బు, దస్కం డిమాండ్ చేసేవారు కాదు. ఆయన(స) ఉత్తమమైన మామ గారు. అల్లుళ్ళను సొంత కొడుకుల్లా చూసుకునేవారు. ఆయన(స) ఒక ఉత్తమమైన పౌరుడు. ఎల్లప్పుడూ బీదలు, అనాథలు, వితంతువులు, బానిసలు, బాటసారులను ఆదుకునేవారు. వారి అవసరాలను తీర్చేందుకు తమ సకల సంపదనూ ధారపోసేవారు.

ఆయన(స) ఉత్తమమైన బిజినెస్ మ్యాగ్నెట్. నీతి నిజాయితీతో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారు. ఆయన(స) ఉత్తమమైన శ్రేయోభిలాషి. ప్రజల హితమే ఆయన(స)కు ప్రియమైనది. ఆయన(స) ప్రజలకు మంచి సలహాలను ఇచ్చేవారు. ప్రజలను చెడుల నుండి ఆపేవారు, మంచివైపునకు ఆహ్వానించేవారు.

ఆయన(స) ఉత్తమమైన ముస్లిం, మోమిన్. ఆయన(స) జీవితం దైవాదేశాలకు 100 శాతం కట్టుబడి ఉండేది. దైవ శాసనాలను ఆయన(స) వంద శాతం అమలుపరిచేవారు. దైవారాధనలో అలసత్వానికి తావే ఉండేది కాదు. ఖుర్ఆన్‌కు అనుగుణంగానే ఆయన(స) జీవితం గడిచేది. దైవమార్గంలో ఎన్నో కష్టాలను కడగండ్లను ఎదుర్కొని కూడా విశ్వాసంపై స్థిరంగా నిలబడ్డారు. ఫలితంగా అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమైన దైవదాసుల్లో స్థానాన్ని దక్కించుకున్నారు. దైవాభీష్టమే తమ అభీష్టంగా జీవించారు. దైవం ముందు జవాబు చెప్పాలనే జవాబుదారీ తనాన్ని కలిగి ఉండేవారు.

ఆయన(స) ఉత్తమమైన పాలకుడు. ప్రజా ప్రయోజనాలకే పెద్ద పీట వేసేవారు. న్యాయాన్ని స్థాపించారు. అన్యాయాన్ని అరి కట్టారు. నిష్పక్షపాతంగా వ్యవహరించేవారు. ప్రజా ధనాన్ని అక్రమంగా కాజేయడం గాని, దుర్వినియోగం చేయడం గాని, సొంత ప్రయోజనాలకై ఖర్చు పెట్టడం గాని ఎన్నడూ చెయ్యలేదు. మద్యం, జూదం, వ్యభిచారం, దొంగతనం లేని ఒక సత్సమాజం ఆయన(స) ద్వారా ఉనికిలోకి వచ్చింది. ప్రజా ధనంతో అద్భుతమైన కట్టడాల్లో, భోగవిలాసాల్లో జీవితాన్ని గడపలేదు. ఎల్లప్పుడూ సాదాసీదా జీవితాన్నే గడిపారు. హంగులు, ఆడంబరాలకు ఆమడ దూరాన ఉండేవారు. సాధారణ దుస్తులు ధరించేవారు. సాధారణ తిండి తినేవారు, సాధారణ ఇంట్లో నివసించేవారు. ఆయన(స) వద్ద ఎంత సిరిసంపద వచ్చినా దాన్ని ఇతరుల్లో పంచేవారు. ఆయన (స) పరమపదించేటప్పుడు ఆయన(స) వద్ద ఏ ఆస్తిపాస్తులు, సిరిసంపదలూ లేవు.

ఆయన(స) జీవితంలోని ప్రతీ కోణం అద్భుతమే. ఈ భూమిపై జన్మించిన అరుదైన 'మిస్టర్ పర్‌ఫెక్ట్' ఆయన(స). మానవ జాతి మొత్తం గర్వించదగ్గ వ్యక్తిత్వం ఆయన(స)ది. ఆయన(స) అడుగు జాడల్లో నడిస్తేనే మన జీవితం సార్థకం అవుతుంది. ❁

# సద్గుణ శోభితుడు

షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం

**మూఢత్వం,** మూర్ఖత్వంతో సకల చెడులకు ఆలవాలమై అజ్ఞాన అంధకారం రాజ్యమేలుతున్న మక్కా నగరంలో హజ్రత్ అబ్దుల్లాహ్ ఆమినా పుణ్య దంపతులకు క్రీస్తు శకం 571లో సంవత్సరం ఏప్రిల్ 20న జన్మించారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

అమ్మ కడుపులో ఉండగానే తండ్రిని, 5 సంవత్సరాల పసి ప్రాయంలో తల్లిని కోల్పోయి అనాథగా తన జీవన పయనం మొదలుపెట్టిన మహనీయుడు ఆయన.

తోటి యువత మద్యం, జూదం, వ్యభిచారం గాన బజానాల మైకంలో మునిగి తేలుతున్నా, తాను మాత్రం గంజాయి వనంలో తులసి మొక్కలా సత్యసంధుడు (సాదిక్), నిజాయితీ పరుడి (అమీన్)గా సకల సద్గుణ సంపన్నుడుగా పెరిగి పెద్దవాడు అయ్యాడు ఆయన.

ఇరువై అయిదు సంవత్సరాల నిండు యవ్వనంలో, నలభై సంవత్సరాల వితంతువు హజ్రత్ ఖదీజాను వివాహమాడి, వితంతు వివాహానికి ఆచరణాత్మక సంస్కరణకు ప్రాణం పోసిన ఆద్యుడు ఆయన.

నలభై సంవత్సరాల వయస్సు వరకు నిరాడంబరంగా నిజాయితీ పరుడిగా, నీతిమంతుడిగా, యావత్ అరేబియాలో ఒక విలక్షణ మైన వ్యక్తిగా జీవించారు.

తన నలభయ్యవ యేట సృష్టికర్త అయిన అల్లాహ్ ఆయనను తన సందేశహరుడిగా సమాజ సంస్కరణ కోసం ఎన్నుకున్నాడు.

హిరా కొండగుహలో **"ఇఖ్రా బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్ "** (చదువు సృష్టించిన నీ ప్రభువు పేరుతో) అన్న ఖురాన్ మొట్టమొదటి వాక్యం అవతరణతో ప్రారంభమై, ఇరువై మూడు సంవత్సరాల కాలంలో రాబోయే ప్రళయ కాలం వరకు చావు పుట్టుకల నడుమ మానవ జీవిత మర్మాన్ని వివరించి, సృష్టి రహస్యాన్ని శాస్త్రీయంగా వివరించి, మానవాళిని సంస్కరించి దైవభీతి ఆధారంగా సత్ సమాజ నిర్మాణం కోసం కావలసిన ఆదేశాల గ్రంథం ఖుర్ఆన్ ఆయనపై అవతరించింది.

మంచి, మానవత విలువ మరచి, కులం, మతం, జాతి, వర్గం, వర్ణం, ధనికులు,పేదలు అన్న విపక్షతో జీవిస్తున్న అరబ్బులను 23 సంవత్సరాల స్వల్ప కాలంలో మంచికి మానవతకు మారు పేరుగా విశ్వ విజేతలుగా తీర్చిదిద్దిన కృషీవలుడు ఆయన.

## సర్వ మానవ సౌభ్రాతృత్వం సమానత్వం

మానవులంతా ఒకే సృష్టికర్త అయిన అల్లాహ్ దాసులే. మానవు లందరూ ఒకే జంట ఆదాం హవ్వాల సంతానం. పరస్పరం సోదరులు. కుల, మతం, వర్గం, వర్ణం, ప్రాంతం జాతి రీత్యా ఎవరూ గొప్ప వారు కారు. ఎవరైతే నైతికంగా నిష్టాపరులో, దైవం పట్ల అత్యంత భయభక్తులు కలిగి ఉంటారో వారే గొప్పవారు అని చాటి చెప్పారు.

ఇదే విషయాన్ని ఖుర్ఆన్‌లో సృష్టి కర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుని జంట నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరి కంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసిన వాడూను". (49: 13)

ఈ సూత్రం ఆధారంగా విశ్వ మానవాళిని, నల్లవారు తెల్లవారు, ఉన్నత వంశానికి చెందిన వారు, అధమ శ్రేణికి చెందిన వారు అన్న బేధ భావం లేకుండా మానవాళిని ఒకే జాతిగా మలిచారు. అగ్రకులాల ఖురైషీ ధనవంతుల ముందు నీగ్రో జాతికి చెందిన బానిస హజ్రత్ బిలాల్‌ను పవిత్ర కాబా గృహం మీదకు ఎక్కించి అజాన్ పిలుపును ఇప్పించి సర్వమానవులు సృష్టి కర్త ముందు ఒక్కటే అని చాటి చెప్పిన ధీరోదాత్తుడు ఆయన.

అంతే కాదు సృష్టి కర్త ముందు ధనికులు పేదలు అన్న వివక్ష లేకుండా భుజానికి భుజం కలిపి ప్రతి రోజూ ఐదుసార్లు నమాజ్ చేసే విధానం ప్రవేశ పెట్టారు.

హజ్ ఆరాధన సమయంలో ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే దాసులు- వారు ఎలాంటి వారైనా, రాజైనా, బంటు అయినా, అందరూ ఒకే రకమైన వస్త్రాలు (తెల్లని దుప్పట్లు) ధరించి ఆరాధన చేసే విధానం ప్రవేశ పెట్టారు.

తద్వారా సర్వమానవులు ఒక్కటే, అల్లాహ్ ముందు ఒకరు గొప్ప మరొకరు తక్కువ అన్న నిమ్నోన్నతల విధానం లేనే లేదు అని క్రియాత్మకంగా నిరూపించారు.

ఈ మానవ సమానత్వపు ఆరాధన ఇస్లాంలో తప్ప మరే ఆరాధనలోనూ కానరాదు.

అందుకే సుప్రసిద్ధ భారతదేశ కవయిత్రి సరోజిని నాయుడు "ఇస్లాం ఆరాధనలో ప్రబోధించే ఏకత్వపు భావన చూసి నేను అనేక సార్లు ప్రభావితురాలి నయ్యాను" అని అన్నారు.

## జగతిన విజ్ఞానం కాంతులు వెదజల్లిన మహా జ్ఞాని

సృష్టికర్త ఒక్కడే, మానవులంతా ఒక్కటే, చావు పుట్టుకల నడుమ మానవ జీవిత మర్మాన్ని తెలుసుకోవాలి. అంటే జ్ఞానం ఎంతైనా అవసరం అని చాటి చెప్పి 1450 సంవత్సరాల క్రితమే విద్యాభి వృద్ధికి బీజం వేసారాయన.

"తల్లితండ్రులు తమ సంతానానికి ఇచ్చే అత్యున్నత బహుమానం మంచీ చెడుల విచక్షణా జ్ఞానం తెలిపే చక్కని చదువు సంస్కారాలే".

"జ్ఞాన సముపార్జన కోసం ఎంత దూరం పయనం చేయవలసి వచ్చినా, ఎన్ని బాధలు కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయరాద"న్నారు.

ఒక పురుషుని చదువు అతనొక్కడికే పరిమితం. స్త్రీ చదువు తరతరాల వరకు ఉపయోగపడుతుంది.

ఎందుకంటే తల్లి ఒడి మనందరికీ మొదటి బడి అని తెలిపి 15 శతాబ్దాల క్రితమే మహిళల చదువుకు పెద్ద పీట వేసిన మహాను భావుడు ఆయన.

## స్త్రీ జనోద్ధారకుడు ఆయన

ఆడపిల్ల పుట్టడమే అరిష్టంగా భావించి, ఆడపిల్ల పుట్టిందని తెలిస్తే సజీవంగా పాతిపెట్టేవారు ఆ కాలంలో.

ఇద్దరు లేదా ముగ్గురు అమ్మాయిలను లేదా చెల్లెళ్ళను పోషించి వారి కాళ్ళ మీద వారు నిలబడేలా చేస్తే అల్లాహ్ వారికి స్వర్గాన్ని ప్రసాదిస్తాడు అని తెలిపి శిశు హత్యలకు ఆనాడే అడ్డుకట్ట వేశారు.

ఇరవై అయిదు సంవత్సరాల నిండు యవ్వనంలో, నలభై సంవత్సరాల వితంతువు హజ్రత్ ఖదీజా (రఅ)ను వివాహం చేసుకుని, వితంతువు వివాహాలను ప్రోత్సహించిన సంస్కర్త.

1450 సంవత్సరాల క్రితమే ఆడపిల్లకు తల్లితండ్రుల ఆస్తిలో వాటా పొందే హక్కును కల్పించే ఆదేశం ఇవ్వడం జరిగింది.

ఇది జరిగిన పన్నెండు వందల సంవత్సరాల తరువాత, 1881వ సంవత్సరంలో ఇంగ్లాండులో ఆ చట్టం చేయడం జరిగింది.

స్త్రీ పురుషులలో పుట్టుక రీత్యా ఇరువురు సమానులే. కాకపోతే శారీరక మానసిక స్థితిని బట్టి వారి వారి పరిధిలో పని చేసే ఆదేశం ఇవ్వడం జరిగింది.

## మానవ సంక్షేమ పథకాలు

నేటి ఆసరా, పింఛను, అంగన్వాడీ లాంటి అనేక పథకాలు ఆ కాలంలోనే రూపుదిద్దుకున్న సంక్షేమ పథకాలు.

అనాథల, వితంతువుల, అగత్యపరుల సేవలో నిమగ్నమై ఉన్న వారు రాత్రంతా ఆరాధనలో నిమగ్నమైన వారితో, పగలంతా ఉపవాసం పాటించేవారితో దైవం మార్గంలో ప్రాణాలు అర్పించిన వారితో సమానం అని తెలిపి సాటి మానవుల అవసరాలు తీర్చేలా ప్రోత్సహించారు.

"పొరుగు వారు పస్తులుండగా కడుపునిండా తిని నిదురపోయే వారు విశ్వాసులే కారు" అన్నారు.

"నేల మీద ఉన్న వారిని కరుణించండి నింగినున్న వాడు

మిమ్మల్ని కరుణిస్తాడు'' అని ఉపదేశించారు.

ఏ ఇంటిలోనైతే అనాథలకు ఆశ్రయం కల్పించబడుతుందో, తమ పిల్లల్లా వారు పోషించబడతారో ఆ ఇల్లు అన్ని ఇండ్ల కన్నా ఉత్తమ ఇల్లు. వారిపై దైవ కారుణ్యం కురుస్తుంది అని తెలిపి అనాథల పోషణలో పోటి పడేలా చేసారు.

ఇలా అనేక బోధనలతో దైవభక్తి, ఆరాధన అంటే కేవలం పూజా పురస్కారాలే కాదు, సాటి మానవుల అవసరాలు తీర్చడమే అని ప్రబోధించారు ఆ మహనీయుడు.

## ఆర్థిక సమానత్వం

మిగులు ధనంలో జకాత్ చెల్లించి సమాజ సంక్షేమ పనులకు ఉపయోగపడేలా చేశారు.

వెండి, బంగారం, మిగులు పైకంపై ప్రతి ఒక్కరూ 2.5 శాతం విధిగా జకాత్ ఇవ్వాలి.

"అల్లాహ్ మార్గంలో అంటే సాటి మానవుల అవసరాలు తీర్చ డానికి ఖర్చు చేస్తే అల్లాహ్ దానికి ఏడు వందల రెట్లు అధికంగా ఇస్తాడు''.

ఇలా ధనం ఒకే చోట పోగు కాకుండా, సమాజంలో ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చడానికి ఖర్చు చేసేలా చేశారు.

## శాంతి, సహనం, క్షమాగుణం

మానవులందరూ ఒకే సృష్టి కర్త అయిన అల్లాహ్ దాసులు.

"యావత్ మానవులు అల్లాహ్ వసుదైక కుటుంబం. ఎవరైనా అల్లాహ్ దాసులకు కష్టం నష్టం కలిగిస్తే అల్లాహ్‌కు కష్టం కలిగించినట్లే''.

పంట పొలాలను నాశనం చేయడం, చెట్లను నరకడం, కాల్చి వేయడం కూడా మహా పాపమని, దీనికి గాను మరణానంతరం పరలోకంలో జవాబు చెప్పుకోవాల్సి వస్తుందని సహచరులను హెచ్చరించారు.

మక్కానగరంలో తన సహచరులకు చిత్రహింసలు చేసిన వారిని, తనను సైతం ప్రాణాలు తీయడానికి వెనుకాడని వారిని, తనను కన్న తండ్రిలా పెంచి పోషించిన పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ను చంపి కాలేయాన్ని కసకసా నమిలిన హిందాను ఇంకా ఎందరినో, మక్కా విజయం తరువాత క్షమించి వదిలి వేసిన క్షమాశీలుడు, శాంతి కాముకుడు ఆయన.

## న్యాయ ధ్వజవాహకుడు

న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అది మీకు మీ కుటుంబానికి ఎంతగా నష్టం కలిగించినాసరే అన్న దైవాదేశాన్ని తన అనుచరులు తు. చ తప్పకుండా పాటించేలా తర్ఫీదు ఇచ్చారు.

ఖురైషుల్లోని మఖ్‌జూమ్ తెగకు చెందిన ఒక మహిళ దొంగతనం చేసినట్లు రుజువైంది. ఆమె కోసం తన ప్రియ సహచరుడు సిఫార్సు చేయగా, ఆయన ముఖం ఆగ్రహంతో కందిపోయింది. "ఈ పక్షపాతం కారణంగానే ఇస్రాయీల్ సంతతి వారు నాశనమయ్యారు. వారు కులీనులు తప్పు చేస్తే వదిలిపెట్టి బలహీనులను శిక్షించేవారు. అల్లాహ్ సాక్షిగా! ముహమ్మద్ కూతురు ఫాతిమా దొంగతనం చేసినా నేను ఆమె చేతిని నరికి ఉండేవాణ్ణి'' అని ప్రకటించారు.

"నిత్యావసర వస్తువులను నిల్వ చేసి ధరలు పెరిగేలా చేయడం మహా పాపం'' అని హెచ్చరించారు.

శ్రమజీవులకు బాసటగా నిలిచిన కార్మిక నేత.

"కూలి వాడి చెమట ఆరక ముందే అతని కూలిని చెల్లించి వేయండి'' అని తాకీదు చేశారు.

ముగ్గురి పని ఇద్దరితో చేయించకండి. అంటే ఒకరిపై ఎంత పని భారం మోపాలో అంతే మోపాలి.

భోజనం చేసేటప్పుడు మీతో పాటు మీ వంటవాడిని కూడా కూర్చోబెట్టుకోండి. అతను వేడిని భరించి మరీ వంట చేస్తాడు కదా.

ఇలా పదిహేను వందల సంవత్సరాల క్రితమే శ్రామిక సంక్షేమ చట్టాలు చేసిన నేత ఆయన.

ఆయన ప్రళయం వరకు రాబోయే మానవాళికి సరిఅయిన జీవన విధానాన్ని ఆచరణాత్మకంగా జీవించి, అమలు చేసి ఒక ఉత్తమ ఆదర్శం నెలకొల్పారు.

దైవభీతి ఆధారంగా సమాజంలోని సకల రంగాలను సంస్కరించిన సంస్కర్త ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

సకల సిరిసంపదలతో తులతూగుతున్న సువిశాల సామ్రాజ్యానికి చక్రవర్తి, ఆయన తలచుకుంటే సుఖబోగాలు అష్టైశ్వర్యాలు కాళ్ళ వద్దకు వచ్చిపడేవి.

కానీ ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్ళేటప్పుడు వంటిమీద అతుకుల బట్టలు, ఇంట్లో దీపం వెలిగించడానికి నూనె లేని పరిస్థితి.

రండి! మానవ జీవిత పరమార్థాన్ని వివరించి, మనిషిగా మన జీవిత లక్ష్యం ఏమిటో శాస్త్రీయంగా వివరించి, సమాజంలో మానవతా విలువలు, సేవా దృక్పథం, శాంతి సామరస్యాలు, నైతిక విలువలు పెంపొందించేలా చేసిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి గురించి తెలుసుకుందాం. ❁



Interest-free Mutually Aided Co-Operative Credit Society Ltd.
SEVA
SEVA MACCS
Branch : Shop No. 1-5-39, Opp: Dist.Civil Court,
Alenoor Bugappa Complex,Civil Lane,
NARAYANPET - 509210
Branch Managing Commitee Members
Osman Obaidullah
Mujahid Siddiqui
Seva BMC President
Cell: 9704444441
Ahmed Khan
BMC Member
9866556895
Arshad Faisal
BMC Member
9866428495
Hussain Pasha
BMC Member
9052099514
Zaheeruddin Sofi
BMC Member
9440832742
Anwar Pasha
BMC Member
9032165596
Hasnuddin Patel
BMC Member
9160197310

# మహాప్రవక్త (స) జననం సర్వమానవాళికి శుభోదయం



**ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట**

**అజ్ఞానం, అంధకారంలో** కూరుకుపోయిన నాటి సమాజంలో ముహమ్మద్ ప్రవక్త(స) జ్ఞానజ్యోతులు వెలిగించారు. విద్యా కుసుమాలను వికసింపజేశారు. జ్ఞానార్జన ప్రతి ఒక్కరి విధి అని ఆయన నిర్దేశించారు. ''జ్ఞానం జీవితం, అజ్ఞానం మరణం'' అని విశదీకరించారు. జ్ఞాన సంపన్నులు, జ్ఞాన విహీనులు సరి సమానులు కాజాలరని స్పష్టం చేశారు.

అంతిమ దైవప్రవక్త(స) తన జీవితంలో అత్యుత్తమ నైతిక విలువలను ఆచరించి, స్థాపించి ప్రపంచానికి ఆదర్శప్రాయుడయ్యారు. అందుకే ఆయన (ప్రవక్త) జననం సర్వ మానవాళికి 'శుభోదయం' అయింది. కేవలం బోధనలతో నైతిక విలువలను సమాజంలో పాదుకొల్పడం సాధ్యం కాదు. బోధకుడు ఆ విలువలను స్వయంగా ఆచరించి ఆ విలువల పునాదులపై సత్సమాజాన్ని సర్వోత్తమ వ్యవస్థను స్థాపించాలి. దాని పరిరక్షకుడు, ప్రచారానికి అన్ని చర్యలు తీసుకోవాలి. దైవప్రవక్త(స) పై విషయాలన్నింటినీ తన జీవిత కాలంలోనే సాధించారు.

మానవజాతి సంస్కరణకు ఎంతోమంది మహనీయులు, మహాత్ములు, ప్రవక్తలు ఈ పుడమిపై ప్రభవించారు. సృష్టి ప్రారంభం నుండి ఈనాటి వరకు అన్ని కాలాల్లో, అన్ని జాతుల్లో, అన్ని దేశాల్లో, అన్ని ప్రాంతాల్లో ఈ మహనీయులు మానవుల సంస్కరణకు విశేషంగా కృషి చేశారు.

ఆది మానవుడు ఆదం(అ) మొదలు నేటివరకు దాదాపు ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది దైవప్రవక్తలు ఈ పుడమిపై ప్రభవించినట్లు ధర్మశాస్త్ర గ్రంథాల ద్వారా మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఈ ప్రవక్తల పరంపరలోని చిట్టచివరి దైవప్రవక్తే మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం).

## జననం

క్రీ.శ. 571 ఏప్రిల్ మాసం 20వ తేదీన సోమవారం నాడు అరేబియా దేశంలోని మక్కా నగరంలో ముహమ్మద్ ప్రవక్త(స) జన్మించారు. ఈయన తల్లి పేరు ఆమినా, తండ్రి పేరు అబ్దు

ల్లాహ్. ఈ మహోన్నత వ్యక్తి జన్మించక ముందే తండ్రిని, ఆరేళ్ళ ప్రాయంలో తల్లిని కోల్పోయారు. అనాథ అయిన ఆ అరేళ్ళ బాబును తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్ అక్కున చేర్చుకున్నారు. ఆయన తరువాత ముహమ్మద్ ప్రవక్త(స) పోషణ, సంరక్షణా బాధ్యతను పెత్తండ్రి అబూ తాలిబ్ స్వీకరించి అల్లారుముద్దుగా పెంచి పోషించారు. చిన్నతనం నుంచే బాల ముహమ్మద్ సుగుణాల రాశిగా ప్రశంసించబడ్డారు.

## సాదిక్... అమీన్‌గా

నీతి, నిజాయితీ, సేవా తత్పరత, సత్యసంధత, విశ్వసనీయత ఆయనకు ఉగ్గుపాలతోనే అలవడ్డాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం, నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించటం లాంటి అనేక సుగుణాల రీత్యా ఆయన ప్రజల మనసులు చూరగొని సాదిక్‌గా, అమీన్‌గా అంటే సత్యసంధునిగా, విశ్వసనీయునిగా పిలువబడ్డారు.

## తల్లిదండ్రుల సేవ

తల్లిదండ్రులను గౌరవించటం, వారి సేవ చేయటం, వారి ఆజ్ఞలను శిరసావహించటం పిల్లల బాధ్యత. ప్రవక్త(స)కు వారి తల్లిదండ్రులకు సేవ చేసే భాగ్యం కలుగలేదు.

అయితే దైవప్రవక్త(స) తల్లిదండ్రుల సేవ, వారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని హితవు పలికారు. దైవప్రవక్త(స)కు పాలుపట్టిన తల్లి దాయి హలీమాను తన సొంత తల్లిగా చూసుకున్నారు.

## సంతానం పట్ల తల్లిదండ్రుల సేవ

తమ పిల్లలను ప్రేమించడం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం, సజ్జనులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేయడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రవక్త(స) తన కుమార్తె హజ్రత్ ఫాతిమాను అమితంగా ప్రేమించేవారు. ఆమెకు ఉన్నతమైన విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారు.

## మిత్రునిగా..

దైవప్రవక్త(స) తన సహచర మిత్రులను చాలా ప్రేమించారు. ఎప్పుడూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవారు. సత్యం విషయంలో ఆయన అందరినీ సమ దృష్టితో చూసేవారు. ధనికులైనా, పేదవారైనా, స్వతంత్రులైనా, బానిసలైనా ప్రతి ఒక్కరి ఆహ్వానాన్ని మన్నించేవారు. వ్యాధిగ్రస్తులు స్వంత వారైనా, పరాయి వారైనా వారి పరామర్శకు వెళ్ళేవారు. ఇతరులను ఆ దిశగా ప్రోత్సహించేవారు.

## అతిథుల హక్కులు

ఎవరైతే అల్లాహ్‌ను, పరలోక దినాన్ని విశ్వసిస్తారో వారు తమ అతిథిని ఆదరించి సత్కరించాలి అని దైవప్రవక్త(స) తెలిపారు. ఆతిథ్యం మూడు రోజుల వరకు ఉంటుంది. మొదటి రోజు విందు, సత్కారింపుల దినం. ఆ రోజు అతిథికి వీలైనంత మంచి అన్న పానీయాలు సమకూర్చాలి. రెండవ రోజు శ్రమించవలసిన అవసరం లేదు. మూడు రోజుల తరువాత అతిథికి చేసే సేవలు సదకా (దానం)గా పరిగణించబడతాయి. ఇంటి వారిని కష్టపెట్టే వరకు బస చేయడం అతిథికి సమంజసం కాదని ఉద్బోధించారు.

## పొరుగువారి హక్కులు

తల్లిదండ్రులు, బంధుమిత్రుల హక్కుల తరువాత ఇరుగు పొరుగు వారితో మంచిగా ఉండాలని, వారితో సత్సంబంధాలు కలిగి ఉండి, మంచిగా ప్రవర్తించాలని ప్రవక్త(స) సూచించారు.

## అనాథల హక్కులు

అనాథలను ప్రేమించడం, పెంచడం, వారి అలనా పాలనా చూడటం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం సాటి మనుషులుగా మన బాధ్యత అని ప్రవక్త(స) తెలిపారు. అనాథలను ఆదుకోండి, ఆర్తులకు భోజనం పెట్టి దాహార్తులకు మంచినీరు అందివ్వాలని నొక్కి చెప్పారు.

## దానశీలిగా

ఒకసారి ఒక వ్యక్తి ఆయన పవిత్ర సన్నిధిలోకి వచ్చాడు. ఆ సమయంలో సుదూరం వరకు గొర్రెల మంద ఉంది. ఆ వ్యక్తి వాటిని చూసి, ప్రవక్తా! నాకు వీటిని దానం చేయగలరా అని అడిగాడు. దానికి ప్రవక్త చిరు మందహాసంతో వాటన్నింటినీ దానం చేసేశారు. అలాగే ఎవరైనా ఏదైనా అడిగితే ఉంటే ఇచ్చేవారు లేకపోతే ఉన్నప్పుడు ఇస్తానని చెప్పి పంపేవారు.

## న్యాయాధిపతిగా

ప్రవక్త(స) ఒక న్యాయాధిపతిగా, ఆదర్శ ప్రాయుడుగా చరిత్రలో నిలిచిపోయారు. సమ న్యాయ వ్యవస్థ, సామాజిక న్యాయ వ్యవస్థను స్థాపించారు. తద్వారా నల్లవారైనా, తెల్లవారైనా, అరబ్బైనా, అరబ్బేతరుడైనా, గొప్ప వంశస్థుడైనా, బానిస అయినా, ప్రవక్త వారి వంశానికి చెందినవారైనా, తెగల సర్దారులైనా న్యాయం, చట్టం, శిక్షల ముందు సమానులైపోయారు.

## భర్తగా

దైవప్రవక్త(స) తన ఇరవై అయిదవ ఏట తనకన్నా వయసులో

పదిహేనేళ్ళు పెద్దదైన, రెండోసారి వితంతువు అయిన ఖదీజాను వివాహమాడి స్త్రీ జనోద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆమెతో అత్యంత సంతోష జీవితాన్ని గడిపారు. ఆమె మరణానంతరం ఇస్లామీయ ఉద్యమ అవసరాలు, అరబ్బు తెగల మధ్య ఐక్యత సాధించడానికి వేర్వేరు తెగల నుంచి వివాహాలు చేసుకున్నారు. వారిలో ఒక్క ఆయిషా(ర) తప్ప మిగతా వారంతా వితంతువులే. కుటుంబ జీవనం భార్యా భర్తల పవిత్ర బంధంతో ప్రారంభమవుతుంది. భార్యాభర్తలిద్దరు సంసారిక జీవితం, దాని నియమాల్ని, బాధ్యతలను సరిగ్గా అర్థం చేసుకొని తదనుగుణంగా నడుచుకుంటే ఆ కుటుంబం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతుందని నిరూపించారు.

## పాలకునిగా

ఒక పాలకునిగా ప్రవక్త(స) ప్రజలందరి కనీస అవసరాలు తీర్చడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకున్నారు. ముస్లిములైనా, ముస్లిమేతర సోదరుడైనా, స్త్రీ అయినా, పురుషుడైనా జన్మరీత్యా అందరూ సమానులే అని పేర్కొన్నారు. పౌరులందరి ధన, మాన, ప్రాణ రక్షణకు భరోసా ప్రసాదించారు. తూనికలు, కొలతలు, వ్యాపారాల్లో జరిగే మోసాలను నివారించి స్వచ్ఛమైన వాణిజ్యాన్ని ప్రపంచానికి అందించారు. జూదం, మద్యపానం, వ్యభిచారం లేని ఒక సుందర సమాజ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. జకాత్, ఫిత్రా, సదఖా లాంటి ఆర్థిక సంస్కరణల ద్వారా కేవలం 10 ఏళ్ల కాలంలో పేదరికాన్ని పారద్రోలి అద్భుతమైన ఆర్థిక మంత్ర దండాన్ని ప్రపంచానికి అందించారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, మానవ హక్కుల పరిరక్షణకు మార్గదర్శక నియమాలు సూచించారు. అన్నిటికంటే మించి మానవులను సృష్టికర్త అయిన దేవునినే ఆరాధించాలని తెలిపారు.

## ప్రపంచానికి ఆదర్శప్రాయుడుగా

కిరీటం లేని చక్రవర్తిగా, సంపద లేని మహారాజుగా, రాజమహలు ఎరుగని పాలకునిగా, హంసతూలికా తల్పం తెలియని మహా మనిషిగా, మరణించే రోజున ఇంటి దీపంలో నూనె సైతం లేని సామ్రాజ్యాధిపతిగా ప్రపంచ చరిత్రలో కనివినీ ఎరుగని నభూతో నభవిష్యత్ లాంటి గొప్ప వ్యక్తిత్వం గల సంక్షేమ రాజ్యస్థాపకునిగా ప్రపంచానికి ఆదర్శప్రాయుడయ్యారు. ❁





# నిండు చందురుడు నిరతం నీ మోమై నిలిచె

హయా

**"కమసలిలల్ హిమారి యహ్మిలు అస్ఫారా** - ఆచరణా శూన్యమైన చదువులు వల్లె వేసేవాడు పుస్తకాలను మోసే గాడిదకు సైదోడు" అని చెప్పిన విజ్ఞాన ఖని ప్రవక్త శిఖామణి (స). **"కబుర మఖ్‌తన్ ఇందల్లాహి అన్ తఖూలూ మాలా తఫ్అలూన్"** - చెప్పే నీతులు పాటించకపోవడం అన్నది దైవానికి కోపం తెప్పించే ప్రక్రియ అని హెచ్చరిస్తూనే, ధనాన్ని తృణీకరించమని ధర్మశాసనాలు వల్లించే ధన స్వాములున్నారు జాగ్రత్త! అని జగతిని జాగరూక పరచిన సత్యోపదేశ స్థితప్రజ్ఞులు ముహమ్మద్(స).

**"అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ ఇల్మిల్ లా యన్ఫవు"** - "దూరంగా ఉంచు ప్రభూ! భక్తిప్రపత్తులు కరువైన హృదయం నుంచి. మానవత్వం మరణించిన మనస్సు నుంచి, చిరునవ్వెరుగని నైరాశ్యం నుంచి, పిల్లల్ని ప్రేమించని అహం నుంచి, పెద్దల్ని గౌరవించని అవిధేయత నుంచి" అన్న ప్రార్థనా పలుకులతో నైతిక విలువల్ని నూరిపోసిన నవయుగ వైతాళికులు ప్రవక్త (స).

'పైపై పశ్చాత్తాపంతో, ఉత్తుత్తి కన్నీళ్ళతో పాపాలు పోవు. పవిత్ర హృదయంతో, నిర్మల మనస్సుతో ప్రభువును వేడుకునే క్షమాభిక్ష వల్లనే పాప ప్రక్షాళనం జరుగుతుంది' అన్నది ఆయన చెప్పిన మాటే. 'తాత్కాలికంగా తళుక్కుమని, తర్వాత చతికిలబడే అమిత కార్యాచరణకన్నా - నిరంతరం నిత్య చైతన్యరూపంలో అలరారే, గల గల పారే భక్తి ప్రవాహమే మిన్న' అన్న మాట ఆయన నోట జాలువారినదే. 'దైవకీర్తన చేయనివాళ్లు జీవచ్ఛవాలు, దైవ సంకీర్తనం ఆలాపించేవాళ్లు నిత్య చైతన్యవ్రతులు' అన్న ఉపమానం ఆయన ఇచ్చినదే. 'మీరు ధర్మాత్ములుగా రూపొంది ప్రజల పట్ల నిరపేక్షతో ఉంటే, అందరి హృదయ బంధువులవుతారు. మీరు కరుణాత్ములుగా మసలితే దైవ కటాక్షానికి పాత్రులవుతారు' అన్న మహితోక్తిని చెప్పిన వారు మహాప్రవక్త ముహమ్మద్ (స).

మహాప్రవక్త ముహమ్మద్ (స) వారిది మధుర ధ్వని. అగ్రజుల వారిది సువ్యక్త సముదాత్త రసావేశ సత్యస్వర ధుని. సంఘ సంస్కర్త పండితాగ్రేసర ప్రవక్తలందరి నాయకమన్యులు ముహమ్మద్ (స). ఆయన అమృత పలుకుల్లో దివ్యావిష్కృతి సాక్షాత్కరించింది. సత్యసంధత సంపెంగలు, దయార్ద్రత దానిమ్మ మొగ్గలు, మమతల మొగలి పూరేకులు, వాత్సల్య వేపపూలు, సాత్వికత సన్నజాజులు, ప్రేమ పారిజాతాలు, అనురాగ అడవి మల్లెలు, సుగుణాల గులాబీలు, గుల్ మొహర్లు విలక్షణ

రేఖల్లో, రూపాల్లో ఆయనలో ఘనీభవించాయి. ఆయనలో ప్రకృతి సౌందర్య సుకుమార సుమ దర్శనమూ ఉంది. పరలోక పరిచింతన పరిమళమూ ఉంది. ఆయన మాటలు అక్షరాలా పోతపోసుకున్న దివ్యా విష్కృతి మూటలు, సత్యధర్మ సురుచిర మందహాసాలు. సత్యగ్రంథ సుందర సూక్తుల సుమనోహర చంద్రహాసాలు. అవి ముత్యాలు పొదిగిన హారం వలె రసరమ్యంగా, అందంగా, అతి సౌమ్యంగా జాలువారు తుంటాయి. సత్యవాక్కుల సెలయేటి నీటి వలె గలగలా పారుతూ ఉంటాయి - సత్యశోధక పురుషోత్తముల వైపు, సత్య పిపాస కమనీయ కరుణధ్యేయ హృదయాల వైపు.

దివ్య గ్రంథాల సారాంశ మకరందాన్ని రసీకరించుకున్న రసూల్‌గా, మానవాత్మ ధాత్రిని షిర్క్ నుండి విముక్తం చేసి, తౌహీద్ తన్మయ తరంగాలలో ఓలలాడించిన మానవ మహోపకారిగా, తన పసిడి పలుకే మేలుకొల్పుగా మనుజ జాతిని నడిపించిన వక్తృత్వమూర్తిగా, వారథిగా, రథసారథిగా ముహమ్మద్ (స) వారి వ్యక్తిత్వం మానవాళికి మచ్చుతునక, మానవత్వానికే తలమానికం. అందుకే ఆ సుగుణాగ్రజుణ్ణి జీవితపు అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా పేర్కొన్నాడు అల్లాహ్. **"నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీల శిఖరాధిరోహుడవు- మహోగ్ర సౌశీల్యవంతుడవు"** (అల్ ఖలమ్ : 4). **"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు ఉత్తమ ఆదర్శం ఉంది"** (అల్ అహ్జాబ్ : 21).

ఆయన (స) ప్రజల కోసం పుట్టి, ప్రజల కోసం పెరిగి, విశ్వశాంతి కోసం పాటుపడుతూ జీవించారు. అది చూసి అల్లాహ్ ఇలా అన్నాడు: **"(ఓ ముహమ్మద్!) ఒకవేళ జనులు ఈ ఉపదేశాన్ని విశ్వసించకపోతే నువ్వు వారి వెనుక దుఃఖంతో కుమిలిపోతూ నీ ప్రాణాలు పోగొట్టుకుంటావా ఏమీ?"** (అల్ కహ్ఫ్ : 6).

తలపై మిలమిలలాడే పచ్చని తలపాగ, తళతళ మెరిసే కుండల పాశము. చెక్కిళ్ళపై జీరాడే నీలాల ముంగురులు. అందమైన అంగ సౌష్టవం, సుందర దేహంతో మదీనాలో ప్రవేశిస్తుండగా ఆ పుర ప్రజలు పరుగులిడిరి అభిమానం ముసురుకోగా!

అది మదీనా చరిత్రలోనే కనీ వినీ ఎరుగని మహోజ్వలమైన రోజు. నగర వాడవాడల్లో, వీధుల్లో దైవ సంకీర్తనలు మిన్నంటుతున్నాయి. అన్సార్ బాలికలు సంతోషాతిరేకంతో గేయాలాపనలు చేస్తున్నారు ...

"మాపై నిండు చందురుడు ఉదయించాడు
'వదా' పర్వత శిఖరాల మధ్య నుండి
అభివందనాలు, దైవానికి ధన్యవాదాలు మాపై తప్పనిసరి
ప్రార్థించేవారు అల్లాహ్‌ను ప్రార్థించగా
మాలో ప్రభవించిన ఓ పూర్ణ చంద్రమా! పురుషోత్తమా!
నీ అమృత ప్రవచనాలే మాకు వీనుల విందు!"

❀

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా
పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# గొర్రెల కాపరి అయిన రాజాధిరాజు

**అడియార్**

**ప్రవక్తలకు** నాయకుడయిన ఈ మహావ్యక్తి జననమొందిన నాటి నుంచీ మానవ జాతికే ఒక అపురూపమయిన ఆదర్శప్రాయుడుగా నిలిచి జీవితం గడిపారు.

ఎందరో మహనీయులు తమ జీవితారంభంలో, యవ్వన దశలో విశృంఖలంగా, అల్లరిచిల్లరగా ప్రవర్తించినట్లు చరిత్రకారులు చెపుతుంటారు.

బాల్యం నుంచే కళ్ళు తెరిచి ఈ ప్రపంచాన్ని చూసిన మరునాటి నుంచే- ఆగ్రహంతో అరవటంగాని, అన్యాయానికి తలవంచటంగాని చెయ్యని అపురూపమయిన జీవితం గడిపినవారు ఈ మానవతామూర్తి ఒక్కరే.

అబూ తాలిబ్ అన్న పేరు గల వీరి పెత్తండ్రి ధనధాన్యాదులు గల సంపన్నులు కారు- బీదవాడు.

అటువంటి బీద వ్యక్తి తమని ఆదరించి, పెంచి పెద్ద చేశారన్న కృతజ్ఞతా భావం అగ్రజునికి ఎప్పుడూ ఉన్నది. పెత్తండ్రి ప్రాపుతో పెరిగి పెద్దవాడినయ్యానన్న విషయం ఆయన ఏనాడూ మర్చిపోలేదు.

అందుచేత పెత్తండ్రికి తాము భారమై ఉండరాదు-అన్న ఉద్దేశ్యంతో ఈ మహా మనీషి కూలికోసం మేకలనీ, గొడ్లనీ మేపే పశువుల కాపరి వృత్తి చేపట్టారు.

పురుషోత్తమా!

యావత్ ప్రపంచానికి ఉత్తమ మార్గం చూపించ వచ్చినవాడా!

అరబ్బులకి విజ్ఞాన వివేచనా మార్గం ప్రబోధించ వచ్చినవాడా!

రాజాధిరాజా!

అసంఖ్యాకమయిన- సైనిక వాహిని గల రోమన్ సామ్రాజ్యాన్ని పాదాక్రాంతం చేసుకున్నవాడా!

అంతులేని ధనరాసులు, వజ్ర వైఢూర్యాలు, వెండి బంగారాలపై నడిచే ముస్లిమ్ రాజ్యాన్ని స్థాపించిన మహానుభావా!

మీరు బాల్యంలోనే- గొర్రెల్ని మేపుతూ, కుటుంబ భారాన్ని మీ భుజాలపై వేసుకున్నారన్నది చదువుతున్నప్పుడు- కన్నీళ్ళు చిందుతున్నాయి!

ఇటువంటి అపురూప వ్యక్తిని ప్రవక్తగా, నాయకునిగా పొందటానికి ముస్లిమ్ ప్రజ ఎంత అదృష్టం చేసుకున్నారో గదా!

ఒక్క పశువుల కాపరిగా మటుకేనా? తను ఎవరికి భారం కాకూడ దన్న ఉద్దేశ్యంతో పన్నెండేళ్ళు నిండకమునుపే... స్వదేశం వదలి, పరాయి దేశానికి వర్తకానికై వెళుతున్న పెత్తండ్రి వెంట వెళ్ళారు- ఆయనకి సహాయకునిగా.

తన ఇంట్లోని బంధువులకే కాదు, కదలలేని వృద్ధులు, నిరాధారు లయిన బీదవారి ఇళ్ళకు వెళ్ళేవారు.

"నేను అంగడి వీధికి వెళుతున్నాను. మీకేదయినా కావాలా? సరుకులు తెచ్చి పెట్టమంటారా?" అని పని మీద బయటికి వెళ్ళే ముందు అడిగేవారు.

వారివద్దనున్న సరుకులు తీసుకెళ్ళి, అమ్మి, తిరిగి వస్తూ బరువైన మూటలు మోయటానికి అలవిగాని, అతి భారమయిన మూటలు మోసుకొచ్చి ఈ వృద్ధ మాతలకి ఇస్తూ ఉండేవారు.

ఆడి తప్పని ఈ సత్యసంధుడు- ఇచ్చిన మాటను ఎలా నిలబెట్టు కునేవారో, సత్యవాక్కుకి ఎటువంటి అపూర్వమయిన విలువ నిచ్చేవారో ఉదాహరణగా ఒక సంఘటన ఇది-

ఒక స్నేహితుడు- "మీరు ఆ వీధిలో ఆ అంగడి పక్కన నుల్చుని ఉండండి- నేను వచ్చి కలుసుకుంటాను" అన్నారట.

అగ్రజులు ఆ స్నేహితుడు నిర్దేశించిన స్థలంలో నుల్చున్నారు.

ఒకరోజు గడిచింది.

రెండో రోజు కూడా వెళ్ళిపోయింది.

మూడో నాడు కూడా గడిచిపోతూ ఉంది.

అదే చోటున అగ్రజులు నుల్చుని ఉన్నారు.

ఆయనని అక్కడ నుల్చోమని చెప్పిన విషయం ఆ అవతల వ్యక్తి మర్చిపోయారు. అనుకోకుండా ఆ దారి వెంట గబగబా నడిచివస్తున్న ఆ మిత్రుడు, నడుస్తూ నడుస్తూ కొట్టు పక్కన నుల్చుని ఉన్న ఈయన్ని చూసి ఆశ్చర్యపోయి-

"అరే- మీరిక్కడే నిల్చుని ఉన్నారా?" అని సిగ్గుపడుతూ అడగ్గా... ఈషణ్ మాత్రం కోపంగాని, విసుగు గాని ప్రదర్శించక చిరు నవ్వుతో "మీరే కదా ఇక్కడ నిల్చుని ఉండమన్నారు?" అని ప్రశ్నించారు ఆ సహనశీలి.

అందుచేతనే అమీన్(విశ్వసనీయుడు) అని, సాదిక్ (సత్య సంధుడు) అని ప్రేమపూరితంగా- ప్రజలు కొనియాడారు ఈ మహా వ్యక్తిని.

ఇటువంటి విశ్వసనీయుని, సత్యవంతుని భర్తగా స్వీకరించింది సంపన్నురాలయిన ఖదీజా.

అప్పటికే ఆమె ఇద్దరు భర్తలని కోల్పోయి, వితంతువుగా జీవితం గడుపుతూ ఉంది.

ఆమె అగ్రజునికంటే వయసులో పదిహేనేళ్ళు పెద్ద. ఆమె సౌశీల్యవతి, పవిత్రురాలు (తాహిరా) అని అందరిచేత గౌరవించ బడుతోంది. మూలుగుతున్న ధనరాసులకామె స్వంతదారు.

వయసులో పెద్దదైన ఖదీజా అగ్రజుని పాణిని గ్రహించి ఆయన జీవిత భాగస్వామిగా-

కాసిమ్, అబ్దుల్లాహ్ (తాహిర్), జైనబ్, రుకియా, ఉమ్మె కుల్‌సూమ్, ఫాతిమా- అనే ఆరుగురు సంతానానికి జన్మనిచ్చారు. ఈ ఆరుగురిలో మొదటి ఇద్దరు మగపిల్లలూ బాల్యంలోనే మృత్యు వాత పడ్డారు.

ఈ వివాహం చేత అగ్రజులు వర్తక వ్యాపారాలలో నిలదొక్కు కోటానికి- కొంత అవకాశం చిక్కిందని చెప్పుకోవాలి.

చిరకాలంగా ఆయన మనసులో ఉన్న సన్మార్గ నడవడికలో పయనించవలెనన్న కోర్కె ఫలించటానికి ఈ వివాహం కొంత దోహదపడింది.

గృహస్థుగా ఉండి, సంసార జీవితం గడుపుతూ కూడా, నూతన మార్గమున పయనించి, సందేశ ప్రబోధము చేసినవారు ముహమ్మద్ ప్రవక్త ఒక్కరే.

గౌతమ బుద్ధుడు : ఒక రాజ్య పరిత్యాగి.

శంకరాచార్యులు : పెండ్లికాని బ్రహ్మచారి.

ఏసు క్రీస్తు : పెండ్లికాని వారు.

తీర్థంకరుడు : సర్వసంగ పరిత్యాగి.

మత గురువులు, కొత్త మార్గాన పయనించే ప్రబోధకులు, వీరిలో ఎక్కువ భాగం సర్వసంగ పరిత్యాగులో, పెళ్ళి చేసుకోని బ్రహ్మచారులుగానో అయి వుంటారు.

కాని, అగ్రజులు ఒక్కరే లౌకికమయిన గృహస్థు జీవితం గడిపారు. ఇంకా చెప్పాలంటే- బహు భార్యలు, పలు వివాహాలని ప్రబోధించి, అనుమతించిన మత మార్గానికి నాయకులయి ఉండి కూడా సపత్నీ వ్రతాన్ని చేపట్టిన పవిత్ర మూర్తి ఈయన.

అమీన్ అనీ, సాదిక్ అని ప్రశంసించబడిన ఈ మహోన్నత మూర్తి- కొత్త మార్గం గూర్చి బోధించటం మొదలు పెట్టేసరికి, అప్పటిదాకా ఆయనని మెచ్చుకున్న యావన్మందీ ఆయనని ప్రతిఘటించి, దూషించటం మొదలుపెట్టారు.

ఎందుకని? మానవ చరిత్రలో ఇంతవరకూ ఏ విప్లవ నాయకుడూ చెప్పని విషయం ఒకటి- తల్చుకుంటేనే హృదయం కంపించి పోయేటటువంటి విషయం ఒకటి- ఈ మహా వ్యక్తి ప్రస్తావించటం ఆరంభించారు.

# ఇస్లామ్ సమాచార కేంద్రము
# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఐఐసి)

IIC

Discover Islam
Explore, Don't Ignore

www.iicindia.in

## Islamic Information Center

ఇస్లామ్ ధర్మానికి సంబంధించిన సమాచారం, అపోహలు, అపార్థాలను దూరం చేయడం కోసం ఏర్పాటు చేయబడిన మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

ఉదయం 8 గంటల నుండి
రాత్రి 12 గంటల వరకు
మా కాల్ సెంటర్ పని చేస్తుంది.

తెలుగు, హిందీ, ఇంగ్లీష్, తమిళం, కన్నడ, మరాఠి, బెంగాలీ భాషలలో మీ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు....

మీ మొబైల్ ఫోన్ నుండి లేదా
ల్యాండ్ లైన్ నుండి మా టోల్ ఫ్రీ నెంబర్
**1800 572 3000** కు
ఉచితంగా ఫోన్ చేసి మీ సందేహాలను
నివృత్తి చేసుకోవచ్చు, ఇస్లామ్ కు
సంబంధించిన సరైన పరిజ్ఞానాన్ని పొందవచ్చు

ముస్లిమ్ మహిళలు పరదా ఎందుకు ధరిస్తారు?
రమజాన్ నెలలో ఎందుకు ఉపవాసం ఉంటారు?
వడ్డీ, మద్యపానం, జూదం ఇస్లామ్‌లో ఎందుకు నిషేధం?

ఇలా ఎన్నో.... సందేహాల సమాధానాల కోసం
ఈ రోజే మా కాల్ సెంటర్‌కు ఉచితంగా ఫోన్ చేయండి.

టోల్ ఫ్రీ



**1800 572 3000**



—————oo—————

**SCAN AND PAY**
Using any UPI/ Bharat QR/ Banking Apps


Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**